పోతన తెలుగు భాగవతాంతర్గత

శ్రీకృష్ణ లీలలు – 5

[ప్రలంబాసుర వధ - వేణు విలాసము]



భాగవత గణనాధ్యాయి

2026

అనుక్రమణిక

శ్రీకృష్ణ లీలలు – 5

[ప్రలంబాసుర వధ - వేణు విలాసము]

ప్రార్థన

10.1-1-క. *

శ్రీకంఠచాప ఖండన!
పాకారిప్రముఖ వినుత భండన! విలస
త్కాకుత్థ్సవంశమండన!
రాకేందు యశోవిశాల! రామనృపాలా!

టీక:- శ్రీకంఠచాపఖండన = శ్రీరామ {శ్రీకంఠచాపఖండనుడు - శ్రీకంఠుని (శోభాకర కంఠుడు యైన శివుని) చాప (విల్లును) ఖండనుడు (విరిచినవాడు), రాముడు}; పాకారిప్రముఖ వినుత భండన = శ్రీరామ {పాకారి ప్రముఖ వినుత భండనుడు - (పాకాసురుని శత్రువైన ఇంద్రుడు) మున్నగువారి చేత వినుత (పొగడబడిన) భండన (యుద్ధము కలవాడు), రాముడు}; విలసత్కాకుత్థ్స వంశ మండన = శ్రీరామ {విలసత్కాకుత్థ్స వంశ మండనుడు - విలసత్ (ప్రసిద్ధి కెక్కిన) కాకుత్థ్సవంశ (కకుత్థ్సమహరాజవంశమునకు) మండనుడు (అలంకారమైన వాడు), రాముడు}; రాకేందు యశోవిశాల = శ్రీరామ {రాకేందు యశోవిశాలుడు - రాకేందు(నిండుపున్నమిచంద్రుని)వంటి యశః(కీర్తి) విశాలుడు(విరివిగాకల వాడు), రాముడు}; రామ = రాముడనెడి {నిండుపున్నమి చంద్రునిపదహారు కళలు, 1అమృత 2మానద 3పూష 4 తుష్టి 5పుష్టి 6రతి 7ధృతి 8శశిని 9చంద్రిక 10కాంతి 11జ్యోత్స్న 12శ్రీ 13ప్రీతి 14 అంగద 15పూర్ణ 16పూర్ణామృత}; నృపాల = రాజా.

భావము:- శ్రీరామచంద్ర ప్రభు! నీవు క్షీరసాగరమథన సమయంలో పుట్టిన హాలాహలమును కంఠమున ధరించుట ద్వారా లోకాలు సమస్తమునకు శోభను అనుగ్రహించిన శివుని ధనుస్సు విరిచిన మొనగాడవు. ఇంద్రుడు మొదలైన దేవతలు సైతం కీర్తించేలా యుద్ధం చేసిన వాడవు. ప్రసిద్ధమైన కాకుత్థ్స వంశానికి అలంకార మైనవాడవు. నిండు పదహారుకళలపూర్ణచంద్రుని లాంటి కీర్తి మెండుగా వ్యాపించిన వాడవు. ప్రజలకి ఆనందం పంచే మహారాజువి.

కార్చిచ్చు చుట్టుముట్టుట

10.1-713-వ.

ఇట్లు పరమ సంతోషులై ఘోషజను లా రేయి కాళిందీతటంబున నాఁకలి నీరుపట్టుల డస్సి క్రుస్సి, గోవులుం దారు నుండ నగణ్యంబగు న య్యరణ్యం బున నొక్కదవానలంబు పుట్టి చుట్టుముట్టుకొని నడురేయి నిద్రితంబైన వ్రజంబుమీఁద గదిసిన నదిరిపడి లేచి, దందహ్యమాన దేహులై సకల జనులును మాయా మనుజ బాలకుండైన హరికి శరణాగతులై యిట్లనిరి.

టీక:- ఇట్లు = ఇలా; పరమ = మహా; సంతోషులు = ఆనందము పొందిన వారు; ఐ = అయ్యి; ఘోష = మందలోని; జనులు = ప్రజ లందరు; ఆ = ఆయొక్క; రేయి = రాత్రి; కాళిందీ = యమునానదీ; తటంబునన్ = తీరము నందు; ఆకలిన్ = ఆకలిచేత; నీరుపట్టులన్ = దాహములచేత; డస్సి = బడలికచెంది; క్రుస్సి = నీరసించి; గోవులున్ = ఆవులు; తారున్ = వారు; ఉండన్ = ఉండగా; అగణ్యంబు = ఎంచ రానిది; అగు = ఐన; ఆ = ఆయొక్క; అరణ్యంబునన్ = అడవి యందు; ఒక్క = ఒకానొక; దవానలంబు = కార్చిచ్చు; పుట్టి = జనించి; చుట్టుముట్టుకొని = చుట్టు ముట్టి; నడురేయి = అర్ధరాత్రి సమయము నందు; నిద్రితంబు = నిదురపోయినవారు గలది; ఐన = అయిన; వ్రజంబు = మంద; మీదన్ = పైన; కదిసినన్ = కమ్ముకొనగా;

అదిరిపడి = ఉలిక్కిపడి; లేచి = మేలుకొని; దందహ్యమాన = కాలుచున్న; దేహులు = శరీరముకలవారు; ఐ= అయ్యి; సకల= ఎల్ల; జనులును= ప్రజలు; మాయా= మాయ చేతనైన; మనుజ = మానవ; బాలకుండు = చిన్నపిల్లవాడు; ఐన = అయిన; హరి = కృష్ణుని; కిన్ = కి; శరణాగతులు = శరణుజొచ్చినవారు; ఐ = అయ్యి; ఇట్లు = ఇలా; అనిరి = పలికిరి.

భావము:- అప్పుడు గోకులవాసులు పరమ సంతోషంతో ఆ రాత్రి యమునా నదీతీరాన ఉండిపోయారు. ఎవరికీ అన్నమూనీళ్ళులేవు. అందరూనీరసించి గోవుల తోపాటు అక్కడ ఉండిపోయారు. అరణ్యంలో ఆరాత్రి ఒక పెద్ద దావాగ్ని పుట్టింది. నిద్రిస్తున్న గోకులవాసులను చుట్టుముట్టి మీద మీదకి వచ్చింది. వారందరూ శరీరాలు కాలిపోతూంటే మాయా గోపాలుడైన ఆ శ్రీహరిని శరణాగతులై ఇలా ప్రార్థించారు.

10.1-714 -మ.

"అదె వచ్చెన్ దవవహ్ని ధూమకణ కీలాభీల దుర్వారమై
యిదె కప్పెన్ మము నెల్లవారి నిట మీఁ దేలాగు రక్షింపు; నీ
పదపద్మంబులకాని యొండెఱుఁగ; మో పద్మాక్ష! యో కృష్ణ! మ్రొ
క్కెద మో! రామ! మహాపరాక్రమ! దవాగ్నిన్ వేగ వారింపవే.

టీక:- అదె = అదిగో; వచ్చెన్ = వచ్చేస్తున్నది; దవవహ్ని = దావాగ్ని; ధూమ = పొగచేతను; కణ= ధూళిచేతను; కీలా = మంటలచేతను; ఆభీల = భయంకరత్వము చేతను; దుర్వారంబు = ఆపరానిది; ఐ = అయ్యి; ఇదె = ఇదిగో; కప్పెన్ = కమ్ము కొనెను; మమున్ = మమ్ములను; ఎల్లవారిని = అందరిని; ఇట = ఇక; మీదన్ = పైన; ఏలాగు = ఎలాగోఏమిటో; రక్షింపు = కాపాడుము; నీ = నీయొక్క; పద = పాదములు అనెడి; పద్మంబులున్=పద్మములు; కాని=తప్పించి; ఒండు = ఇతరము; ఎఱుంగము = ఎరుగము; ఓ = ఓయీ; పద్మాక్షా = కృష్ణా {పద్మాక్షుడు - పద్మములవంటి కన్నులు గలవాడు, కృష్ణుడు}; ఓ=ఓయీ; కృష్ణా= కృష్ణా; మ్రొక్కెదము = నమస్కరించెదము;

ఓ = ఓయీ; రామ = బలరాముడా; మహాపరాక్రమ = గొప్పపరాక్రమశాలి; దవాగ్నిన్ = కార్చిచ్చును; వేగన్ = శీఘ్రముగా; వారింపవే = అణచివేయుము.

భావము:- “అదిగో అదిగో దావాగ్ని వచ్చేస్తోంది. పొగలతో, నిప్పురవ్వలతో, అగ్నిజ్వాలలతో ఆపడానికి వీలులేకుండా వచ్చేస్తున్నది. ఇదిగో మమ్మల్ని అందరిని ఆవరించింది. ఇప్పు డేమి చేయడం. ఓ కృష్ణా! పద్మాక్షా! పరాక్రమంతుడవైన బలరామా! మీకు నమస్కరిస్తూన్నాము. మీ పాదపద్మాలు తప్ప మేమేమి ఎరుగము. దావాగ్నిని నివారించి మమ్ము రక్షించండి.

10.1-715-క.

నీ పాదంబులు నమ్మిన

నాపద లెక్కడివి? జనుల కత్యుగ్ర మహా

దీపిత దావజ్వలనము

పైఁబడ కుండెడి విధంబు భావింపఁగదే."

టీక:- నీ= నీయొక్క; పాదంబులున్= పాదములను; నమ్మిన = నమ్ముకొన్నచో; ఆపదలు = కష్టములు; ఎక్కడివి = రానేరావు; జనుల్ = ప్రజల; కున్ = కు; అతి = మిక్కిలి; ఉగ్ర = భయంకరమైన; మహా = అధికముగ; దీపిత = మండుచున్న; తాప = అతి వేడి గల; జ్వలనము = అగ్ని; పైన్ = మీద; పడక = కమ్ముకొనకుండ; ఉండునట్టి = ఉండెడి; విధంబున్ = దారిని; భావింపగదే = ఆలోచించుము.

భావము:- నీ పాదాలను సెర నమ్మినవారికి ఆపదలు ఎక్కడ ఉంటాయి? తీవ్రమైన భయంకరమైన దావాగ్నిని మా మీదకు రాకుండా నివారించవయ్యా!.”

10.1-716-వ.

అని ఘోషించు ఘోషజనులం గరుణించి జగదీశ్వరుండగు ననంతు డనంతశక్తియుక్తుం డై గహనంబు నిండిన దావదహనంబు పానంబు చేసిన, విజయగానంబు దశదిశల నిగిడె; నంత రామకృష్ణులు గోగణ

జ్ఞాతిసహితులై మందయానంబున మందకుంజని; రిట్లు రామకేశవులు గోపాలబాల వేషంబులఁ గ్రీడించు సమయంబున.

టీక:- అని = అని; ఘోషించు = మొత్తుకుంటున్నట్టి; ఘోష = మందలోని; జనులన్ = ప్రజలను; కరుణించి = దయచూపి; జగదీశ్వరుండు = విశ్వానికి ప్రభువు; అగు = ఐన; అనంతుండు = ఆద్యంత రహితుడు; అనంతశక్తియుక్తుండు = అంతు లేని శక్తి గలవాడు; ఐ = అయ్యి; గహనంబు = అడవి నంతటను; నిండిన = ఆక్రమించిన; దావదహనంబున్ = కార్చిచ్చును; పానంబు = తాగుట; చేసిన = చేసినట్టి; విజయగానంబు = విజయగీతము; దశదిశలన్ = అన్నిపక్కలకు {దశ దిశలు - దిక్కులు 4 (తూర్పు, దక్షిణము, పడమర, ఉత్తరము) మూలలు 4 (ఈశాన్యము, ఆగ్నేయము, నైరృతి, వాయవ్యము) పైనకింద 2, మొత్తం పది}; నిగిడెన్ = ప్రసరించెను; అంతన్ = అప్పుడు; రామ = బలరాముడు; కృష్ణులున్ = కృష్ణుడు; గో = గోవుల; గణ = మందతోను; జ్ఞాతి = బంధువులతోను; సహితులు = కూడినవారు; ఐ = అయ్యి; మంద = మెల్లని; యానంబున = నడకతో; మందకున్ = వ్రేపల్లె; కున్ = కు; చనిరి = వెళ్ళిరి; ఇట్లు = ఈ విధముగ; రామ = బలరాముడు; కేశవులున్ = కృష్ణుడు; గోపాల = యాదవుల; బాల = పిల్లల; వేషంబులన్ = రూపములందు; క్రీడించు = విహరించెడి; సమయంబునన్ = సమయము నందు.

భావము:- ఇలా ఘోషిస్తూన్న గోకులప్రజలను కృష్ణుడు కరుణించాడు. జగదీశ్వరు డైన కృష్ణుడు అనంతమైన తన మహాశక్తితో అడవిలో వ్యాపించిన దావాగ్నిని త్రాగేశాడు.

అతనిని స్తుతిస్తూ జయజయ గానాలు పదిదిక్కులలోనూ ఒక్కసారిగా వ్యాపించాయి.

బలరామ కృష్ణులు తమ వారితో కూడి తమ పల్లెకు మెల్లగా తిరిగి పెళ్ళారు. ఈ విధంగా బలరామకృష్ణులు క్రీడిస్తూన్న సమయంలో వేసవికాలం వచ్చింది.

గ్రీష్మఋతు వర్ణనము

10.1-717-సీ.

దినము లంతంతకు దీర్ఘంబులై యుండ-

దిననాథుఁ డుత్తుర దిశఁ జరించె;

నాఁటినాటికి నెండ నవ్యమై ఖర మయ్యె-

పెచ్చని గాడ్పులు విసరఁ జొచ్చె;

మేదినీరేణువుల్ మింట సంకుల మయ్యె-

నేఱులుఁ గొలఁకులు నిగిరిపోయెఁ;

బానీయ శాలలఁ బథిక సంఘము నిల్చెఁ-

జప్పరంబుల భోగిచయము డాఁగెఁ;

10.1-717.1-ఆ.

దరులఁ గుసుమ చయము దళములతో వాడె;

మిథునకోటికి రతి మెండు దోఁచె;

నఖిలజంతుభీష్మమైన గ్రీష్మము రాకఁ

గోలి యడవులందుఁ గేలి సలిపె.

టీక:- దినములు = పగళ్ళు; అంతకంతకు = అంతటంతటికి; దీర్ఘంబులు = పెద్దవి; ఐ = అగుచు; ఉండన్ = ఉండగా; దిననాథుడు = సూర్యుడు {దిననాథుడు - పగళ్ళకు అధిపతి, సూర్యుడు}; ఉత్తరదిశ = ఉత్తరపువైపు, ఉత్తరాయణమున; చరించెన్ = తిరుగసాగెను; నాటినాటికి = రోజురోజుకి; ఎండ = ఎండ; నవ్యము = కొత్తది; ఐ = అయ్యి; ఖరము = తీక్షణము; అయ్యెన్ = అయినది; పెచ్చని = వేడి; గాడ్పులు = ఉష్ణవాయువులు; విసరన్ = వీచుట; ఛొచ్చెన్ = మొదలిడెను; మేదినీ రేణువు = ధూళిధూసరితములు; మింటన్ = ఆకాశమునందు; సంకులము =

రేగినవి; అయ్యెన్ = అయినవి; ఏఱులున్ = కాలువలు; కొలకులున్ = చెరువులు; ఇగిరి = ఎండి; పోయినవి = పోయినవి; పానీయశాలలన్ = మంచినీటి పందిరుల లందు; పథిక = బాటసారులు; సంఘము = సమూహము; నిల్చెన్ = నిలబడిపో తుంటిరి; చప్పరంబులన్ = మంచెపట్టు లందు; భోగి = పాముల; చయమున్ = సమూహములు; డాగి = దాగుకొనెను; తరులన్ = చెట్ల; కుసుమ = పూల.

చయమున్ = గుత్తులు; దళముల = పూరేకుల; తోన్ = తోటి; వాడెన్ = వాడిపోయినవి; మిథున=దంపతుల; కోటి= సమూహములు; కిన్=కు; రతి= భోగము లందు; మెండు = అధిక్యము; తోచెన్ = కనిపించసాగెను; అఖిల = సమస్తమైన; జీవులకు = జంతువులకు; భీష్మము = భయంకరమైనది; ఐన = అయిన; గ్రీష్మము = గ్రీష్మఋతువు; రాకన్ = వచ్చినప్పుడు; కీలి = అగ్నిదేవుడు; అడవుల = అడవుల; అందున్ = లో; కేళి = క్రీడగా; సలిపెన్ = గడిపెను.

భావము:- అలా గ్రీష్మఋతువురావడంతో పగటి సమయాలు అంతకంతకూ పెరుగుతూ ఉన్నాయి. సూర్యుడు ఉత్తర దిక్కు వైపు సంచరిస్తున్నాడు. ఎండ రోజు రోజుకి తీక్షణం అవుతోంది. వేడి గాడ్పులు విసురుతున్నాయి. భూమి నుండి లేచిన ధూళిరేణువులు గాలిలో ఆకాశమంతా వ్యాపించాయి. సెలయేళ్ళలో కొలనులలో నీళ్ళు ఇగిరిపోయాయి. చలివేంద్రశాలలో బాటసారులు చేరుతున్నారు. పాములు ఎండలు భరించలేక పొదలలో దూరిపోయాయి. చెట్లు పూలు ఆకులతో సహా మాడిపోయాయి. సర్వజీవులకూ భయంకరమైన గ్రీష్మ ఋతువు రావడంతో అగ్నిదేవుడు అడవులతో ఆడుకోసాగాడు.

10.1-718-ఆ.

వాఁడిరుచులు గలుగువాని వేఁడిమి గ్రీష్మ
కాలమందు జగము గలయఁబడియె
బ్రహ్మ జనులకొలకు బ్రహ్మాండఘటమున
నుష్ణరసముఁ దెచ్చి యునిచె ననఁగ.

టీక:- వాడి = తీక్ష్ణమైన; రుచులు = కిరణములు; కలుగువాని = ఉండువాని. సూర్యుని; వేడిమి = వేడి; గ్రీష్మకాలము = గ్రీష్మఋతువు; అందున్ = అందు; జగము = లోకమున; కలయబడియె = కమ్ముకొనెను; బ్రహ్మ = బ్రహ్మదేవుడు; జనుల = ప్రజల; కొఱకున్ = కోసము; బ్రహ్మాండ = బ్రహ్మాండ మనెడి; ఘటమున = భాండ మున; ఉష్ణ = వేడి అనెడి; రసమున్ = రసమును; తెచ్చి = తీసుకు వచ్చి; ఉనిచెను = ఉంచెను; అనగ = అన్నట్లుగా.

భావము:- తీవ్రమైన కిరణాలు కల సూర్యుని వేడికి ఆ వేసవికాలంలో లోకమంతా కలవరపడిపోయింది. బ్రహ్మదేవుడు ఈ బ్రహ్మాండమనే భాండంలో ఉష్ణ రసాన్ని తెచ్చి ఈ జనులందరి కోసం నింపాడా అన్నట్లు ఉంది.

10.1-719-వ.

ఇట్లాభీలంబైన నిదాఘకాలంబు వర్తింప బృందావనంబు రామ గోవింద మందిరంబైన కతంబున నిదాఘకాల లక్షణంబులం బాసి, నిరంతర గిరి నిప తిత నిర్ఝర శీకర పరంపరా భాసిత పల్లవిత కుసుమిత తరులతంబ య్యును, దరు లతా కుసుమ పరిమళ మిళిత మృదుల పవనం బయ్యును, బవనచలిత కమల కల్హార సరోవర మహాగభీర నదీహ్రదం బయ్యును, నదీ హ్రద కల్లోల కంకణ ప్రభూత పంకం బయ్యును, బంక సంజనిత హరితాయ మాన తృణ నికుంజ బయ్యును, జనమనోరంజనంబయిన వసంతకాల లక్షణంబులు గలిగి లలితమృగపక్షి శోభింతంబై యొప్పుచుండె; మఱియు నందు.

టీక:- ఇట్లు= ఈవిధముగ; ఆభీలంబు= భయంకరమైనది; ఐన = అయినట్టి; నిదాఘకాలంబు = వేసవికాలము; వర్తింపన్ = రాగా; బృందా = బృంద యనెడి; వనంబు = అడవి; రామ = బలరాముడు; గోవింద = కృష్ణుడు; మందిరంబు = నివాసము; ఐన = అయినట్టి; కతంబునన్ = కారణముచేత; నిదాఘకాల =

వేసవికాలపు; లక్షణంబులన్ = లక్షణములను; పాసి = విడిచి; నిరంతర = ఎడతెగని; గిరి = కొండలనుండి; నిపతిత = పడునట్టి; నిర్ఝర = సెలయేళ్ళ యందలి; శీకర = తుంపర్లయొక్క; పరంపరా = జల్లుచే; భాసిత = ప్రకాశించెడి; పల్లవిత = చిగురించిన; కుసుమిత = పుష్పించిన; తరు = చెట్లు గలది; లతంబు = లతలు కలది; అయ్యున్ = అయ్యి; తరు = వృక్షములు; లతా = తీగలుయొక్క; కుసుమ = పూల; పరిమళ= సువాసనలు; మిళిత = కలిసిన; మృదుల = మిక్కిలి సున్నితమైన; పవనంబు = గాలులు కలది; అయ్యున్ = అయ్యి; పవన = గాలిచేత; చలిత = కదలింపబడిన; కమల = తామర; కల్హార = ఎఱ్ఱ కలువలు కల; సరోవర = చెరువులు; మహా = మిక్కిలి; గభీర = లోతైన; నదీ = నది యందలి; హ్రదంబున్ = మడుగు కలది; అయ్యున్ = అయ్యి; నదీ = నది యందలి; హ్రద = మడుగుయొక్క; కల్లోల = పెద్ద అలలవలని; కంకణ = నీటితుంపురలవలన; ప్రభూత = బాగా ఏర్పడిన; పంకంబు = బురద కలది; అయ్యున్ = అయ్యి; పంక = బురద యందు; సంజనిత = మొలచిన; హరితా యమాన = పచ్చగా నగుచున్న; తృణ = గడ్డి; నికుంజంబు = పొదలు కలది; అయ్యున్ = అయ్యి; జన = ప్రజల; మనః = మనసులకు; రంజనంబు = ఇంపును పుట్టించు నది; అయిన = అయినట్టి; వసంతకాల = వసంత ఋతువుయొక్క; లక్షణంబులున్ = లక్షణములను; కలిగి = ఉండి; లలిత = మనోహరమైన; మృగ = జంతువులు; పక్షి = పక్షులతో; శోభితంబు = ప్రకాశించునది; ఐ = అయ్యి; ఒప్పుచున్ = అందగించి; ఉండెన్ = ఉండెను; మఱియున్ = ఇంకను; అందున్ = దానిలో.

భావము:- ఇలా భయంకరమైన వేసవికాలం నడుస్తూ ఉంటే, బృందావనం మాత్రం బలరామ కృష్ణులు నివసిస్తుండటంతో చల్లగా ఉంది. వేసవికాలపు లక్షణాలు అక్కడ కనిపించడం లేదు. కొండల మీద నుండి ఎప్పుడూ ప్రవహిస్తూ ఉన్న సెలయేళ్ళ నుండి నీటితుంపరలు తెరలు తెరలుగా వస్తూ ఉంటే అక్కడి చెట్లు తీగలు చిగిర్చి, పూలు పూస్తున్నాయి. ఆ పూల నుండి వెలువడే సువాసనలు గాలిలో తేలి తేలి వస్తున్నాయి. అక్కడ కొలనులలో నదులలో మడుగులలో కలువ పూవులు తామరపూవులు మందమారుతాలకు కదలి ఊయల లూగుతున్నాయి. బురదల్లో

పచ్చని పచ్చిక గుబుర్లు పుట్టి పెరుగుతున్నాయి. ఆ బృందావనం ప్రజల మనస్సులను సంతోషపరుస్తూ వసంత కాలపు లక్షణాలలో అందమైన మృగాలతో పక్షులతో చాలా మనోహరంగా ఉంది. ఇంకా అక్కడ. . . .

విశేషము- ఇలా ముక్తగ్రస్తంతో అలంకరించి చెప్పడంలో భగద్భక్తి ఎన్నిసార్లు చేజార్చుకున్నా మరల మరల పట్టుకుంటూనే ఉండాలని కవిబ్రహ్మ భావమేమో.
[. . తరులతం . . దరు లతా . . . పవనం . . . బవన . . . . నదీహ్రదం , , నదీహ్రద , , , పంకం . . బంక . .]

10.1-720-క.

పికముల కోలాహలమును,
శుకసంఘము కలకలంబు, సుభగ మయూర
ప్రకరము కేకారవ, మళి
నికరము రొదయును జెలంగె సెలఁ నయ్యడవిన్.

టీక:- పికముల = కోకిలల; కోలాహలమును = కలకలారావము; శుక = చిలుకల; సంఘము = సమూహముయొక్క; కలకలంబున్ = కలకలధ్వని; సుభగ = అందమైన; మయూర = నెమళ్ళ; ప్రకరము = సమూహముయొక్క; కేకా = కేకల; రవము = అరుపులు; అళి = తుమ్మెదల; నికరము = గుంపు; రొదయును = ఝుంకారధ్వని; చెలగె = చెలరేగెను; సెలఁన్ = నిండుదనముతో; ఆ = ఆయొక్క; అడవిన్ = అడవి యందు.

భావము:- కోకిలల కోలాహలము; చిలుకల కలకల ధ్వనులు; నెమళ్ళ కేకలు; తుమ్మెదల రొదలు తోకూడి ఆ అడవిలో చక్కని వాతావరణం నెలకొల్పింది.

10.1-721-క.

ఆతత యమునా సరసీ

జాత తరంగాభిషిక్త జలరుహ గంధో

పేతానిల మడఁచె నిదా

ఘాతత దావాగ్నిపీడ న వ్వనమందున్.

టీక:- ఆతత = విస్తారమైన; యమునా = యమునానది యందలి; సరసీ = చెరువులందు; జాత = పుట్టిన; తరంగ = అలల లందు; అభిషిక్త = స్నానముచేసిన; జలరుహ = పద్మముల; గంధ = పరిమళములచే; ఉపేత = కూడుకున్న; అనిలము = గాలి; అడచెన్ = అణచివేసెను; నిదాఘ = వేసవికాలపు; ఆతత = విస్తారమైన; దావగ్ని = కార్చిచ్చువంటి; పీడన్= బాధను; ఆ = ఆయొక్క; వనము = అడవి; అందున్ = అందు.

భావము:- అగ్నిని వాయువు రెచ్చకొట్టడం సహజం. కాని యమున మడుగు లోని కెరటాలు తామరపూలను తడుపుతూ ఉంటే, ఆ సువాసనలను మోసుకొస్తున్న అక్కడి తడిసిన చల్లని గాలి వలన అడవిలోని వేసవి కాలపు దావాగ్ని వలన కలిగే తాపం అణిగిపోతోంది.

10.1-722-వ.

ఇట్లామని కందువ తెఱంగు గలిగి సుందరంబైన బృందావనంబునకు బలకృష్ణులు గోవులరొప్పికొనిచని, గోపకులుం దారును నొండొరులతో నగుచుఁ,దెగడుచుఁ,జెలంగుచుఁ,దలంగుచు. జిఱజిఱందిరుగుచుఁ, దరులసందులకరుగుచు, దాఁగిలిమూతలాడుచు, గీతంబులు బాడుచు, వేణునాదంబులు ఘటియించుచు, నటియించుచు, గతులు దప్పినక్రియ నొఱఁగుచుఁ, గుప్పలకుఱుకుచుఁ జప్పటలుగొట్టుచుఁ, గందుకంబులఁ

దట్టుచు నుప్పరంబెగసి దర్దురంబుల చందంబున దాఁటుచు, నామలక బిల్వాదిఫలంబులమీఁటుచుఁ, గుటవిటపంబులుఁగదల్చుచు, మృగం బుల నదల్చుచుఁ, బెరల రేఁపుచు, మధుమక్షికలఁ జోపుచుఁ, దేనియలు ద్రావుచు, సొమ్మసిలం బోవుచు, గురుశిష్య కల్పనంబులం బనులు చేయుచుఁ, గాకపక్షధరులై ముష్టియుద్ధంబులడాయుచుఁ, బన్నిదంబులు చఱచుచుఁ, బులుగుల భంగి నఱచుచు, బహురూపంబులు పన్నుచు, సెగిరితన్నుచు, సేవ్యసేవక మిత్రామిత్ర భావంబులువహించుచు, నుత్స హించుచు మఱియు ననేకవిధంబులఁ గ్రీడించి; రందు.

టీక:- ఇట్లు = ఈ విధముగ; ఆమని = వసంత; కందువన్ = ఋతువు; తెఱంగు = విధము; కలిగి = ఉండి; సుందరంబు = అందమైనది; ఐన = అయిన; బృందావనంబున్ = బృందావనమున; కున్ = కు; బల = బలరాముడు; కృష్ణులు = కృష్ణుడు; గోవులన్ = పశువులను; రొప్పికొని = తోలుకొని; చని = వెళ్ళి; గోపకులున్ = పశువుల కాపరులు; తారును = వారు; ఒండొరులతోన్ = ఒకరితో నొకరు; నగుచున్ = నవ్వుకొనుచు; తెగడుచున్ = తిట్టుకొనుచు; చెలంగుచున్ = చెలరేగి పోతూ; తలంగుచున్ = తప్పించుకొంటు; జిఱజిఱన్ = గిరగిర; తిరుగుచన్ = తిరుగుతు; తరుల = చెట్ల; సందులన్ = మధ్యకి; అరుగుచు = వెళుతు; దాగిలి మూతలు = దాగుడుమూతలు; ఆడుచున్ = ఆడుకొనుచు; గీతంబులున్ = పాటలు; పాడుచున్ = పాడుతు; వేణు = మురళీ; నాదంబులు = రవములు; ఘటియించుచు = చేయుచు; నటియించుచున్ = నాట్యములు చేయుచు; గతులు = తెలివి; తప్పిన = తప్పుతున్న; క్రియన్ = వలె; ఒఱగుచున్ = వాలిపోతూ; కుప్పల = గుట్టలమీద; కున్ = కు; ఉఱుకుచు = దుముకుచు; చప్పటలున్ = చప్పట్లు; కొట్టుచున్ = చరచుచు; కందుకంబులన్ = బంతులను, చెండ్లను; తట్టుచున్ = కొడుతు; ఉప్పరంబు = మీదికి; ఎగసి = ఎగిరి; దర్దురంబుల = కప్పల; చందంబునన్ = వలె; దాటుచున్ = గెంతుతు; ఆమలక = ఉసిరిక; బిల్వ = మారేడు; ఆది = మున్నగు; ఫలంబులన్ =

పండ్లను; మీటుచున్ = రాల్చుచు; కుట = చెట్ల; విటపంబులన్ = కొమ్మలను; కదల్చుచున్ = ఊపుతు; మృగంబులన్ = జంతువులను; అదల్చుచున్ = బెదిరించుచు; పెరలన్ = తేనెపట్టులను; రేపుచు = రేగగొట్టుచు; మధుమక్షికలన్ = తేనెటీగలను; జోపుచున్ = చెదరగొట్టుచు; తేనియల్ = తేనెలను; త్రావుచున్ = తాగుతు; సొమ్మసిలంబోవుచు = మూర్ఛిల్లుతు; గురు = గురువులు; శిష్య = శిష్యులు అని; కల్పనంబులన్ = ఏర్పరచుకొనుచు; పనులున్ = గురువులు చెప్పిన పనులు; చేయుచు = చేస్తు; కాకపక్షధరులు = పిలకలు కలవారు, ఉత్తుత్తి మిత్ర శత్రు పక్షములు కల్పించుకున్నవారు; ఐ = అయ్యి; ముష్టియుద్ధంబులన్ = కుస్తీపట్లకు; డాయుచున్ = చేరుచు; పన్నిదంబులు = పందెములు; చఱచుచున్ = వేసికొనుచు; పులుగుల = పక్షులతో; భంగిన్ = వలె; అఱచుచున్ = కూయుచు; బహు = అనేకమైన; రూపంబులున్ = బొమ్మలు; పన్నుచున్ = చేయుచు; ఎగిరి = ఎగిరి; తన్నుచున్ = తన్నుతు; సేవ్య = కొలవబడువాని; సేవక = కొలచెడివాని; మిత్ర = స్నేహపు; అమిత్ర = శత్రత్వపు; భావంబులున్ = అనురీతులను; వహించుచున్ = ధరించుచు; ఉత్సహించుచున్ = పూనుతు; మఱియున్ = ఇంకను; అనేక = బహు; విధంబులన్ = విధములుగా; క్రీడించిరి = విహరించిరి; అందున్ = వానిలో.

<u>భావము:-</u> వసంతఋతువు ఆవరించి ఉన్నట్లు అందంగా ఉన్న బృందావనానికి బలరామ కృష్ణులు గోవులను తోలుకుని వెళ్ళారు. గోపకులు తాము ఒకరి నొకరు హాస్యాలాడు కుంటూ, నెట్టుకుంటూ, ఎగురుతూ, తిరుగుతూ, చెట్ల సందులలో పరిగెడుతూ, నాట్యాలు చేస్తూ, వేణువులు వాయిస్తూ, కుప్పలమీదకు దూకుతూ, చప్పట్లు చరుస్తూ, బంతు లాడుతూ, కప్పల్లా గెంతుతూ, ఉసిరిక మారేడు పండ్లను ఎగురవేస్తూ, చెట్లు ఊపుతూ, జంతువులను తోలుతూ, తేనెటీగ లను దూరంగా తరుముతూ, తేనెలు తాగుతూ, గురు శిష్యుల ఆటలాడుతూ, ముష్టి యుద్ధాలు చేస్తూ, పందాలు కాస్తూ, పక్షుల వలె అరుస్తూ, రకరకాల వేషాలు వేస్తూ, సేవకుడు యజమాని మిత్రుడు శత్రువు మొదలైన భావాలు కల్పించుకుంటూ, ఉత్సాహంతో ఇంకా ఎన్నో విధాలుగా ఆటలు ఆడుకున్నారు.

10.1-723-క.

"మా పాలికి బలకృష్ణులు

భూపాలకు"లంచు నెగిరి బొబ్బ లిడుచు నా

గోపాలురు మోతురు ప్రమ

దాపాదకు లగుచు వల్లికాందోళికలన్.

టీక:- మా= వారల; పాలికి= మట్టుకు; బల= బలరాముడు; కృష్ణులు = కృష్ణుడు; భూపాలకులున్ = రాజులు; అంచున్ = అని; ఎగిరి = ఉత్సాహముచెంది; బొబ్బలు = కేకలు; ఇడుచున్ = పెట్టుచు; ఆ = ఆయొక్క; గోపాలురు = గోపాలకులు; మోతురు = మోయుదురు; ప్రమద = మిక్కిలి సంతోషమును; ఆపాదకులు = పొందినవారు; అగుచున్ = ఔతు; వల్లికా = తీగల; ఆందోళికలన్ = అందలము లందు.

భావము:- “మా పాలిటికి బలరామకృష్ణులే రాజులు” అని జేజేలు కొడుతూ ఆ గోపాలకులు తీగలతో అల్లిన పల్లకిలలో వారిని కూర్చుండబెట్టి మోస్తూ, ఎంతో సంతోషంతో ఉన్నారు.

10.1-724-క.

గోపకు లందఱు నాడుచు

దీపింపఁగ రామవాసుదేవుల వెనుకం

బై పడి పాఠక గాయక

రూపంబులఁ బొగడుదురు నిరూఢాత్మకులై.

టీక:- గోపకులు = గొల్లలు; అందఱున్ = ఎల్లరు; ఆడుచున్ = నృత్యములు చేయుచు; దీపింపగన్ = ప్రకాశించునట్లుగా; రామ = బలరాముడు; వాసుదేవుల = కృష్ణుడు {వాసుదేవుడు- వసుదేవునిపుత్రుడు, కృష్ణుడు}; వెనుకన్= వెంబడిని; పైపడి= కవియుచు; పాఠక=వంది {పాఠకుడు-వంశావళివర్ణించుచుజీవించువాడు, వంది};

గాయక = మాగధుల {గాయకుడు – బిరుదులను ఉగ్గడించి కీర్తించుచు జీవించు వాడు, గాయకుడు, మాగధుడు}; రూపంబులన్ = వలె; పొగడుదురు = స్తుతింతురు; నిరూఢ = మిక్కిలి దృఢమైన; ఆత్మకులు = మనసు కల వారు; ఐ = అయ్యి.

భావము:- అలా అటలలో గోపబాలకులు అందరూ ఉత్సాహంతో బలరామ కృష్ణుల వెనుకనడుస్తూ స్తోత్రపాఠకులలాగ మంచిమనస్సులతో పొగడుతుండేవారు.

10.1-725-క.

ప్రీతిన్ గోపకు లందలు
గీతంబులు పాడఁ దరుల క్రిందను నగుచుం
జేతులు ద్రిప్పుచు పెడపెడ
పాతర లాడును యశోదపాపం డడవిన్.

టీక:- ప్రీతిన్ = ఇష్టముగా; గోపకులు = యాదవులు; అందలున్ = ఎల్లరు; గీతం బులున్= పాటలు; పాడన్= పాడుచుండగా; తరుల= చెట్ల; క్రిందను= కింద; నగు చున్ = నవ్వుతు; చేతులున్= చేతులను; త్రిప్పుచున్=తిప్పుతూ; పెడపెడన్= మృదువుగా; పాతరలు = నాట్యములు; ఆడును = చేయును; యశోదపాపండు = కృష్ణుడు {యశోదపాపడు – యశోదాదేవి పిల్లవాడు, కృష్ణుడు}; అడవిన్ = అడవి యందు.

భావము:- గోపబాలకులు అందరూ చెట్ల క్రింద చేరి, ఎంతో ప్రీతిగా పాటలు పాడుతూంటే, కృష్ణుడు నవ్వుతూ చేతులు త్రిప్పుతూ మృదువుగా నాట్యం చేస్తూ ఉండేవాడు.

10.1-726-మ.

జలజాక్షుండును రాముఁడున్ నటనముల్లల్లంగ గోపాల మూ
ర్తులతో వారలఁ గొల్చు నిర్జరులు సంతోషించి, వేణుస్వనం
బులుగావించుచుఁ గొమ్ములూదుచు శిరంబుల్ద్రిప్పుచుం బాడుచున్
వలనొప్పన్ వినుతించి రప్పుడు నటుల్ వర్ణించు చందంబునన్.

టీక:- జలజాక్షుండును = పద్మాక్షుడు, కృష్ణుడు; రాముడున్ = బలరాముడు; నటనముల్ = నృత్యములు; సల్పంగన్ = చేయుచుండగా; గోపాల = గొల్లవాళ్ళ; మూర్తుల్ = రూపముల; తోన్ = తోటి; వారలన్ = వారిని; కొల్చు = సేవించెడి; నిర్జరులున్ = దేవతలు {నిర్జరులు - జర (ముసలితనము లేనివారు), దేవతలు}; సంతోషించి = ఆనందించి; వేణు = పిల్లనగ్రోవి; స్వనంబులు = రవములు; కావించుచున్ = ఊదుతు; కొమ్ములున్= కొమ్ముబూరాలు; ఊదుచున్=ఊదుతు; శిరంబుల్ = తలలు; త్రిప్పుచున్= ఆడించుచు; పాడుచున్= పాటలుపాడుతు; వలనొప్పన్ = అందగించునట్లుగ; వినుతించిరి = స్తోత్రములు చేసిరి; అప్పుడు = ఆ సమయమునందు; నటుల్ = నాటకులు; వర్ణించు = వర్ణించెడి; చందంబునన్ = విధముగ.

భావము:- బలరామకృష్ణులు నాట్యాలు చేస్తుంటే, వారి చుట్టూ గోపాలకులుగా ఉంటూ ఉన్న దేవతలు సంతోషించేవారు. వేణుగానాలు చేస్తూ, కొమ్ముబూరలు ఊదుతూ, తలలు తిప్పుతూ, పాటలు పాడుతూ, చక్కగా స్తోత్రాలు చేసేవారు. నటులు ఏ విధంగా నటనలు చేస్తూ, వర్ణనలు చేస్తుంటారో, అలాగే వీరూ ఆడుతూ పాడుతూ ఉండేవారు.

ప్రలంబాసుర వధ

10.1-727-వ.

ఇట్లు రామకృష్ణులు నదనదీ తీరంబులఁ, గొలంకుల సమీపంబుల, గిరులచఱుల సెలయేఱుల పొంతల మడుఁగులచెంతలఁ, బొదల క్రేవలఁ, బసిమి గల కసవుజొంపంబులఁ బసుల మేపుచుడం బ్రలంబుడను రక్కసుం డుక్కుమిగిలి గోపాలరూపంబున వచ్చి వారల హింస జేయ దలంచుచుండ న య్యఖిలదర్శనుం డగు సుదర్శనధరుం డెఱింగియు సెఱుంగని తెఱంగున.

టీక:- ఇట్లు = ఈ విధముగ; రామ = బలరాముడు; కృష్ణులు = కృష్ణుడు; నద = పడమరకు పారు యేరుల; నదీ = తూర్పుకు పారు యేరుల; తీరంబులన్ = గట్లమీద; కొలంకుల = సరస్సుల; సమీపంబులన్ = దగ్గరలో; గిరులన్ = కొండ; చఱుల = చరియలందు; సెలయేఱుల = సెలయేరుల; పొంతలన్ = పక్కన; మడుగులన్ = మడుగుల; చెంతలన్ = దగ్గర; పొదల = పొదలకు; క్రేవల = ప్రక్కల, సమీపమున; పసిమి = పచ్చదనము; కల = కలిగిన; కసవు = గడ్డి; జొంపంబులన్ = దుబ్బులను; పసులన్ = పశువులను; మేపుచుండన్ = మేపుతుండగా; ప్రలంబుడు = ప్రలంబుడు {ప్రలంబుడు - ప్ర (మిక్కిలి) లంబుడు (పొడవుగా ఉన్న వాడు)}; అను = అనెడి; రక్కసుండు = రాక్షసుడు {రాక్షసుడు - ప్రమాణము శ్లో:: వృక్షాన్ ఛిత్వా పశూన్ హత్వా కృత్వా రుధిరకర్దమం: బ్రాహ్మణావ యమిత్యేవం మోస్యంతే రాక్షసాః కలౌ: రాక్షసాః కలిమాశ్రిత్య జాయంతే బ్రహ్మయోనిషు: బ్రాహ్మణానేవ బాధంతే పరిత్యక్తాఖిలాగమాః::}; ఉక్కుమిగిలి = విజృంభించి; గోపాల = గొల్లవాని; రూపంబునన్ = స్వరూపముతో; వచ్చి = దగ్గరకు చేరి; వారలన్ = వారిని; హింస = చంపి; చేయన్ = వేయవలెనని; తలంచుచున్ = అనుకొనుచు; ఉండన్ = ఉండగా; ఆ = ఆయొక్క; అఖిల = సమస్తమును; దర్శనుండు = చూచువాడు; అగు = ఐన; సుదర్శనధరుండు = కృష్ణుడు {సుదర్శన ధరుండు - సుదర్శనమను చక్రాయుధము ధరించువాడు, విష్ణువు}; ఎఱింగియున్ = తెలిసినను; ఎఱుంగని = తెలియనివాని; తెఱంగునన్ = విధముగ.

భావము:- ఇలా బలరామకృష్ణులు నదనదీ తీరాలలో; సరస్సుల సమీపాన; కొండల దాపున; సెలయేళ్ళ చెంత; మడుగుల దగ్గర; పొదల పొంత; పచ్చని పచ్చిక గుబురులలో; పశువులను మేపుతూ ఉన్నారు. ఆ సమయంలో ప్రలంబాసురుడు అనే రాక్షసుడు గోపబాలుని రూపంతో విజృంభించి వారి వద్దకు వచ్చాడు. రామకృష్ణులను ఏ తీరున హింసించడమా అని ఆలోచిస్తున్నాడు. అన్నీ తెలిసిన శ్రీకృష్ణుడు ఏమీ తెలియనట్లు ఉన్నాడు.

10.1-728-క.

ఆ రాముని సహజన్ముఁడు

రా రమ్మని వానిఁ జీరి రాకం బోకన్

గారాము చేసి మెల్లన

పోరామి యొనర్చెఁ బిదపఁ బొరిగొనుకొఱకున్.

టీక:- ఆ = ఆ; రామునిసహజన్ముడు = కృష్ణుడు {రాముని సహజన్ముడు - బలరామునియొక్క సోదరుడు, కృష్ణుడు}; రారమ్ము = తొందరగారా {రాముడు - శ్రు:: రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని: ఇతి రామ పదేనాసౌ పరబ్రహ్మాభియతే, పరమానందము నిచ్చెడి పరబ్రహ్మ}; అని = అని; వానిన్ = అతనిని; చీరి = పిలిచి; రాకంబోకన్ = ఇటునటు తిరుగునప్పుడు; గారాము = గారాబము; చేసి = చేసి; మెల్లనన్ = మెల్లిగా; పోరామి = చెలిమి; ఒనర్చెన్ = చేసెను; పిదపన్ = తరువాత; పొరిగొను = చంపుట; కొఱకున్ = కోసము.

భావము:- బలరాముడి తోబుట్టువైన కృష్ణుడు ప్రలంబాసురుని హతమార్చేందుకు ఒక పన్నాగం పన్నాడు. ఆ దానవుణ్ణి చెంతకు రమ్మని ప్రియంగా పిలిచి రాకపోకలతో వానిలో నెమ్మదిగా చెలిమి పెంపొందించుకున్నాడు.

10.1-729-వ.

ఇట్లు ప్రలంబునితోఁ జెలిమి చేయుచుఁ, గృష్ణుండు గోపాలకులకు, నిట్లనియె.

టీక:- ఇట్లు = ఈ విధముగ; ప్రలంబుని = ప్రలంబాసురుని; తోన్ = తోటి; చెలిమి = స్నేహము; చేయుచున్ = చేస్తు; గోపాలకుల్ = గొల్లవారి; కున్ = కింద; ఇట్లు = ఈ విధముగ; అనియె = పలికెను.

భావము:- ఇలా ప్రలంబాసురుడితో నెయ్యం నెరపుతూ శ్రీకృష్ణుడు గోపబాలురను ఉద్దేశించి ఇలా అన్నాడు

10.1-730-ఆ.

"మనకుఁ బ్రొద్దుపోదు మన మిందఱము రెండు
గములవార మగుచుఁ గందుకముల
శిలలు గుఱులు చేసి చేరి క్రీడింతము
రండు వలయు జయపరాజయములు.

టీక:- మన = మనము అందరి; కున్ = కి; పొద్దుపోదు = కాలక్షేప మగుట లేదు; మనము = మనము; ఇందఱమున్ = ఈ అందరము; రెండు = రెండు (2); గముల = పక్షములు కట్టిన; వారము = వారలము; అగుచున్ = ఔతు; శిలలున్ = రాళ్ళను; గుఱులు = లక్ష్యములుగా; చేసి = చేసికొని; చేరి = కూడి; క్రీడింతము = ఆడుకొనెదము; రండు = రండి; వలయున్ = పొందవలెను; జయ = గెలుపు; పరాజయములున్ = ఓటములు.

భావము:- "మనకు ప్రొద్దు పోవడం లేదు కదా. మనం అందరం రెండు పక్షాలుగా ఏర్పడి రాళ్ళను బంతులను గురి చేసి విసురి కొట్టే ఆట ఆడుదాం. ఎవరు గెలుస్తారో ఎవరు ఓడుతారో చూద్దాం."

10.1-731-వ.

అని యిట్లుపలికి, తానును బలభద్రుండును బెన్నుద్దులై యితర వల్లవు లెల్ల నుద్ధించుకొని చిఱ్ఱుద్దు లై వచ్చిన సమయంబుగ విభజించికొని, రెండు గములవారై మార్గంబులందుఁ దృణ దారు శిలా కల్పితంబు లగు గుఱులొడ్డి, కందుక శిలాది ప్రక్షేపణంబుల లక్ష్యంబులఁ దాఁక పైచి, జయ పరాజయ నిర్ణయంబులు గైకొని వాహ్యావాహక లక్షణంబుల నిర్జితులు జేతల వహించి క్రీడించుచు, బలరామునికి వాని చందంబు రహస్యంబున నెఱింగించి; పసుల బిల్చుచు, భాండీరకంబను వటంబు

జేరి రా సమయంబున; క్రీడయందుఁ శ్రీదామనామధేయండైన గోప కుండు శ్రీకృష్ణుని వహించె; భద్రసేనుండు వృషభు నెక్కించుకొనియె; బలభద్రుండు ప్రలంబు నారోహించె నప్పుడు.

టీక:- అని = అని; ఇట్లు = ఈ విధముగ; పలికి = చెప్పి; తానును = అతను; బలభద్రుండును = బలరాముడు; పెన్ = పెద్ద; ఉద్దులు = ఉద్దులు, జతగాడు; ఐ = అయ్యి; ఇతర = మిగిలిన; వల్లవుల = గొల్లవాళ్ళను; ఎల్లను = అందరిని; ఉద్దించుకొని = జతపర్చుకొని; చిఱు = చిన్న; ఉద్దులు = జతగాళ్ళు; ఐ = అయ్యి; వచ్చిన = రాగా; సమయంబుగన్ = ఒప్పుకున్నట్లు, అంగీకారమైనట్లు; విభజించుకొని = పంచుకొని; రెండు = రెండు (2); గముల = పక్షముల; వారు = వారుగా; ఐ = ఏర్పరచుకొని; మార్గంబులందు = దారు లమ్మట; తృణ = గడ్డి; దారు = కఱ్ఱలు; శిలా = రాళ్ళతో; కల్పింతంబులు = ఏర్పరచుకొన్నవి; అగు = ఐన; గుఱులు = లక్ష్యములను; ఒడ్డి = పన్నుకొని; కందుక = బంతులు, చెండ్లు; శిల = రాళ్ళు; ఆది = మున్నగు; ప్రక్షేపణంబులన్ = విసరుటచేత; లక్ష్యంబులన్ = లక్ష్యములను; తాకన్ = తగులునట్లుగా; పైచి = విసిరి; జయ = గెలుపు; పరాజయ = ఓటములను; నిర్ణయంబులున్ = నిశ్చయములు; కైకొని = చేసుకొని; వాహ్య = మోయబడువాడు; వాహక = మోయువాడు అను; లక్షణంబులన్ = పద్ధతి ప్రకారము; నిర్జితులు = ఓడినవారు; జేతలన్ = గెలిచినవారిని; వహించి = మోయుచు; క్రీడించుచున్ = ఆడుకొనుచు; బలరాముని = బలరాముడి; కిన్=కి; వాని= అతనియొక్క; చందంబున్ = విధమును (కపటము); రహస్యంబునన్ = రహస్యముగా; ఎఱింగించి = తెలిపి; పసులన్ = గోవులను; పిల్చుచున్ = పిలుచుకొని వెళుతు; భాండీరకంబు = భాండీరకము; అను = అనెడి; వటంబున్ = మఱ్ఱిచెట్టును; చేరిరి = చేరిరి; ఆ = ఆ; సమయంబునన్ = సమయము నందు; క్రీడ = ఆట; అందున్ = లో; శ్రీదామ = శ్రీదాముడు అనెడి; నామధేయుండు = పేరు గలవాడు; ఐన = అయిన; గోపకుండు = గోపాలుడు; శ్రీకృష్ణుని = కృష్ణుని; వహించెన్ = మోసెను; భద్రసేనుండు = భద్రసేను డనువాడు; వృషభున్= వృషభుడనువానిని; ఎక్కించుకొనియె= ఎక్కించుకొనెను; బలభద్రుండు

= బలరాముడు; ప్రలంబున్ = ప్రలంబుని; ఆరోహించెన్ = ఎక్కెను; అప్పుడు = అప్పుడు.

భావము:- ఇలా చెప్పిన శ్రీ కృష్ణుడు తానూ తన అన్న బలరాముడూ పెద్ద ఉద్దులై చెరొక జట్టుకి నాయకులుగా, నిలబడ్డారు తక్కిన గొల్లపిల్లలు చిఱ్ఱద్దులుగా జట్టులోని సభ్యులుగా చీలి రెండు జట్లుగా ఏర్పడ్డారు. అలా కొందరు కృష్ణుని జట్టూ; మరికొందరు బలరాముని పైపు చేరారు. వారు గడ్డితో కొయ్యలతో రాళ్ళతో లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని, వాటిని బంతులతోను, శిలలోతోను గురి చూసి కొడుతూ, గెలుపు ఓటములు నిర్ణయించుకో సాగారు. ఆటలో గెలిచిన వారు, ఓడిన వారి మీద ఎక్కాలి. ఓడిన వారు గెలిచిన వారిని మోయాలి. ఇలా నియమం పెట్టుకుని ఆడుతూ పెళ్తున్నారు. దారిలో శ్రీకృష్ణుడు రహస్యంగా తన అన్న బలరాముడికి ప్రలంబాసురుడి వృత్తాంతం తెలియ జెప్పాడు. అలా క్రీడిస్తూ గోపాలకులు పశువులను అదిలిస్తూ కదిలి భాండీరకము అనే మఱ్ఱిచెట్టు దగ్గరకి చేరారు. అప్పుడు బలరాముడి పక్షంలో ఉన్న శ్రీ దాముడు అనే గొల్లపిల్లాడు క్రీడలో ఓడినందున కృష్ణుణ్ణి తన మీద ఎక్కించుకుని మోసాడు. అలాగే పరాజయం పొందిన కృష్ణుడి జట్టులోని భద్రసేనుడు మీద వృషభుడు, ప్రలంబుడుమీద బలరాముడు ఎక్కారు.

10.1-732-మ.

వనజాక్షున్ బలిమిన్బలాఢ్యుఁడు తృణావర్తుండు మున్మింటికిం
గొనిపోఁ జాలక చిక్కినాఁ డతని నాకున్ మోవరా దంచు నా
దనుజారిన్ గొనిపోఁ దలంపక వడిన్ దైత్యేశుఁ డయ్యాటలోఁ
గొనిపోయెన్ గిరి దాఁటి రాము నఖిలక్రూరక్షయోద్దామునిన్.

టీక:- వనజాక్షున్ = పద్మాక్షుని, కృష్ణుని; బలిమిన్ = బలముతో; బలాఢ్యుడు = మిక్కిలి బలము కలవాడు; తృణావర్తుండు = తృణావర్తుడు; మున్ను = ఇంతకు ముందు; మింటి = ఆకాశమున; కిన్ = కు; కొనిపోన్ = తీసుకుపోవుటకు; చాలక =

సమర్థుడుగాక; చిక్కినాడు = చిక్కుపోయాడు; ఇతనిన్ = ఇతడిని (కృష్ణుని); నా = నా; కున్ = కుకూడ; మోవన్ = మోయుట; రాదు = వల్లకాదు; అంచున్ = అని; ఆ = ఆయొక్క; దనుజారిన్ = కృష్ణుని {దనుజారి - దనుజ (రాక్షసులకు) అరి (శత్రువు), విష్ణువు}; కొనిపోన్ = తీసుకుపోవలెనని; తలంపక = అనుకొనకుండా; వడిన్ = వేగముగా; దైత్య = రాక్షసుల; ఈశుడు = ప్రభువు; ఆ = ఆయొక్క; ఆట = క్రీడ; లోన్ = అందు; కొనిపోయెన్ = తీసుకు పెళ్ళెను; గిరిన్ = ఎల్లను, కొండను; దాటి = దాటేసి; రామున్ = బలరాముని; అఖిల = సమస్తమైన; క్రూర = క్రూరులను; క్షయ = నశింపజేసెడి; ఉద్దామునిన్ = అధికుడిని.

భావము:- ఇంతకు పూర్వం మహాబలవంతుడైన తృణావర్తుడు అనే దైత్యుడు కృష్ణుణ్ణి గగనతలానికి ఎత్తుకుపోలేక, అతని చేతిలోచిక్కిహతమయ్యాడు. అందువల్ల అతణ్ణి భరించడం తనకుసాధ్యంకాదని ప్రలంబుడు రాక్షసాంతకుడైన శ్రీ కృష్ణుడిని పట్టుకుపోడానికి సంకల్పించ లేదు. క్రూరుల నందరినీ అంతరింప జేసే బలదేవుణ్ణి తన మూపున వహించి మోస్తూ, దింపవలసిన చోట దింపక ఎల్ల దాటి వడివడిగా పరిగెత్తిపోయాడు.

10.1-733-వ.

ఇట్లు క్రీడా కల్పిత వాహనుం డయిన ప్రలంబుండు బలభద్రునిం గొని పోవుచు

టీక:- ఇట్లు = ఈ విధముగా; క్రీడా = ఆటలందు; కల్పిత = ఏర్పరచుకొన్న; వాహనుండు = మోసెడివాడు; అయిన = ఐన; ప్రలంబుడు = ప్రలంబుడు; బలభద్రునిన్ = బలరాముని; కొని = తీసుకొని; పోవుచున్ = పెళ్ళుచు.

భావము:- ఇలా ఆటలో మోసేవాడిగా వచ్చిన ప్రలంబుడు బలరాముడిని ఎత్తుకుపోతూ. . .

10.1-734-మ.

గురుశైలేంద్ర సమాన భారుఁ డగు నా గోపాలకున్ మోవలే
క రయోద్రేకము మాని దైత్యుఁడు నరాకారంబు జాలించి భీ
కర దైత్యాకృతి నేగె హేమకటకాకల్పంబుతో రాముతో
మురు వొప్పంగఁ దటిల్లతేందుయుత జీమూతంబు చందంబునన్.

టీక:- గురు = పెద్ద; శైల = పర్వతములలో; ఇంద్ర = శ్రేష్ఠ మైనదానితో; సమాన = సరితూగెడి; భారుండు = బరువు కలవాడు; అగున్ = ఐన; ఆ = ఆయొక్క; గోపాలకున్ = గొల్లవానిని; మోవలేక = మోయలేనివాడై; రయోద్రేకమున్ = మిక్కిలి వడిగా పోవుట; మాని = వదలిపెట్టి; దైత్యుడు = రాక్షసుడు; నర = మానవుని; ఆకారంబున్ = స్వరూపమును; చాలించి = వదలిపెట్టి; భీకర = భయంకరమైన; దైత్య = రాక్షసుని; ఆకృతిన్ = స్వరూపముతో; ఏగెన్ = పెళ్ళెను; హేమ = బంగార; కటక = కడియములయొక్క; ఆకల్పంబు = అలంకారము; తోన్ = తోటి; రాము = బలరాముని; తోన్ = తోటి; మురువు = గర్వము; ఒప్పంగ = మెరయునట్లుగా; తటిల్లత = మెరుపుతీగ; ఇందు = చంద్రుడితో; యుత = కూడిన; జీమూతంబు = మేఘము; చందంబునన్ = వలె.

భావము:- పెద్ద పర్వతరాజం అంత బరువు ఉన్న ఆ బలరాముణ్ణి మోయలేక, గమన వేగం తగ్గించాడు. ఆ రాక్షసుడు మానవ రూపం విడిచి తన అతి భీకరమైన అసురాకారం ధరించి గర్వము అతిశయించగా బలరాముడిని తీసుకు పోసాగాడు. తెల్లని బలరాముడిని అలా మోసుకుని పెడుతున్న నిశాచరుడు, మెరుపులతో మిలమిలలాడే చందమామను పొదివి యున్న కారుమబ్బులా ప్రకాశిస్తున్నాడు.

10.1-735-ఉ.

మోసము లేక వాని పెనుమూఁపుననుండుచు నా హలాయుధుం
డా సమయంబునం గనియె హాటక రత్న కిరీట కుండలో
ద్భాసిత మస్తకున్ భ్రుకుటి భాసుర దారుణ నేత్రునుగ్ర దం
ష్ట్రాసహితుం బ్రలంబు నురుశౌర్యవిలంబు మదావలంబునిన్.

టీక:- మోసము = వంచన, ప్రమాదము; లేక = లేకుండగ; వాని = అతని; పెను = పెద్ద; మూపునన్ = భుజముపై; ఉండుచున్ = ఉండి; ఆ = ఆ ప్రసిద్ధుడైన; హలాయుధుండు = బలరాముడు; ఆ = ఆయొక్క; సమయంబునన్ = సమయము నందు; కనియెన్ = కనుగొనెను; హాటక = బంగారపు; రత్న = రత్నాల; కిరీట = కిరీటము; కుండల = చెవికుండలములతో; ఉత్ = మిక్కిలి; భాసిత = ప్రకాశించుచున్న; మస్తకున్ = శిరము కలవానిని; భ్రుకుటి = బొమముడిచేత; భాసుర = ప్రకాశించునట్టి; దారుణ = భయంకరమైన; నేత్రున్ = కన్నులు కలవానిని; ఉగ్ర = భయంకరమైన; దంష్ట్రా = దంతము లు; సహితున్ = కలిగిన వానిని; ప్రలంబున్ = ప్రలంబుని; ఉరు = మిక్కిలి; శౌర్య = శూరత్వముచేత; విలంబున్ = అతిశయించిన వానిని; మద = మదమును; అవలంబునిన్ = అవలంభించిన వానిని.

భావము:- భుజాల మీద ఏ మరుపాటు లేకుండా కూర్చుని ఉన్న బలరాముడు, ప్రలంబుణ్ణి గమనించి చూసాడు. సువర్ణఖచితరత్నకిరీటంతోను చెవిపోగులతోనూ వాడి శిరస్సు మిక్కిలి ప్రకాశిస్తోంది. వాడి కన్నులు బొమముడితో పరమ దారుణం గాను, వాడి కోరలు మహ భయంకరం గానూ మెరుస్తున్నాయి. దొడ్డ శౌర్యానికి దుర్గర్వానికి అతడు ఆటపట్టుగా కనబడ్డాడు. దానితో. . .

10.1-736-వ.

కని నక్తంచరుం డని యించుక శంకించి, వెఱవక.

టీక:- కని = చూసి; నక్తచరుండు = రాక్షసుడు {నక్తంచరుడు - నక్తము (రాత్రి) చరుడు (చరించువాడు), రాక్షసుడు}; అని = అని; ఇంచుక = కొద్దిగా; శంకించి = అనుమానించి; వెఱవక = బెదిరిపోకుండా.

భావము:- బలరాముడు తనని మోస్తున్న వాడు రక్కసుడని కొంచెం సంశయించాడు. అయినా భయపడకుండా. . .

10.1-737-క.

కడువడిఁ దను దివికిం గొని

వడిఁ జనియెడు దనుజు శిరము వ్రయ్య హలధరుం

డడరి పటుచటులతర మగు

పిడికిట వెస విసరి పొడిచె బిలుసున నలుకన్.

టీక:- కడు = మిక్కిలి; వడిన్ = వేగముగా; తనున్ = అతను; దివి = ఆకాశమున; కిన్ = కు; కొని = తీసుకొని; వడిన్ = వేగముగా; చనియెడు = పోతున్న; దనుజుని = రాక్షసుని; శిరమున్ = తల; వ్రయ్యన్ = బద్ద లగునట్లుగా; హలధరుండు = బలరాముడు {హల ధరుడు – హలము నాగలి అనెడి ఆయుధము ధరించువాడు, బలరాముడు}; అడరి = విజృంభించి; పటు = తీవ్రమైనది; చటులతరము = మిక్కిలి కఠినమైనది {చటులము - చటులతరము - చటులతమము}; అగు = ఐన; పిడికిటన్ = పిడికిలితో; వెసన్ = వడిగా; విసరి = విసిరి; పొడిచెన్ = కొట్టెను; బిలుసునన్ = కఠినత్వముతోటి; అలుకన్ = కోపముతోటి.

భావము:- నాగలి ఆయుధంగా కల బలరాముడు విజృంభించి తన్ను వడివడిగా పట్టుకుపోతున్న ఆ దానవుడి తల వ్రక్కలయ్యేట్లు అత్యుగ్ర మైన తన పిడికిలి బిగించి పెళలు మని పొడిచాడు.

10.1-738-క.

హలధరు బలుపిడికిట హతిఁ

దల పగిలిన రుధిరజలము తనువివరములం

దొలఁక మొఱయిడుచు దనుజుఁడు

బలరిపుపవి నిహత నగము పగిదిం బడియెన్.

టీక:- హలధరున్ = బలరాముని; బలు = బలమైన; పిడికిట = పిడికిలి; హతిన్ = పోటుతో; తల = శిరస్సు; పగిలినన్ = బద్దలుకాగా; రుధిర = రక్తపు; జలము = ద్రవము; తనువివరములన్ = నవరంధ్రములనుండి {తను వివరములు - నేత్రములు రెండు, శ్రోత్రములు రెండు, నాసారంధ్రములు రెండు, నోరు ఒకటి, మలమూత్ర విసర్జక రంధ్రములు రెండు, మొత్తం ఈ తొమ్మిది దేహము నందలి నవరంధ్రములు}; ఒలకన్ = కారగా; మొఱ = మొఱ్ఱో యని అరుచుట; ఇడుచున్ = చేయుచు; దనుజుడు = రాక్షసుడు; బలరిపు = ఇంద్రుని {బలరిపుడు - బలాసురుని శత్రువు, ఇంద్రుడు}; పవి = వజ్రాయుధముచేత; నిహత = వేటు వేయబడిన; నగము = పర్వతము; పగిదిన్ = వలె; పడియెన్ = పడిపోయెను.

భావము:- బలరాముడి పిడికిటి పోట్లకు రాక్షసుడి తల పగిలి బ్రద్దలైంది. నెత్తురు నవరంధ్రాల నుండి వెల్లుబికి ప్రవహించింది. దేవేంద్రుడి వజ్రాయుధం వేటుకు కూలే పర్వతం లాగ వాడు మొఱ్ఱో అంటూ నేలకూలి ప్రాణాలు విడిచాడు.

10.1-739-మత్త.

"మేలుమేలుగదయ్య! రాముఁడు మేటిరక్కసు నొక్కఁడున్

నేలఁ గూలిచె నొక్క పోటున నేఁడు విస్మయ" మంచు గో

పాలకుల్ గని చచ్చి వచ్చిన భ్రాతఁ గన్న విధంబునం

జాల దీవన లిచ్చి రాముని సత్కరించిరి వేడుకన్.

టీక:- మేలుమేలు = బాగుబాగు; కద = కదా; అయ్య = నాయనా; రాముడు = బలరాముడు; మేటి = గొప్ప; రక్కసున్ = రాక్షసుని; ఒక్కడున్ = ఒంటరిగా; నేల గూల్చెన్ = చంపెను; ఒక్క = ఒకేఒక్క; పోటునన్ = గుద్దుతో; నేడు = ఇవాళ; విస్మయము = ఆశ్చర్యకరము; అంచున్ = అనుచు; గోపాలకుల్ = గొల్లవాళ్ళు; కని = చూసి; చచ్చి = మరణించి; వచ్చిన = తిరిగిబతికిన; భ్రాతన్ = సోదరుని; కన్న = కనుగొనిన; విధంబునన్ = విధముగా; చాలన్ = మిక్కిలి; దీవనలు = ఆశీర్వచనములు; ఇచ్చి = ఇచ్చి; రాముని = బలరాముని; సత్కరించిరి = గౌరవించిరి; వేడుకన్ = సంతోషముతో.

భావము:- “బలే బలే! ఇవాళ మన బలరాముడు ఇంత పెద్ద రాక్షసుడినీ ఒక్క దెబ్బ తోటే నేల కూలగొట్టాడు. ఇది మహాద్భుతం” అంటూ గోపబాలకులు అందరూ బ్రతికి వచ్చిన సహోదరుణ్ణి చూసినంత మిక్కిలి సంతోషంతో పెక్కు దీవెనలిస్తూ ఆయనను గౌరవించారు.

10.1-740-క.

బలవంతుఁ డగు ప్రలంబుఁడు
బలుముష్టిన్ నిహతుఁడైన బ్రతికితి మనుచున్
బలసూదనాది దివిజులు
బలుపైఁ గుసుమముల వానఁ బరఁగించి రొగిన్.

టీక:- బలవంతుడు = మిక్కిలి బలము కలవాడు; అగు = ఐన; ప్రలంబుడు = ప్రలంబుడు; బలు = బలరాముని; ముష్టిన్ = పిడికిటిపోటుతో; నిహతుడు = చచ్చినవాడు; ఐన = అయిన; బ్రతికితిమి = ఆపదనుండి బైటపడితిమి; అనుచున్ = అనుచు; బలసూదన = ఇంద్రుడు {బలసూదనుడు - బలాసురుని సంహరించిన వాడు, ఇంద్రుడు}; ఆది = మున్నగు; దివిజులు = దేవతలు; బలు = బలరాముని; పైన్ = మీద; కుసుమముల = పూల; వాన = వర్షము; పరగించిరి = వ్యాపింపజేసిరి; ఒగిన్ = చక్కగా.

భావము:- బలాఢ్యుడైన ప్రలంబుడు బలరాముడి పిడికిటిపోటుకి చచ్చేసరికి. బలాసురుని చంపిన ఇంద్రుడు సహితంగా దేవతలు అందరూ “అమ్మయ్య ఇక బ్రతికిపోయాం” అని ఊరట పొంది, ఒక్క పెట్టున బలరాముడి మీద పూలవాన కురిపించారు.

దావాగ్ని తాగుట

10.1-741-వ.

ఇట్లు గోపకులు క్రీడింప గోవు లంతంతం గాంతారంబున వింత కసవులు మెసవుచు, మేఁతపడి నొండడవికి దూరంబు చని యందు దవదహనపవన సంస్పర్శంబు సైరింపక కంపించి దప్పి నొప్పుజెడి ఘోషించిన.

టీక:- ఇట్లు = ఈ విధముగా; గోపకులు = గోపాలకులు; క్రీడింపన్ = ఆడుకొనుచుండగా; గోవులు = ఆవులు; అంతంతన్ = అంతటంతట; కాంతారంబునన్ = అడవిలో; వింత = ఆశ్చర్యకరములైన; కసవులు = గడ్డి; మెసవుచున్ = మేయుచు; మేతన్ = మేయు టందు; పడి = మునిగిపోయి; ఒండు = ఇంకొక; అడవి = అడవి; కిన్ = కి; దూరంబు = ఎక్కువ దూరము; చని = వెళ్ళి; అందున్ = దానిలో; దవదహన = కార్చిచ్చుయొక్క; పవన = గాలి; సంస్పర్శంబున్ = తగులుటను; సైరింపక = ఓర్చుకొనలేక; కంపించి = భయముతో వణకిపోయి; దప్పిన్ = దాహముతో; ఒప్పుచెడి = స్తిమితము తప్పి; ఘోషించినన్ = అరవగా.

భావము:- అలా గొల్లపిల్లలు ఆటలలో మునిగి ఉండగా, ఆవులు అడవిలోని రకరకాల మేతలను మేస్తూ, మరొక అడవిలో దూరాయి. అక్కడ చెలరేగిన కార్చిచ్చు గాలి వేడికి తట్టుకోలేక భయంతో వణికి పోతూ “అంబా” అని అరిచాయి.

10.1-742-శా.

ఆ గోపాలకు లందఱుం బసుల కుయ్యాలించి కౌమార కే

ళీ గాఢత్వము మాని గోఖురరదాళిచ్ఛిన్న ఘాసంబుతో

బాగై యున్న పథంబునం జని దవాపన్నంబు గాకుండ వే

వేగన్ గోగణమున్ మరల్చి రటవీవీథిన్ జవం బొప్పఁగన్.

టీక:- ఆ = ఆయొక్క; గోపాలకులు = గోపకులు; అందఱున్ = ఎల్లరు; పసుల = పశువుల; కుయ్ = మొఱ, అరుపులను; ఆలించి = విని; కౌమార = పిల్లల; కేళీ = ఆటలందు; గాఢత్వమున్ = ఆసక్తిని; మాని = విడిచిపెట్టి; గో = ఆవుల; ఖుర = గిట్టల; రద = దంతములచేత; ఛిన్న = నలిగిపోయిన; ఘాసంబు = గడ్డి; తోన్ = తోటి; బాగు = చక్కగా; ఐ = అయ్యి; ఉన్న = ఉన్నట్టి; పథంబునన్ = దారిని; చని = వెళ్ళి; దవ = కార్చిచ్చుచేత; ఆపన్నంబు = ఆపదలో పడినవి; కాకుండ = కాకుండగా; వేవేగన్ = మిక్కిలి వేగముగా; గో = పశువుల; గణమున్ = సమూహమును; మరల్చి = మరలించిరి; అటవీ = అడవి; వీథిన్ = దారమ్మట; జవంబు = వడి; ఒప్పగన్ = కలుగునట్లుగా.

భావము:- ఆ యాదవబాలలు పశువుల ఘోష విన్నారు. పిల్లలు ఆటల మీది దృష్టి చాలించారు. ఆవుల గిట్టలచే నలిగి, వాటి దంతాలచే తునిగి ఉన్న గుర్తులను ఆనవాలు పట్టారు. అవి వెళ్ళిన దారిలో వాళ్ళు వేగంగా వెళ్ళారు. అలా వెళ్ళి, మంటలపాలు కాకుండా ఆ అడవిదారి నుంచి తమ గోవులను మరలించారు.

10.1-743-క.

జలధర గభీర రవమున

నళినదళాక్షుండు దమ్ము నామాంకములం

బిలిచిన విని ప్రతిఘోషణ

ములు జేయుచుఁ బసులు దిరిగె ముదమున నధిపా!

టీక:- జలధర = మేఘము వంటి; గభీర = గంభీరమైన; రవమునన్ = ధ్వనితో; నళినదళాక్షుడు = శ్రీకృష్ణుడు; తమ్ము = వాటిని; నామ = పేర్లు అనెడి; అంకములన్ = గురుతులతో; పిలిచినన్ = పిలువగా; విని = విని; ప్రతిఘోషణములున్ = మారుపలుకటకై అరచుట; చేయుచున్ = చేస్తు; పసులు = పశువులు; తిరిగెన్ = వెనుదిరిగెను; ముదమునన్ = సంతోషముతో; అదిపా = రాజా.

భావము:- మేఘగర్జనవలె గంభీరమైన కంఠస్వరంతో శ్రీకృష్ణుడు గోవులను పేరు పేరున పిలిచాడు. అలా పిలవగానే ఆ ధేనువులు మిక్కిలి సంతోషంతో "అంబా" అని మారు పలుకుతూ మరలి వచ్చాయి

10.1-744-వ.

అంత న వ్వనంబున దైవయోగంబునం బుట్టిన కార్చిచ్చు బిట్టు విసరెడి కరువలి వలన మిన్నుముట్ట మిట్టిపడి, గట్టు చెట్టనక దరికొని, యట్టి క్రాలుచుఁ జుట్టుకొని, పఱవం గని పల్లటిల్లిన యుల్లంబులతో వల్లవు లెల్లఁ దల్లడిల్లి సబలుండైన హరికి మృత్యుభీతుల రీతిం జక్క మ్రొక్కి యిట్లనిరి.

టీక:- అంతన్ = అంతట; ఆ = ఆయొక్క; వనంబునన్ = అడవి యందు; దైవయోగంబునన్ = దైవికముగా; పుట్టిన = కలిగినట్టి; కార్చిచ్చు = అడవి అంటుకొనుట; బిట్టు = అధికముగా; విసెరెడి = వీచు; కరువలి = గాలి; వలన = వలన; మిన్ను = ఆకాశమును; ముట్టన్ = తాకునట్లు; మిట్టిపడి = మీది కెగసి; గట్టు = గుట్టలు; చెట్టు = చెట్లు; అనక = లెక్కచేయకుండ; దరికొని = అంతట రగుల్కొని; అట్టె = అలాగే; క్రాలుచున్ = ప్రవర్తిల్లుచు; చుట్టుకొని = ఆవరించుకొని (నాలుగు పక్కలనుండి); పఱవన్ = వ్యాపించుచుండగా; కని = చూసి; పల్లటిల్లిన = చెదిరిన; ఉల్లంబుల్ = మనసుల; తోన్ = తోటి; వల్లవులు = గొల్లవాళ్ళు; ఎల్లన్ = అందరు; తల్లడిల్లి = మిక్కిలి భయపడి; సబలుండు = మంచి బలము కలవాడు; ఐన =

అయిన; హరి = కృష్ణుని; కిన్ = కి; మృత్యుభీతుల = మరణభయము కలవారి; రీతిన్ = వలె; చక్కన్ = చక్కగా; మ్రొక్కి = నమస్కరించి; ఇట్లు = ఇట్లు; అనిరి = పలికిరి.

భావము:- ఆ అడవిలో దైవికంగా జనించిన ఆ కార్చిచ్చు ఈడ్చి కొట్టి విసిరే గాలికి పెచ్చుపెరిగి ఆకాశాన్ని అంటే మంటలతో. గట్టనక పుట్టనక అడ్డమైన వాటినీ పట్టి పడగాలుస్తూ అడవి నలుమూలలా అలముకుంటోంది. అది చూసి గొల్లపిల్లల గుండెలు తల్లడిల్లాయి. వారు మరణభయంతో కలత చెంది, బలరామ సహితుడైన శ్రీకృష్ణుడికి సాగిలపడి మ్రొక్కి ఇలా అన్నారు.

10.1-745-క.

“అభ్రంకష ధూమాయిత
విభ్రాంత మహాస్ఫులింగ విసరోగ్ర శిఖా
విభ్రష్ట దగ్ధలోకా
దభ్రంబై వచ్చెఁ జూడు దవశిఖి కృష్ణా!

టీక:- అభ్రన్ = ఆకాశమును; కష = ఒరసికొనుచున్న; ధూమ = పొగలచేత; ఆయిత = విస్తరింపబడిన; విభ్రాంత = చెదరిపడిపోతున్న; మహా = గొప్ప; స్ఫులింగ = నిప్పురవ్వలయొక్క; విసర = సమూహములతోటి; ఉగ్ర = భయంకరమైన; శిఖా = మంటలచేత; విభ్రష్ట = మిక్కిలి చెడిపోయి; దగ్ధ = కాలిపోయిన; లోకా = లోకము నంతటను; అదభ్రంబు = పెరిగిపోయినది; ఐ = అయ్యి; వచ్చెన్ = వచ్చినది; చూడు = చూడుము; దవశిఖి = దావాగ్ని; కృష్ణా = కృష్ణుడా.

భావము:- “కృష్ణా! ఆ కార్చిచ్చును చూడు పొగలతో ఆకాశం అంతా ఆవరించింది. భయం గొలిపే పెద్దపెద్ద నిప్పురవ్వలు విరజిమ్ముతూ ఉంది. పైపైకెగసే పెనుమంటలు లోకాలను మాడ్చి మసి కావిస్తున్నట్లు ఉన్నాయి.

10.1-746-శా.

నీ చుట్టాలకు నాపదల్ గలుగునే? నే మెల్ల నీ వార మ

న్యాచారంబు లెఱుంగ; మీశుడవు; మా కాభీలదావాగ్ని నే

డే చందంబున నింక దా(టుదుము? మమ్మీక్షించి రక్షింప వ

న్నా! చంద్రాభ! విపన్నులన్ శిఖివితానచ్ఛన్నులన్ ఖిన్నులన్."

టీక:- నీ = నీ; చుట్టాల్ = బంధువుల, చెందినవారి; కున్ = కి; ఆపదల్ = కష్టములు; కలుగునే = కలుగునా, కలుగవు; నేము = మేము; ఎల్లన్ = అందరము; నీ = నీకు చెందిన; వారము = వారలము; అన్య = ఇతర; ఆచారంబున్ = మతములను; ఎఱుంగము = తెలియము; ఈశుడవు = ప్రభువవు; మా = మా అందరకు; కున్ = కు; ఆభీల = భయంకరమైన; దావాగ్ని = కార్చిచ్చు; నేడు = ఇవాళ; ఏ = ఏ; చందంబునన్ = విధముగా; ఇక = మరి; దాటుదుము = దాటగలము; మమ్ము = మమ్ములను; ఈక్షించి = చూసి; రక్షింపవు = కాపాడుము; అన్నా = నాయనా; చంద్రాభ = చంద్రుని వంటి చల్లనివాడ; విపన్నులన్ = ఆపద పొందిన వారిని; శిఖి = మంటల; వితానత్ = సమూహముచేత; ఛన్నులన్ = ఆవరింపబడినవారిని; భిన్నులన్ = దుఃఖించుచున్నవారిని.

భావము:- చందమామ వలె చల్లనైన వాడా! శ్రీకృష్ణా! నీ ఇష్ట బంధువులకు ఇట్టి కష్టాలా? మేమంతా నీవారమే కదా! ఇంకో దారి ఏదీ మాకు తెలియదు. మా ప్రభుడవు నీవే. ఈ దారుణమైన కార్చిచ్చును మేము ఇప్పుడెలా దాటగలం. మంటలలో తగుల్కొని అలమటిస్తున్న మాపై దృష్టి సారించి కాపాడు.''

10.1-747-వ.

అని విన్నవించి రంత.

టీక:- అని = అని; విన్నవించిరి = చెప్పుకొనిరి; అంతన్ = పిమ్మట.

భావము:- ఇలా గొల్లపిల్లలు విన్నవించుకున్నారు. అంతట. . .

10.1-748-ఉ.

బంధుజనంబుచేత నిటు ప్రార్థితుఁడై హరి విశ్వరూపు "డో
బంధువులార! మీ నయనపంకజముల్ ముకుళింపుఁ డగ్నినీ
సంధి నడంతు నే" ననినఁ జక్కన వారలు నట్ల చేయుఁడున్,
బంధురదావపావకముఁ బట్టి ముఖంబునఁ ద్రావె లీలతోన్.

టీక:- బంధు = చుట్టముల; జనంబు = సమూహము; చేత = చేత; ఇటున్ = ఇలా; ప్రార్థితుడు = వేడుకొనబడినవాడు; ఐ = అయ్యి; హరి = కృష్ణుడు; విశ్వరూపుడు = కృష్ణుడు {విశ్వరూపుడు - సమస్తమైన విశ్వము తన రూపమైన వాడు, విరాట్ పురుషుడు, విష్ణువు}; ఓ = ఓ; బంధువులారా = ఓహో చుట్టములు; మీ = మీయొక్క; నయన = కన్నులు అనెడి; పంకజముల్ = పద్మములను; ముకుళింపుడు = మూయుడు; అగ్ని = కార్చిచ్చును; ఈ = ఈ; సంధిన్ = లోపున; అడంతున్ = అణచివేసెదను; నేను = నేను; అనినన్ = అని చెప్పగా; చక్కనన్ = చక్కగా; వారలు = వారు; అట్ల = అలానే; చేయుడున్ = చేయగా; బంధుర = ఆవరించినట్టి; దావపావకమున్ = కార్చిచ్చును; పట్టి = పట్టుకొని; ముఖంబునన్ = నోటితో; త్రావెన్ = తాగెను; లీల = ఒక విలాసము; తోన్ = తోటి.

భావము:- గోపకులూ బంధువులూ ఇట్లా వేడుకోగా విశ్వరూపు డైన శ్రీకృష్ణుడు వారితో "బంధుమిత్రులారా! మీరు కళ్ళు మూసుకోండి. ఇంతలో నేను అగ్గిని అణచేస్తాను" అన్నాడు. వాళ్ళు కళ్ళు మూసుకున్నారు. వెంటనే కృష్ణుడు దారుణ మైన దావానలాన్నిఅలవోకగా నోటిలోకి పీల్చుకుని త్రాగేశాడు.

10.1-749-వ.

ఇట్లు నిజయోగ వైభవంబున దావదహనంబుఁబానంబుచేసి నిమిష
మాత్రంబున గోపకుల నందఱ భాండీరక వటసమీపంబునకుం దెచ్చి
విడిచిన వారు వికసితనయనకమలులయి కృష్ణునియోగమాయా ప్రభా
వంబున వెరగలిచిచ్చు మ్రగ్గెననియగ్గించుచుఁ దమమనంబు లందు.

టీక:- ఇట్లు = ఈ విధముగా; నిజ = స్వంత, తనయొక్క; యోగ = యోగ బలముయొక్క; వైభవంబునన్ = గొప్పదనముచేత; దావదహనంబున్ = కార్చిచ్చును; పానంబుచేసి = తాగి; నిమిష = కనురెప్పపాటు; మాత్రంబునన్ = కాలములోనే; గోప కులన్ = గోపాలకులను; అందఱన్ = అందరిని; భాండీరక = భాండీరకము అనెడి {భాండీరకము - ఒక రకమైన కుంభము (కుండ), నవద్వారకలిత దేహమనవచ్చు}; వట = మఱ్ఱిచెట్టు {వటవృక్షము - సాంసారమునకు గుర్తు}; సమీపంబున్ = వద్ద; కున్ = కు; తెచ్చి = తీసుకు వచ్చి; విడిచినన్ = వదలిపెట్టగా; వారు = వారు; వికసిత = బాగా తెరుచుకొన్న; నయన = కన్నులు అనెడి; కమలులు = పద్మములు కలవారు; అయి = అయ్యి; కృష్ణుని = కృష్ణుని; యోగ = యోగబలముయొక్క; మాయా = మహిమ యొక్క; ప్రభావంబునన్ = ప్రభావమువలన; ఎరగలి = దావాగ్ని; చిచ్చు = తాపము; మ్రగ్గెను = నశించెను; అని = అని; అగ్గించుచున్ = స్తుతించుచు; తమ = వారి యొక్క; మనంబుల్ = మనసుల; అందున్ = లోపల.

భావము:- ఇలా తన యోగ మాయ చేత మాధవుడు దావాగ్నిని త్రాగేసి, గోప బాలకులను అందరిని భాండీరకం అనే వటవృక్షము దగ్గరకు తీసుకువచ్చాడు. వారు సంతోషంతో విప్పారిన కన్నులతో శ్రీకృష్ణుని యోగమాయా మహిమ వలన కార్చిచ్చు ఆరిపోయిం దని పొగడుతూ తమ మనస్సులలో ఇలా తలపోశారు.

10.1-750-క.

"కార్చి చ్చార్చు పటుత్వము

నేర్చునె నరుఁ డొకఁడు? శౌరి నేఁడిదె కార్చి

చ్చార్చి మనలఁ రక్షింపఁగ

నేర్చె; నితం డజుఁడొ హరియొ నిటలాక్షుండో!"

టీక:- కార్చిచ్చు= దావాగ్నిని; ఆర్చు= ఆర్పివేసెడి; పటుత్వము= సామర్థ్యము; నేర్చునె = సంపాదించగలడా, లేడు; నరుడొకడు = మానవమాత్రుడు, సామాన్య మానవుడు; శౌరి = కృష్ణుడు {శౌరి - శూరుని మనుమడు, కృష్ణుడు}; నేడు = ఇవాళ; ఇదె =

ఇదిగో; కార్చిచ్చు = దావాగ్నిని; ఆర్చి = ఆర్పివేసి; మనలన్ = మనలను; రక్షింపగన్ = కాపడుటను; నేర్చెన్ = చేయగలిగెను; ఇతండు = ఇతను; అజుడో = బ్రహ్మదేవుడు కాని; హరియొ = విష్ణుమూర్తికాని; నిటలాక్షుండో = పరమశివుడుకాని (కావచ్చు).

భావము:- “దావానలాన్ని చల్లార్చే శక్తి సామాన్య మానవుడికి ఉంటుందా? నేడు శ్రీకృష్ణుడు కార్చిచ్చు నార్పివేసి మనలను సంరక్షించాడు. ఇతడు బ్రహ్మదేవుడా? విష్ణుమూర్తా? పరమశివుడా?”

10.1-751-వ.

అని వితర్కించి; రంతఁ గృష్ణుండు సాయాహ్నసమయంబున

రామసహితుండై వంశనాళంబు పూరించుచు గోపగణ

జేగీయమానుండై గోష్ఠంబుఁ బ్రవేశించె; నప్పుడు.

టీక:- అని = అని; వితర్కించిరి = ఆలోచించుకొనిరి; అంతన్ = అప్పుడు; కృష్ణుండు = కృష్ణుడు; సాయాహ్న = సాయంకాల; సమయంబునన్ = సమయము నందు; రామ = బలరామునితో; సహితుండు = కూడినవాడు; ఐ = అయ్యి; వంశ నాళంబున్ = పిల్లనగ్రోవిని; పూరించుచున్ = ఊదుతు; గోప = గోపకుల; గణ = సమూహముచేత; జేగీయమానుండు = పొగడబడుతున్నవాడు; ఐ = అయ్యి; గోష్ఠంబున్ = వ్రేపల్లెను; ప్రవేశించెన్ = చేరెను; అప్పుడు = ఆ సమయము నందు.

భావము:- ఇలా గోపబాలురు భావించారు. ఇంతలో సాయంకాలం అయింది. కృష్ణుడు బలరాముడి తోకూడి వేణువు ఊదుతూ గొల్లపిల్లలు అందరు పొగడుతుండగా గోశాలలో ప్రవేశించాడు.

10.1-752-క.

కమలాక్షు నొద్ద నుండని

నిమిషము యుగశతముగాఁగ నెగడిన గోప

ప్రమదలు సంభ్రమమున నా

కమలాక్షునిఁ జూచి ముదముఁ గనిరి మహీశా!

టీక:- కమలాక్షున్ = పద్మాక్షుని, కృష్ణుని; ఒద్దన్ = దగ్గర; ఉండని = ఉండనట్టి; నిమిషము = రెప్పపాటు కాలము; యుగ = యుగములు; శతము = నూరు; కాగన్ = అయినట్లు; సెగడిన = ప్రవర్తించిన, అతిశయించిన; గోప = గోపికా; ప్రమదుల = స్త్రీలు; సంభ్రమమునన్ = వేగిరపాటుతో; ఆ = ఆ ప్రసిద్ధుడైన; కమలాక్షుని = పద్మాక్షుని, కృష్ణుని; చూచి = చూసి; ముదమున్ = సంతోషమును; కనిరి = పొందిరి; మహీశ = రాజా {మహీశుడు - మహి (భూమి, రాజ్యము)నకు ఈశుడు (ప్రభువు), రాజు}.

భావము:- ఓ రాజా! పరీక్షిత్తూ! శ్రీకృష్ణుడు దగ్గర లేని ప్రతి క్షణం గోపికలకు నూరు యుగాలుగా తోస్తుంది. కనుక, కమలాక్షుడు కృష్ణుడిని చూడగానే వారికి పరమానందం కలిగింది.

10.1-753-వ.

ఆ సమయంబున గోపకు లిండ్లకడనున్న వృద్ధకాంతాజనంబులకు రామ కృష్ణుల చిత్రచరిత్రంబులు చెప్పిన, విని వారు వారిని గార్యార్థులై వచ్చిన వియ చ్చరవరు లని తలంచి; రంత.

టీక:- ఆసమయంబునన్ = అప్పుడు; గోపకులు = గోపాలురు; ఇండ్ల = నివాసముల; కడన్ = వద్ద; ఉన్న = ఉన్నట్టి; వృద్ధ = ముసలి; కాంతా = స్త్రీ; జనంబులు = సమూహముల; కున్ = కు; రామ = బలరాముని; కృష్ణుల = కృష్ణుడుయొక్క; చిత్ర = వింతైన; చరిత్రంబులున్ = వర్తనములను; చెప్పినన్ = చెప్పగా; విని = విని; వారున్ = వారు; వారిని = వారిని (బలకృష్ణులను); కార్యార్థులు = ఏదో పని కోసమై; వచ్చిన = వచ్చినట్టి; వియచ్చర = దేవతా {వియచ్చరులు - వియత్ (ఆకాశమున) చరులు (చరించు వారు), దేవతలు}; వరులు = శ్రేష్ఠులు; అని = అని; తలంచిరి = భావించిరి; అంత = అంతట.

భావము:- అప్పుడు గొల్లపిల్లలు ఇండ్లలో ఉన్న వృద్ధులకూ స్త్రీలకూ జరిగిన అద్భుతమైన విషయాలు, బలరాముడు ప్రలంబాసురుని సంహరించడం; కృష్ణుడు

తమనూ, గోపులనూ కార్చిచ్చు బారి నుండి కాపాడటం చెప్పారు. వాటిని విని, రామకృష్ణులు ఏవో మహాకార్యాలు కోసం గోకులంలో అవతరించిన దేవతా శ్రేష్ఠులు అని భావించారు.

వర్షర్తు వర్ణనము

10.1-754-సీ.

పూర్వవాయువులు ప్రభూతంబులై వీచెఁ-
    బడమట నింద్రచాపంబు దోఁచెఁ
బరివేషయుక్తమై భానుమండల మొప్పె-
    మెఱపు లుత్తరదిశ మెఱవఁ దొడగె
దక్షిణగాములై తనరె మేఘంబులు-
    జలచరానీకంబు సంతసించెఁ
జాతకంబుల పిపాసలు కడపలఁ జేరెఁ-
    గాంతారవహ్నుల గర్వ మడఁగె

10.1-754.1-ఆ.

నిజకరాళివలన నీరజబంధుండు
దొల్లి పుచ్చుకొనిన తోయ మెల్ల
మరల నిచ్చుచుండె మహిఁ గర్షకానంద
కందమైన వాన కందు వందు.

టీక:- పూర్వ = తూర్పుకువీచెడి; వాయువులు = గాలులు; ప్రభూతంబులు = హెచ్చినవి; ఐ = అయ్యి; వీచెన్ = వీచినవి; పడమటన్ = పశ్చిమదిక్కునందు; ఇంద్రచాపంబున్ = ఇంద్రధనుస్సు; తోచెన్ = కనబడెను; పరివేష = గుడికట్టుటతో

{గుడికట్టుట - ఆకాశమునందు సూర్యునిచుట్టు ఏర్పడెడి ప్రకాశవంతమైన తెల్లని చక్రాకారము తయారగుట}; యుక్తము = కూడినది; ఐ = అయ్యి; భాను = సూర్య; మండలము = బింబము; ఒప్పెన్ = అందగించినది; మెఱుపులు = మెరుపులు; ఉత్తర = ఉత్తరపు; దిశన్ = దిక్కునందు; మెఱవన్ = మెరియుట; తొడగెన్ = సాగెను; దక్షిణ = దక్షిణపువైపు; గాములు = పోవునవి; ఐ = అయ్యి; తనరెన్ = అతిశయించి నవి; మేఘంబులు = మబ్బులు; జలచర = జలచరముల; అనీకంబు = సమూహ ములు; సంతసించెన్ = సంతోషించినవి; చాతకంబుల = చాతకపక్షుల, వానకోకిల; పిపాసలు = దప్పికలు; కడపలజేరెన్ = తుదముట్టెను; కాంతారవహ్నుల = కార్చిచ్చుల; గర్వము = అతిశయము; అడగెన్ = అణగిపోయెను.

నిజ = తనయొక్క; కర = కిరణముల; ఆళి = సమూహముల; వలన = చేత; నీరజబంధుండు = సూర్యుడు {నీరజబంధుడు - నీరజము (కలువపూల)కు బంధువైనవాడు, సూర్యుడు}; తొల్లి = ఇంతకుముందు; పుచ్చుకొనిన = తీసుకొన్నట్టి; తోయము = నీరు; ఎల్లన్ = అంతటిని; మరలన్ = తిరిగి; ఇచ్చుచుండెన్ = ఇచ్చు చుండెను; మహిన్ = భూలోకమునందు; కర్షక = రైతుల, సేద్యగాండ్ర; ఆనంద = సంతోషమునకు; కందము = మూలము; ఐన = అయిన; వాన = వర్ష; కందువ = ఋతువు; అందున్ = అందు.

<u>భావము:-</u> ఇంతలో వర్షాకాలం వచ్చింది. తూర్పుగాలులు విపరీతంగా వీచాయి. పశ్చిమాన ఇంద్రధనుస్సు కనబడింది. చుట్టూ కట్టిన గాలిగుడితో సూర్యుడు చక్కగా ఉన్నాడు. ఉత్తరదిక్కులో మెరుపు మెరిసింది. మబ్బులు దక్షిణదిశకు తిరిగిపోసాగాయి. జలచరాలకు సంతోషం సమకూడింది. చాతకపక్షుల దప్పిక తీరింది. అడవులలోని దావాగ్నులు అణిగిపోయాయి. సూర్యుడు తన కిరణాలతో మునుపు స్వీకరించిన నీటిని అంతటినీ రైతులకు ఆనందదాయకమైన వానాకాలంలో వర్షాల రూపంలో ఇచ్చేస్తున్నాడు

10.1-755-క.

వర్షాకాలభుజంగుఁడు

హర్షముతో నిడిన నవ నఖాంకము లని యు

త్కర్షింప భూమిసతిపైఁ

కర్షక హలరేఖ లమరె గహనాంతములన్.

టీక:- వర్షాకాల = వర్ష ఋతువు అనెడి; భుజంగుడు = విటుడు; హర్షము = సంతోషము; తోన్ = తోటి; ఇడిన = పెట్టిన; నవ = నూతనమైన; నఖాంకములు = నఖక్షతములు {నఖక్షతములు - గిల్లుటచేత చర్మముపై ఏర్పడు గోటి గుర్తు}; అని = అని; ఉత్కర్షింపన్ = పొగడునట్లుగా; భూమి = భూమి అనెడి; సతి = స్త్రీ; పైన్ = మీద; కర్షక = సేద్యగాని; హల = నాగలి, నాగేటి; రేఖలు = చాళ్ళు; అమరె = అమరి ఉన్నాయి; గహన = అడవి; అంతములన్ = చివరల యందు.

భావము:- వర్షాకాలం అనే విటుడు భూమి అనే అంగన మీద ఆనందంతో క్రొత్తగా పెట్టిన కొనగోటి నొక్కులవలె నేలపై కర్షకులు వేసిన నాగటిచాళ్ళు చక్కగా ఉన్నాయి.

10.1-756-క.

చెలువుఁడు ప్రావృట్కాలుఁడు

పొలసినఁ బులకించు భూమి పులకము లనఁగా

మొలచి తల లెత్తి నిక్కుచు

సలలితగతిఁ జాలువారె సస్యము లధిపా!

టీక:- చెలువుడు = ప్రియుడు; ప్రావృట్కాలుడు = వర్షఋతువు అనెడి పురుషుడు; పొలసిన = సమీపించగా; పులకించు = గగుర్పాటు నొందు; భూమి = నేల; పులకములు = గగుర్పాటులు; అనగా = అన్నట్టుగా; మొలచి = మొలిచి; తలలెత్తి

= నిటారుగా నిలబడి; నిక్కచున్ = బిగువు కలిగి ఉండి; సలలిత = మిక్కిలి మనోజ్ఞముగా; చాలువారెన్ = వరుస కట్టాయి; సస్యములు = పైర్లు; అధిపా = రాజా.

<u>భావము:-</u> ఓ పరీక్షన్మహారాజా! వర్షాకాలమనే ప్రియుడు సమీపించగా, పుడమికి కలిగిన గగుర్పాటేమో అన్నట్లు మొలచి మొలకెత్తి నిలిచిన పైరులు సొగసుగా శోభిల్లాయి.

10.1-757-వ.

మఱియుఁ జటుల పవనచలితంబులై మిన్నుదన్ని, లెక్కకు మిక్కిలియై, ఱెక్కలు గల నీలగిరుల సిరుల మీఱి, కాలుకొని తెఱపిపడక, నిబిడంబులై, శిశిరకిరణ తరణి మండలంబుల ఛొప్పుదప్పించి, విప్పు కలిగి, చదలు గప్పికొనిన లీలం గ్రాలు నీలమేఘంబులును, మేఘవిముక్తంబులై జలద సమయవిటుండు సరసగతి ధరణిసతి యురమ్మున దర్పించి, నేర్పున సమర్పించు కర్పూరఖండంబుల వడువునఁ బుడమిం బడు కరకలును, గరకానుగతంబులై యసిత భోగిభోగంబుల బాగున నీలమణిమాలికా విశేషంబుల విధంబున నెడపడక పడు సలిలధారలును, ధారాధరవిగళిత విమలసలిలంబులందోఁగుచు మదజలాభిషిక్త మత్త మాతంగంబుల సొబగున నుండు కొండలును, గొండల తుదల నుండి గండ శైలంబులపైఁ బడి వికీర్యమాణంబులగు గిరినిర్ఝరంబుల శీకరంబులును, శీకరపరంపరల ఛొదుకులు మదుగులు గొనినఁ బిద పిద నగుచుఁ జిదుకుచిదుకును రొంపులును, రొంపులుగ్రొచ్చి క్రచ్చర నుచ్చలితంబులైపఱచు వఱదలును, వఱదల వలన మెదలి కదలిపాఱెడి యేఱులును నేఱులవెంట గఱులుత్రిప్పుచు గములుగొని క్రొన్నీటి కెదురు నడచు మీనంబులును, మీననయనల మేనుల మెఱుంగు సొంపు పెంపు

సైరింపక కంపించి తిరిగి సురిఁగి చనియెడు కరణి మేఘ మధ్యంబులం బొలసి మలసి నిలువక మరలి చను క్రొమ్మెఱుంగులును, మెఱుంగుల తెఱంగునఁ దెఱవలు పురుషులం దగిలి నిలువరని జనుల కెఱుంగ నలువ మొఱయిడిన వడువున మొరయు నుఱుములును, నుఱుముల కులికిపడక కికురుపొడుచుచుఁ బింఛంబులు కొంచెంబులు జేయక విప్పి దెప్పరంబుగ తొప్పుచు నర్తనంబులు చేయు మయూరంబులును, మయూర ఘోషంబులు భీషణంబులై చెవులు సోఁక ననూనంబులైన మానంబుల నాసలు చెడి యొండొరులకుం గ్రిందుపడి క్రందుకొను విరహిజనులును, జనులకు రేపు మా పని రూపింప రాక మాలతీ కుసుమ విసర వికసన విదితావసానంబు లగు దుర్దినంబులును, దినావసాన సమయంబున మినుకుమినుకు మని మెఱయుచుం దిరుగు ఖద్యోతంబు లును, ఖద్యోతసందర్శనంబు గోరుచు నుడుగక విడువక కురియు జడింబడి వలిగొని వడఁకుచు నశనయత్నంబులు వర్జించి ఖర్జూర జంబూఫల భక్షణం బుల దేహ సంరక్షణంబు లాచరించు వనచరులును, వనచరానందకారిణులై వారరమణులరుచి ననవరత భుజగ సమేతలగు కేతకులును, గేతకీ కదంబ యూథికా కుటజ కుసుమపరిమళ మిళితంబులగు విపినమార్గంబులును మార్గనిరోధం బు లగుచుం బెరిగి రసికంబులై పసరు దొలంకుచు హరిన్మణి కిరణ పుంజంబుల భంగి రంజిల్లి తొంగలించుచు జొంపంబులు గొనిన కసువులును, గసువులు మెసవి మిసమిసం దనువులు మెఱయ వలుఁద పొదుఁగుల బరువునం గదలక నిల్చి సెమ రమర నిడు ధేనువులును, గలిగి ధేనువ్రజంబుకైవడిఁ బయఃకణ మనోహరంబై, హరకరంబు

భంగిఁ బరిపూర్ణ సారంగభాసురంబై, సురగిరి చెలువున హరిశరాసన విభీషణంబై, విభీషణ హృదయంబు పోలికఁ బ్రకటిత హరిశబ్ద వైభవం బై, భవపూజనంబు చందంబున నింద్రగోపాది విభవ జనకం బయి, జనక యాగంబు భాతి సీతాప్రకరణాలంకృతం బయి, కృతయుగంబు సొంపున బహువర్షంబునై వర్షాగమంబు చెలువొందె నప్పుడు.

టీక:- మఱియున్ = ఇంకను; చటుల = గట్టి; పవన = గాలులచేత; చలితంబులు = కదల్చబడినవి; ఐ = అయ్యి; మిన్ను = ఆకాశమును; తన్ని = అంటి; లెక్కకు మిక్కిలి = లెక్కలేనన్ని; ఐ = అయ్యి; ఱెక్కలు = రెక్కలు; కల = కలిగిన; నీల = నల్లని; గిరుల = కొండల; సిరులన్ = చక్కదనములను; మీఱి = మించిపోయి; కాలుకొని = నలుపెక్కి; తెఱపిపడక = ఎడతెగక; నిబిడంబులు = దట్టమైనవి; ఐ = అయ్యి; శిశిరకిరణ = చంద్రునియొక్క; తరణి = సూర్యునియొక్క {తరణి – అంధకారము నుండి తరింపజేయువాడు, సూర్యుడు}; మండలంబుల = బింబముల; ఛొప్పు = చక్కదనములను; తప్పించి = మరుగుపరచి; విప్పు = విస్తారము; కలిగి = ఉండి; చదలు = ఆకాశమును; కప్పికొనిన = కమ్ముకొన్న; లీలన్ = విధముగా; నీల = నల్లని; మేఘంబులును = మబ్బులు; మేఘ = మేఘములనుండి; విముక్తంబులు = విడువబడినవి; ఐ = అయ్యి; జలదసమయ = వర్షఋతువు అనెడి; విటుండు = విటుడు; సరస = సరసములాడు; గతిన్ = విధముగ; ధరణిన్ = నేల అనెడి; సతి = స్త్రీయొక్క; ఉరమునన్ = రొమ్ములపై; దర్పించి = విజృంభించి; నేర్పునన్ = ప్రౌఢత్వముతో; సమర్పించు = ఉంచెడి; కర్పూర = కర్పూరపు; ఖండంబుల = పలుకుల; వడువునన్ = వలె; పుడమిన్ = నేలపై; పడు = పడుచున్నట్టి; కరకలును = వడగండ్లు; కరక = వడగండ్లను; అనుగతంబులు = వెంబడించునవి; ఐ = అయ్యి; అసిత = నల్లని; భోగి = పాములయొక్క; భోగంబుల = దేహముల; బాగునన్ = వలె; నీలమణి = నీలాల; మాలికా = దండల; విశేషంబులన్ = ఒకరకముల; విధంబునన్ = వలె; ఎడపడక = ఎడతెగక; పడు = వర్షించు; సలిల = నీటి; ధారలును =

ధారలు; ధారాధర = మేఘముల నుండి; విగళిత = జారుతున్న; విమల = స్వచ్ఛములైన; సలిలంబులన్ = మంచినీటి యందు; తోగుచున్ = తడియుచు; మదజల = మదజలముచేత; అభిషిక్త = మిక్కిలతడిసిన; మత్త =మదించిన; మాతంగంబుల = ఏనుగుల; సొబగునన్ = విధముగ; ఉండు = ఉండెడి; కొండలున్ = కొండలు; కొండల = కొండల; తుదల = కొనల; నుండి = నుండి; గండశైలంబులన్ = బండరాళ్ళ; పైన్ = మీద; పడి = పడి; వికీర్యమాణంబులు = చెదురుచున్నవి; అగు = ఐన; గిరి = కొండల యందలి; నిర్ఝరంబులన్ = సెలయేళ్ళయొక్క; శీకరంబులును = తుంపరలు; శీకర = తుంపరల; పరంపరలన్ = జడితో; ఛొదుగులు = చెమ్మలు; మదుగులగొని = అనుకులుకట్టి, మట్టిమెత్తగా అయ్యి; పిదపిదనగుచున్ = బురబురదగా ఔతు; చిదుకుచిదుకు = చిదుకు చిదుకు; అను = అనెడి; రొంపులును = బురదలు; రొంపులున్ = బురదలలో; గ్రొచ్చి = పెల్లగించి; క్రచ్చెరన్ = వేగముగా; ఉచ్చలితంబులు = పైకెగయునవి; ఐ = అయ్యి; మెదలి = కొద్దిగా కదిలి; కదలి = పెడలి; పాఱెడి = ప్రవహించెడి; ఏరులును = ప్రవాహములు; ఏరుల = ప్రవాహముల; వెంటన్ = వెనుక; గఱులు = రెక్కలు; త్రిప్పుచు = కదల్చుచు; గములు = గుంపులు; కొని = కట్టి; క్రొత్త = కొత్త; నీటి = నీటి ప్రవాహముల; కిన్ = కు; ఎదురు = ఎదురుగా; నడచు = ఈదెడి; మీనంబులును = చేపలు; మీననయనల = అందగత్తెల {మీననయన – మీన (చేపలవంటి) నయన (కన్నులు కలామె), సుందరి}; మేనుల = దేహముల; మెఱుంగు = కాంతుల; సొంపు = చక్కదనముల; పెంపున్ = అధిక్యమును; సైరింపక = ఓర్వలేక; కంపించి = వణికిపోయి; తిరిగి = వెనుదిరిగి; సురిగి = దాగి; చనియెడు = పోవునట్టి; కరణిన్ = విధముగా; మేఘ = మబ్బుల; మధ్యంబులన్ = నడుమ; పొలసి = కనబడి; మలసి = వ్యాపించి; నిలువక = నిలువకుండా; మరలిచను = మాయమగు; క్రొత్త = నూతనమైన; మెఱుంగులును = మెరుపులు; మెఱుంగుల = మెరుపుల; తెరంగునన్ = వలె; తెఱవలు = స్త్రీలు; పురుషులన్ = పురుషులతో; తగిలి = లగ్నమై, నిలకడగకూడి; నిలువరు = ఉండరు; అని = అని; జనుల్ = ప్రజల; కున్ = కి;

ఎఱుంగ = తెలియునట్లు; నలువ = బ్రహ్మదేవుడు; మొఱయిడిన = మొత్తుకొన్న; వడుపునన్ = విధముగ; మొరయు = ధ్వనించునట్టి; ఉఱుములును = ఉరుములు; ఉఱుముల్ = ఉరుముల; కున్ = కి; ఉలికిపడక = బెదిరిపోక; కికురుపొడుచుచన్ = మెడలు తిప్పుతు; పింఛంబులున్ = పింఛములను; కొంచెంబులుజేయక = ముడుచుకొనకుండ; విప్పి = విస్తారించి; తెప్పరంబుగన్ = అధికముగ; రొప్పుచున్ = కేకలువేయుచు; నర్తనంబులు = నాట్యములు; చేయు = చేయునట్టి; మయూరంబులును = నెమళ్ళు; మయూర = నెమళ్ళ; ఘోషంబులు = కేకలు; భీషణంబులు = భయంకరములుగ; ఐ = అయ్యి; చెవులున్ = చెవులకు; సోకన్ = తగులగానే; అనూనంబులు = తక్కువకాని, అధికమైన; మానంబులన్= శీలములమీది; ఆసలు= ఆపేక్షలు; చెడి = పోయి; ఒండొరుల = రెండవవారి; కున్ = కి; క్రిందుపడి = కిందపడి; క్రందుకొను = అతిశయించెడి; విరహి = విరహముగల; జనులును = ప్రజలు; జనుల్ = మానవుల; కున్ = కు; రేపుమాపు = పగలురాత్రి; అని = అనెడిభేదము; రూపింపన్ = చెప్పుటకు; రాక = అనువుగాక; మాలతీ = జాజి; కుసుమ = పూల; విసర = సమూహములయొక్క; వికసన = విరిసినట్లు; విదిత = తెలియుట; అవసానంబులు = ముగిసినవి; అగు = ఐన; దుః = చెడ్డ; దినంబులును = రోజులు; దినావసాన = సాయంకాల; సమయంబునన్= సమయమునందు; మినుకుమినుకు = మినుకుమినుకు; అని = అని; మెఱయుచున్ = ఆరిపెలుగుతు; తిరుగు = మెలగునట్టి; ఖద్యోతంబులును = మిణుగురు పురుగులును; ఖద్యోత = సూర్యుడు; సందర్శనంబున్ = చక్కగాకనబడుటను; కోరుచును = అపేక్షించుచు; ఉడుగక = తగ్గకుండ; విడువక = వదలకుండ; కురియు = వర్షించెడి; జడిన్ = జల్లులందు; పడి = చిక్కుకొని; వలిగొని = చలిపెట్టి; వడకుచున్ = వణికిపోతు; అశన = వంటవండెడి; ప్రయత్నంబులున్ = ప్రయత్నములను; వర్జించి = విడిచిపెట్టి; ఖర్జూర = ఖర్జూరము, పేరితల; జంబు = నేరేడు; ఫల = పండ్లను; భక్షణంబులన్ = తినుటచేత; దేహ = శరీర; సంరక్షణంబులు = పోషించుకొనుటలు; ఆచరించు = చేసెడి; వనచరులును = అడవిమనుషులు; వనచర = అడవిమనుషులకు; ఆనంద = ఆనందమును;

కారిణులు = కలిగించెడివారు; ఐన = అయినట్టి; వారరమణుల = వేశ్యల; రుచిన్ = వలె; అనవరత = ఎల్లప్పుడు; భుజగ = విటులనెడి మిన్నాగులతో; సమేతలు = కూడినవి; అగు = ఐన; కేతకులును = పచ్చమొగలిచెట్లు; కేతకి = పచ్చమొగలి; కదంబ = కడిమి; యూధికా = అడవిమొల్ల; కుటజ = కొండిసె; కుసుమ = పూల; పరిమళ = సువాసనతో; మిళితంబులు = కూడినవి; అగు = ఐన; విపిన = అడవి; మార్గంబులును = దార్లు; మార్గ = దారిని; నిరోధంబులు = అడ్డగించునవి; అగుచున్ = ఔతు; పెరిగి = వృద్ధిపొంది; రసికంబులు = రుచికరములైనవి; ఐ = అయ్యి; పసరు = ఆకుపచ్చవన్నెను; తొలంకుచు = ధరించెడి; హిరణ్మణి = పచ్చల; కిరణ = కాంతుల; పుంజంబుల = సమూహముల; భంగిన్ = వలె; రంజిల్లి = ప్రకాశించి; తొంగలించుచున్ = అతిశయించుచు; జొంపంబులుగొనిన = గుబురులుగట్టిన; కసువులును = గడ్డిదుబ్బులు; కసువులున్ = గడ్డిదుబ్బులు; మెసవి = మేసి; మిసమిసన్ = మిసమిసమెరిసెడి; తనువులున్ = శరీరములు; మెఱయన్ = మెరుస్తుండగా; వలుద = లావైన; పొదుగుల = పొదుగుల; బరువునన్ = బరువు వలన; కదలకన = కదలకుండ; నిల్చి = నిలబడి; నెమరు = నెమరువేయుట; అమరన్ = చక్కగా; ఇడు = చేయునట్టి; ధేనువులును = ఆవులు; కలిగి = కలదై; ధేను = పాడిఆవుల; వ్రజంబు = మంద; కైవడిన్ = వలె; పయస్ = నీటి, పాల; కణ = బిందువులచేత; మనోహరంబు = అందగించినవి; ఐ = అయ్యి; హర = శంకరుని (సారంగధరుని); కరంబు = చేతి; భంగిన్ = వలె; పరిపూర్ణ = నిండైన; సారంగ = వానకోకిలలచేత, జింకతో; భాసురంబు = ప్రకాశించునది; ఐ = అయ్యి; సురగిరి = మేరుపర్వతము; చెలువునన్ = వలె; హరి = ఇంద్ర, విష్ణువు అనెడి; శరాసన = ధనుస్సుతో, బాణమునకు విల్లు అగుటచేత; విభీషణంబు = మిక్కిలి భయంకరమైనది; ఐ = అయ్యి; విభీషణ = విభీషణుని; హృదయం◌ోబు = మనసు; పోలికన్ = వలె; ప్రకటిత = ప్రసిద్ధముగ, ప్రసిద్ధమైన; హరి = కప్పల, హరి అనెడి; శబ్ద = చప్పుళ్ళుతో, మాటచేత; వైభవంబు = కలిమికలది, గొప్పదనము కలది; ఐ = అయ్యి; భవ = శివుని; పూజనంబు = పూజించుట; చందంబునన్ = వలె; ఇంద్రగోప =

ఆరుద్రపురుగులు, ఇంద్రునిపోషణ; ఆది = మున్నగువానియొక్క; విభవ = కలిమికి, కలుములు; జనకంబు = జన్మస్థానము, కలుగునది; ఐ = అయ్యి; జనక = జనక మహారాజుయొక్క; యాగంబు = యజ్ఞము; భాతిన్ = వలె; సీతా = నాగేటిచాళ్ళు, సీతాదేవి; ప్రకరణ = చక్కగాచేయుటచేత, సంగతివలన; అలంకృతంబు = అలంక రింపబడినది; ఐ = అయ్యి; కృతయుగంబు = కృతయుగము; సొంపునన్ = వలె; బహు = అధికమైన, అనేకమైన; వర్షంబున్ = వానలుకలది, సంవత్సరములు కలది; ఐ = అయ్యి; వర్ష = వానాకాలము; ఆగమంబు = వచ్చుట; వచ్చెను = జరిగెను; అప్పుడు = ఆ సమయమునందు.

భావము:- ఇంకా, ఆ వర్షాకాలంలో ప్రచండమైన మారుతాలకు కదలి వచ్చి, మబ్బులు గగనమండలం అంతా ఆక్రమించాయి. గణనాతీతమైన ఆ మేఘాలు రెక్కలు కలిగిన నీలికొండల వలె వ్యాపించి సందు లేకుండా దట్టంగా కమ్ము కున్నాయి. సూర్యచంద్ర బింబాల కాంతులు మూసేసి మహా వ్యాపకాలై అవి ఆకాశ తలం ఆవరించాయి. వర్షాకాలం అనే వలపుకాడు సవిలాసంగా పుడమి పడతి యెదపై సమర్పించిన కర్పూర ఖండాల వలె మబ్బుల నుండి వడగళ్ళు రాలాయి. ఆ వడగండ్ల వెంట నల్లత్రాచు పడగల విధంగా ఇంద్రనీల మణిహారాల తీరున అవిచ్ఛిన్నంగా జలధారలు జాలువారాయి. జలధారల నుంచి కారుతున్న నిర్మల నీళ్ళతో తడిసిన గిరులు మదజలాలతో అభిషేకించబడ్డ మత్తగజాల మాదిరి చెలువొందాయి. కొండ శిఖరాల నుండి చట్టుబండల మీద పడి సెలయేటి నీటిధారలు చెల్లాచెదురు అయ్యాయి. వాటి నీటి తుంపరలకు చెమ్మగిల్లి నేల చితచితలాడుతూ అడుసు అయింది. ఆ బురద మీద దొరలి పొరలిన నీరు వరదలై ప్రవహించింది. వాగులు వంకలు ఏకమై ఏరులై పారాయి. ఆ యేళ్ళలో రెక్కలాడిస్తూ గుంపులు కట్టి చేపలు వరద నీటికి ఎదురీదాయి. ఆ చేపల వంటి బెళుకు కన్నులు కల భామల సెమ్మేని తళతళలకు తాళలేక వణుకుతూ పారిపోతున్నవా అన్నట్లు మబ్బుల మధ్య తళుక్కున మెరసి మరుక్షణంలోనే మెరుపుతీగలు మాయమై పోయాయి. ఆ మెరుపుల్లాగ చంచల చిత్తలైన పొలతులు పురుషుల వెంత నిలకడగా

నిలువరు సుమా! అని జనులకు బ్రహ్మదేవుడు ఎలుగెత్తి చాటుతున్నాడా అన్నట్లుగా ఉరుములు ఉరిమాయి. ఆ ఉరుములకు రవంతయినా వెరవక పింఛాలు చక్కగా విప్పుకుని నెమళ్ళు క్రేంకారాలు చేస్తూ నాట్యాలాడాయి. నెమలి కూతలు భీకరంగా చెవుల పడేసరికి విరహంతో వేగుతున్న దంపతులు అభిమానం వదులుకుని ఒకరికొకరు దాసులయ్యారు. మబ్బులు క్రమ్మడం మూలాన ఇది పగలు ఇది రేయి అని తెలియకపోయినా మాలతీపూలు పూచి సంధ్యాసమయాన్నిసూచించాయి. పగలు ముగియగానే మినుకుమినుకు మని మెరుస్తూ మిణుగురులు మింట తిరుగాడాయి. ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురుస్తున్న జడివానలో చలికి గడగడా వణుకుతూ ఎండకోసం ఎదురు చూస్తూ, వంట ప్రయత్నాలు మాని కిరాతులు ఖర్జూరాలు నేరేడుపండ్లతో ఆకలి బాపుకున్నారు. ఎల్లప్పుడూ విటుకాండ్ర పొత్తు వీడని వారవనితల లాగ సదా సర్పాల పొత్తు బాయని మొగలిపూలు చెంచులకు సంతోషం సమకూర్చాయి. అడవి త్రోవలు విరబూచిన మొగలి, కడిమి, మొల్ల, గోరంట పూల గుబాళింపులతో నిండిపోయాయి. ఇంద్రనీల మణికాంతుల నెగజిమ్ముతూ దారికడ్డంగా పసరు వెలిగక్కే పచ్చిక గుబురుగా పెరిగింది. ఆ పచ్చిక జొంపాలు మెసవి ఒడలు మిసమిసలాడగా కుండపొదుగుల బరువుచే కదలలేక నిలచి మొదవులు నెమరవేయసాగాయి. ఆ వానకారు క్షీర సంపన్నమైన ఆవుల మంద లాగ జల బిందువులతో ఇంపారింది. జింకతో చెలువారే శివుని చెయ్యి లాగ నిండైన వానకోయిలలతో సొంపారింది. విష్ణువనే బాణం అధిష్ఠించడం చేత భీకరమైన మేరు శైలం లాగ ఇంద్రచాపం చేత చెలువారింది. హరి నామసంకీర్తన వైభవంతో కూడిన విభీషణుని హృదయం లాగ భేకముల బెకబెక ధ్వనులతో ఎసలారింది. ఇంద్రుడు గోవిందుడు మొదలగువారికి ఐశ్వర్యాపాదక మైన శివపూజ లాగ ఆరుద్ర పురుగులతో అలరారింది. సీతామహాదేవి వృత్తాంతంతో జనకచక్రవర్తి యాగంలాగ నాగటిచాళ్ళతో సొబగారింది. బహు సంవత్సరాలు కలిగిన కృతయుగం లాగ మెండైన వానలతో నిండారింది.

విశేషము- ముక్తగ్రస్త వర్షం కురిపించి ఎంత చక్కగా మురిపించారు మన సహజకవి పోతనామాత్యులవారు. (ముందు వర్ణనలో కాని పాదంలో కాని విడిచిన పదాన్ని అందుకుని తరువాతి వర్ణన లేదా పాదం మొదలెడుతుంటే ముక్తగ్రస్తాలంకారం..)

10.1-758-క.

వాడక వ్రాలక తెవులుల(

గూడక తగ నల్ల గెఱలుగొని నవకములై

చూడ(గ భద్రము లగుచును

వీడెన్ సస్యంబు లిడుమ వీడెం బ్రజకున్.

టీక:- వాడక = వడలిపోకుండ; వ్రాలక = వాలిపోకుండ; తెవులులన్ = చీడలుతో; కూడక = కూడి ఉండకుండ; తగన్ = చక్కగా, యుక్తముగా; నల్ల = నల్లని; గెఱలుకొని = ఛాయపొంది; నవకములు = కోమలములు; ఐ = అయ్యి; చూడగన్ = చూచుటకు; భద్రములు = బాగున్నవి; అగుచును = అగుచు; వీడెన్ = వికసించినవి; సస్యంబులు = పైర్లు; ఇడుము = ఇక్కట్లు; వీడెన్ = తొలగెను; ప్రజ = జనుల; కున్ = కు.

భావము:- ఎండకు వాడిపోయి నేలమీదకి వ్రాలిపోకుండా, చీడపీడలకు గురికాకుండా, నవనవలాడుతూ నలుపెక్కి పైరులు ఏపుగా పెరిగాయి. ప్రజలకు ఇక్కట్లు తొలిగాయి.

10.1-759-క.

జీవనము చాల(గలిగియు(

గావరమున మిట్టిపడని ఘనునిక్రియ నదీ

జీవనములు ఘోర జలనిధి

ప్రావృట్కాలమున డిందుపడి యుండె నృపా!

టీక:- జీవనము = మంచి జీవితము; చాలన్ = అధికముగనే; కలిగియున్ = ఉన్నను; కావరమునన్ = గర్వముతో; మిట్టిపడని = మిడిసిపడనట్టి; ఘనుని = గొప్పవాని; క్రియన్ = వలె; నదీ = నదుల యొక్క; జీవనములు = నీళ్ళు; ఘోరన్ = ప్రవేశించుచున్నను; జలనిధి = సముద్రము; ప్రావృట్కాలమునన్ = వర్ష ఋతువు నందు; డిందుపడి = అణగియే; ఉండెన్ = ఉండెను; నృపా = రాజా.

భావము:- పరీక్షన్నరేంద్రా! ఎంత సంపన్నుడైనప్పటికీ గొప్పవాడు తలపొగరుతో మిడిసిపడడు. అదే విధంగా, నదుల నుండి ఎంత దండిగా నీరు వచ్చి చేరుతున్నా, వానాకాలంలోనూ సాగరుడు హద్దుమీరక అణగి ఉన్నాడు.

వర్షాగమ విహారంబు

10.1-760-శా.

ఆ వర్షాగమమందు గోవుల నరణ్యాంతంబులన్ మేపుచున్
గోవిందుండు ప్రలంబవైరియుతుఁడై గోపాలవర్గంబుతోఁ
బ్రావీణ్యంబునఁ గందమూలఫలముల్ భక్షించుచున్ మంజుల
గ్రావాగ్రంబులఁ బ్రీతిఁ జల్దిగుడిచెం గాసారతీరంబులన్.

టీక:- ఆ= ఆయొక్క; వర్షాగమము= వర్ష ఋతువు; అందున్ = లో; గోవులన్ = ఆవులను; అరణ్య = అడవుల; అంతంబులన్ = లో; మేపుచున్ = కాచుచు; గోవిందుండు = కృష్ణుడు {గోవిందుడు - గోవులకు ఒడయుడు, కృష్ణుడు}; ప్రలంబ వైరి = బలరామునితో {ప్రలంబవైరి – ప్రలం బాసురిని శత్రువు, బలరాముడు}; యుతుడు = కూడినవాడు; ఐ = అయ్యి; గోపాల = గోపకుల; వర్గంబు = సమూహము; తోన్ = తోటి; ప్రావీణ్యంబునన్ = నేర్పరితనముతో; కందమూల = దుంపలు, కందదుంపలు; ఫలముల్ = పండ్లు; భక్షించుచున్ = తినుచు; మంజుల = చక్కటి; గ్రావ = కొండరాళ్ళ; అగ్రంబులన్ = మీద; ప్రీతిన్ = ఇష్టముగా; చల్ది = చల్లన్న ములను; కుడిచెన్ = తినెను; కాసార = సరోవరముల; తీరంబులన్ = గట్లమీద.

భావము:- ఆ వర్షఋతువులో శ్రీకృష్ణుడు అడవుల అంచుల్లో ఆవులను మేపుతూ. ప్రలంబా సురుణ్ణి వధించిన బలరాముడితోనూ, గోపాలబాలకులతోనూ కలిసి కందమూలాలు ఫలాలు అరగిస్తూ మడుగుల గట్ల మీద మనోహరమైన శిలాతలాల మీద, సంతోషంగా చల్దులు భుజించాడు.

10.1-761-వ.

ఆ సమయంబున.

టీక:- ఆసమయంబునన్ = అప్పుడు. భావము:- అలా వర్షాకాలంలో.

10.1-762-సీ.

విశ్వమోహనమైన వేణు నినాదంబు-
సరసగంభీర గర్జనముగాఁగ
మహనీయ నిర్మల మందహాసద్యుతి-
లలిత సౌదామనీ లతిక గాఁగఁ
దలచుట్టు బాగుగఁ దనరు పింఛపుదండ-
శైలభేదను శరాసనము గాఁగఁ
గరుణా కటాక్షవీక్షణ సుధావర్షంబు-
సలిలధారా ప్రవర్షంబు గాఁగఁ

10.1-762.1-తే.

జాడ సేతెంచు గోపాలజన మునీంద్ర
చాతకంబుల దురవస్థఁ జక్కఁ జేసి
కృష్ణమేఘంబు బహుతరకీర్తి నొప్పె
విమల బృందావనాకాశవీధి యందు.

టీక:- విశ్వ = లోకములను; మోహనము = మోహింపజేయునది; ఐన = అయినట్టి; వేణు = మురళీ; నినాదంబు = రవము; సరస = నవరసభరితమైన {నవరసములు - 1శృంగారము 2హాస్యము 3కరుణము 4వీరము 5రౌద్రము 6భయానకము 7భీభత్సము 8అద్భుతము 9శాంతము}; గంభీర = గంభీరమైన; గర్జనము = ఉరుమువంటిది; కాగన్ = అగునట్లుగా; మహనీయ = గొప్పదైన; నిర్మల = స్వచ్ఛమైన; మందహాస = చిరినవ్వుల; ద్యుతి = కాంతి; లలిత = మనోజ్ఞమైన; సౌదామనీ = మెరుపు; లతిక = తీగ; కాగన్ = అగునట్లుగా; తల = శిరస్సు; చుట్టు = చుట్టూర, వలగొని; బాగుగన్ = చక్కగా; తనరు = అతిశయించునట్టి; పింఛపు = నెమలిపింఛము; దండ = మాల; శైలభేదనుశరాసనము = ఇంద్రధనుస్సు {శైలభేదనుశరాసనము - శైలభేదను (పర్వతములను కొట్టెడివాని, ఇంద్రుని) శరాసనము (విల్లు), ఇంద్రధనుస్సు}; కాగన్ = అగునట్లుగా; కరుణా = దయతోకూడిన; కటా = కడ; అక్ష = కన్నుల; వీక్షణ = చూపులు అనెడి; సుధా = అమృతపు; వర్షంబు = జల్లులు; సలిల = నీటి; ధారా = ధారలుగల; ప్రవర్షంబు = మంచివాన; కాగన్ = అగుచుండగ.

జాడన్ = అనుసరించి; ఏతెంచు = వచ్చెడి; గోపాలజన = గొల్లవాళ్ళు; ముని = ఋషి; ఇంద్ర = శ్రేష్ఠులు అనెడి; చాతకంబుల = చాతకపక్షుల, వానకోకిల; దురవస్థన్ = బాధలను; చక్కన్ = బాగు; చేసి = చేసి; కృష్ణ = కృష్ణుడు అనెడి; మేఘంబు = మేఘము; బహుతర = మిక్కిలిఅధికమైన {బహు - బహుతరము - బహుతమము}; కీర్తిన్ = కీర్తితో; ఒప్పెన్ = ఒప్పెను; విమల = స్వచ్ఛమైన; బృందావన = బృందావనము అనెడి; ఆకాశ = ఆకాశపు; వీధి = దారి; అందున్ = లో.

భావము:- నిర్మలమైన బృందావనం అనే వినువీధిలో శ్రీకృష్ణుడనే మేఘం మిక్కిలి విఖ్యాతంగా విహరించింది. భువనాలను సమ్మోహపరచే వేణుగానమే ఆ నీలమేఘానికి రసవంతమైన గంభీరమైన గర్జన అయింది. ఉదాత్తమూ స్వచ్ఛమూ అయిన దరహాస శోభయే మెరుగారు మెరుపుతీగ అయింది. తలచుట్టున చక్కగా విలసిల్లే నెమలిపింఛ కలాపమే ఇంద్రచాపం అయింది. కరుణాపూరితమైన

కడగంటి చూపుల నుండి ప్రసరించే అమృతవర్షమే నీటి జల్లులు వార్చే వాన అయింది. ఇలా సంచరించిన ఆ శ్రీకృష్ణజీమూతం, తన్ను అనుసరించే గోపాలురు, మునీంద్రులు అనే చాతకపక్షుల తాపాలను రూపుమాపింది.

10.1-763-క.

గోవుల వృషవత్సంబుల

వావిరిఁ బూజించి పిదప వర్షాకాల

శ్రీవనితనుఁ బూజించెను

శ్రీవల్లభుఁ డయ్యు గోపశేఖరుఁ డధిపా!

టీక:- గోవులన్ = ఆవులను; వృష = ఎద్దులను; వత్సంబులన్ = దూడలను; వావిరిన్ = అధిక ముగ; పూజించి = పూజించి; పిదపన్ = తరువాత; వర్షాకాల = వర్ష ఋతువు అనెడి; శ్రీవనితను = లక్ష్మీదేవిని; పూజించెను = పూజించెను; శ్రీవల్లభుండు = లక్ష్మీపతి; అయ్యున్ = అయినప్పటికి; గోప శేఖరుడు = కృష్ణుడు {గోపశేఖరుడు - గోపకులలో శేఖరుడు (శ్రేష్ఠుడు), కృష్ణుడు}; అధిపా = రాజా.

భావము:- పరీక్షిత్తు మహారాజా! తాను లక్ష్మీవల్లభుడైనా ఆ యదునందనుడు గోవులను కోడెదూడలను పూజించాడు ఆ పై వర్షలక్ష్మిని అర్చించాడు.

శరదృతువర్ణనము

10.1-764-వ.

ఇట్లు కృష్ణుండు విహితవిహారంబుల వర్షాకాలంబుఁ బుచ్చె; నంత.

టీక:- ఇట్లు = ఈ విధముగ; కృష్ణుండు = కృష్ణుడు; విహిత = తగినట్టి; విహారంబులన్ = నడవడికలతో; వర్షాకాలంబున్ = వానాకాలమును; పుచ్చెన్ = గడపెను; అంత = అంతట.

భావము:- ఇలా ఆ నందనందనుడు యథోచిత విహారాలతో వర్షాకాలం గడిపాడు. పిమ్మట, శరదృతువు వచ్చింది.

10.1-765-క.

జొంపములు గొనియె వనములు;
రొంపు లిగిరె; సెమలిగముల రొద లుడిగె; నదుల్
పెంపులకుఁ బాసె; నుఱుముల
శంపల సంపదలు మాసె శారదవేళన్.

టీక:- జొంపములున్ = గుబురులు; కొనియెన్ = కట్టెను; వనములు = అడవులు; రొంపులు = బురదలు; ఇగిరెన్ = ఎండిపోయినవి; సెమలి = సెమళ్ళ; గములన్ = సమూహము లందు; రొదలు = కేకలిడుట; ఉడిగెన్ = తగ్గెను; నదుల్ = నీటిప్రవాహములు; పెంపుల్ = వరదల; కున్ = కు; పాసెన్ = దూరమయ్యెను; ఉఱుములన్ = ఉరుములయొక్క; శంపల = మెరుపులయొక్క; సంపదలు = సమృద్ధులు; మాసెన్ = తొలగెను; శారదవేళన్ = శరదృతువు నందు.

భావము:- ఆ శరత్కాలంలో అరణ్యాలన్నీ గుబురుగా పెరిగాయి; బురదలు ఎండిపోయాయి; సెమలి గుంపుల కేక ధ్వనులు ఆగాయి; ఉరుముల మెరుపుల ఆడంబరాలు అణిగాయి.

10.1-766-వ.

మఱియు జీవనంబులు విడిచి, విమలజ్ఞానవశంబున ముక్తులగు పురుష రత్నంబులచెన్నునఁ జెన్ను వదలి, మిన్ను విడిచి, వాయువశం బులై, వెల్లివిరిసి చను మేఘంబులును, మేఘపటలరహితంబును, గలశ భవముని సహితం బునునయి, విజ్ఞానదీప విలసితంబగు యోగిహృద యంబు చందంబున శుభం బైన నభంబును, నభంబున నీలదుకూల

వితాన సంయుక్త ముక్తా ఫలంబుల నడువున నెగడు నుడుగణంబు లును, నుడుగణ మయూఖంబు క్రొవ్వు లుప్పతిల్లుగఁ గొని నివ్వటిల్లుచు బ్రహ్మాండ కరండ కర్పూర ఖండాయ మానంబు లగు చంద్రకిరణంబు లును, జంద్రకిరణ సమ్మర్శనంబున సగర్భం బులై భూమికి దుర్భరంబు లగుచు నిండి పండి హాలిక కర నిశిత లవిత్ర ధారా సంరంభంబుఁ దలంచి తల్లడిల్లి వెలవెలకంబాఱుచుఁ దల్లియగు విశ్వంభరకు మును కొని ప్రణతంబులై వడంకుచు నెఱుంగ మొఱయిడుచున్న పెంపున సంపన్నంబులైన యెన్నులప్రేగున వ్రాలి గాలిందూలుచు మర్మరధ్వనుల సారస్యంబులగు కలమాది సస్యంబులును సస్యమంజరీ పుంజం బులంగొంచక చంచువులఁద్రుంచి కబళించి పిల్లపెంటితండంబులం గూడి కడు పులు నిండ మెక్కి విక్కవిరిసి ఛొక్కుచుఁ ద్రిక్కలుగొని మహోత్తుంగ సమంచిత మంచప్రదే శంబులెక్కి సంచరించుచు పెన్నులకావలియున్న యన్నులకెమ్మోవులు బింబ ఫలంబు లని కఱచి తత్కరాస్ఫాలనంబుల నులికి పడి యెగసి చను శుకనిక రంబుల కలకలంబులును, గలహంస కోక సారస కోలాహల మండితంబులై నిండిన నిర్మలజలంబులు గల జలాశయంబు లును, జలాశయముల జలము లనుదినము నిగుర గృహములఁబ్రతుకు దినములుచనుట యెఱుంగని మను జుల గమనికం దిరుగు జలచరంబులును, జలచర హృదయముల బెగడు గదుర డొంకి యింకిన నదులును, నదులందుఁ గర్పూర మండపంబుల తెఱంగున, మణికుట్టిమంబుల మూడ్కిని సౌధ సోపానమార్గంబుల జాడను, విలోకితంబులగు నూతన సైకతంబు లును సైకత ప్రదేశంబుల నుదయ వేళల నిత్యకర్మానుష్ఠాన నిరతులగు

మునులును, మునికన్యకాకర కలశ సలిలాభి షిక్తమూలంబులగు తపోవన బాలరసాల సాలంబులును, సాలవిటపి వాసం తికా కుంజపుంజంబుల తఱచున నిముడుకొని దినకర కిరణములకుం గరువలికిం జొర పెరవుపడని వనమ్ములును, వనమ్ములం దరుల కొమ్మల నాకలమ్ములు సేకలమ్ములై మెసంగి మసరుకవిసి క్రొవ్వి కొమ్ము కొనల సూటి యేటిదరులు త్రవ్వి చిమ్మి కుమ్మి కోరాడెడు వనగజం బులును, గజకుంభ కనకకుంభ రుచిర కుచభార భీరుమధ్య సమంచిత లగు చెంచితలును, జెంచి తల క్రూరమ్ము లగు వాలమ్ముల సారములుచెడి బెడిదంబుగఁ బాదంబులు దొట్రుపడఁ బెనుగాతమ్ము లంబడు వరాహ పుండరీకంబులును, బుండరీక కుంద కుముద కురంటకాది కుసుమ మకరందంబులు గ్రోలి తేలి సోలి వాలి మహాహం కృతుల ఝుంకృతులు జేయు తేఁటికదుపులును, గదుపులం గలయక యెదగలిగి మదమున నదనుపద సెఱింగి మదనమార్గణ ప్రేరితం బులై పెంటితుటుముల పెంటం జని యొండొంటి గెంటించుచుఁ దగుల సెక్కి గర్భంబులు సెక్కొలుపు మృగవృషభరాజంబులును గలిగి రాజ రాజగృహంబు పగిది విలసిత కుంద పద్మ సౌభాగ్యం బై, భాగ్యహీను కర్మంబు రేఖ నశ్రుత నీలకంఠ శబ్దంబై, శబ్దశాస్త్రవేది హృదయంబు బాగున విశదప్రకాశాభిరామం బై, రామసంగ్రామంబు కైవడి బాణా సనాలంకృతంబై, కృతాంత హృదయంబు కరణి నపంకంబై, పంక జాసను గేహంబు సొంపున రాజహంస విరాజమానం బై, మానధనుని చరిత్రంబు సొబగున నకల్మషజీవనంబై, వననిధి పొలుపున సమ్మిళిత

భూభృద్వాహినీ సంకులంబై, కులవధూరత్నంబు చెలువున నదృష్ట పయోధరంబై ధరణికిం దొడ వగుచు శరత్కాలంబు వచ్చె; నందు.

టీక:- మఱియున్ = ఇంకను; జీవనంబులు = ఉపాధులను; విడిచి = వదలిపెట్టి; విమల = పంచమలములు తొలగిన {పంచమలములు - 1ఆణవ 2కార్మిక 3మాయిక 4మాయేయ 5తిరోధానములు అనెడి ఆధ్యాత్మవిద్యార్జనలో కలిగెడి మలములు}; జ్ఞాన = విజ్ఞానము; వశంబునన్ = చేత; ముక్తులు = మోక్షము పొందినవారు; అగు = ఐన; పురుష = పురుషులలో; రత్నంబుల = శ్రేష్ఠమైనవారి; చెన్నునన్ = విధముగ; చెన్ను = చక్కగనుండుటను; వదలి = విడిచిపెట్టి; మిన్నున్ = ఆకాశమును; విడిచి = వదలిపెట్టి; వాయు = గాలివాటు; వశంబులు = అనుగుణముగా పోవునవి; ఐ = అయ్యి; పెల్లివిరిసి = చెదిరి; చను = పోవు; మేఘంబులును = మేఘములు; మేఘ = మేఘముల; పటల = సమూహములు; రహితంబును = లేనిది; కలశభవ = అగస్త్య; ముని = ఋషితో; సహితంబును = కూడినది; అయి = ఐ; విజ్ఞాన = విమలజ్ఞానము అనెడి; దీప = దీపముచేత; విలసితంబు = ప్రకాశించునట్టిది; అగు = ఐన; యోగి = ఋషుల; హృదయంబు = మనసు; చందంబునన్ = వలె; శుభంబు = పరిశుద్ధమైనది; ఐన = అయిన; నభంబును = ఆకాశమున; నభంబునన్ = ఆకాశము నందు; నీల = నల్లనైన; దుకూల = మురికిలేని వస్త్రముల; వితాన = మేలుకట్టు నందు; సంయుక్త = కూడుకొని ఉన్న; ముక్తాఫలంబుల = ముత్యముల; వడువునన్ = వలె; నెగడుచున్ = అతిశయించునట్టి; ఉడు = నక్షత్రములయొక్క; గణంబులును = సమూహముల; ఉడు = నక్షత్ర; గణ = సమూహముల; మయూఖంబున్ = కాంతులయొక్క; కొవ్వులు = మదములను; ఉవ్వెత్తుగన్ = బహు మిక్కిలిగా; కొని = అపహరించి; నివ్వటిల్లుచున్ = అతిశయించుచు; బ్రహ్మాండ = బ్రహ్మాండము అనెడి; కరండ = భాండము నందలి; కర్పూర = పచ్చకర్పూరపు; ఖండాయమానంబులు = పలుకులో అనదగినవి; అగు = ఐన; చంద్ర = చంద్రునియొక్క; కిరణంబులును = కిరణములు; చంద్రకిరణ = వెన్నెలల; సమ్మర్శనంబునన్ = బాగుగా సోకుట చేత; సగర్భంబులు = పొట్టలు గలవి; ఐ =

అయ్యి; భూమి = నేల; కిన్ = కు; దుర్భరంబులు = భరింపరానివి; అగుచున్ = ఔతు; నిండి = నిండుగా; పండి = ఫలించి; హాలిక = సేద్యగాని, రైతుయొక్క; కర = చేతి యందలి; నిశిత = వాడియైన; లవిత్ర = కొడవలి; ధారా = పదునుయొక్క; సంరంభం బున్ = ఆటోపమును; తలంచి = తలచుకొని; తల్లడిల్లి = కంగారుపడిపోయి; వెల వెలకన్ = తెలతెల్లగా; పాఱుచున్ = ఐపోతూ; తల్లి = తల్లి; అగు = ఐన; విశ్వంభర = భూదేవి; కున్ = కి; మునుకొని = పూని; ప్రణతంబులు = మొక్కునవి; ఐ = అయ్యి; వడంకుచున్ = వణికిపోతూ; ఎఱుంగన్ = తెలియునట్లు; మొఱయిడుచున్న = మొర పెట్టుకొంటున్న; పెంపునన్ = విధముగా; సంపన్నంబులు = సమృద్ధిగా ఉన్నవి; ఐన = అయిన; ఎన్నుల = వెన్నుల, కంకుల; ప్రేగునన్ = బరువు వలన; వ్రాలి = నేలకు వంగి; గాలిన్= గాలివాటునకు; తూలుచున్= చలించుచు; మర్మర = మరమరమనెడి {మర్మర – గాలికి వస్త్రములు, ఆకులు చేసెడి ధ్వన్యనుకరణ}; ధ్వనులన్ = చప్పుళ్ళతో; సారస్యంబులు = రసవంతము లైనవి; అగు = ఐన; కలమ = వరి; ఆది = మున్నగు; సస్యంబులు = పైర్లు; సస్య = పైరుల; మంజరీ = కంకుల; పుంజంబులన్ = గుత్తులను; కొంచక = సంకోచింపకుండా; చంచువులన్ = ముక్కులతో; త్రుంచి = తుంచుకొని; కబళించి = మింగి; పిల్ల = పిల్లపక్షులు; పెంటి = ఆడపక్షుల; తండంబులన్ = సమూహములతో; కూడి = కలిసి; కడుపులు నిండ = సంతుష్టిగా; మెక్కి = మిక్కిలిగా తిని; విక్కవిరిసి = మిక్కిలి ఉప్పొంగి; ఛొక్కుచున్ = దేహములు మరచుచు; త్రిక్కలుగొని = తిక్కెత్తి, వెఱ్ఱెత్తి; మహా = గొప్ప; ఉత్తుంగ = ఎత్తైన; సమంచిత = చక్కటివి యైన; మంచ = మంచెలపై; ప్రదేశంబులు = చోట్లకు; ఎక్కి = ఎక్కి; సంచరించుచున్ = మెలగుచు; వెన్నుల = కంకులకు; కావలి = కాపలాకాయుచు; ఉన్న = ఉన్నట్టి; అన్నులన్ = స్త్రీలయొక్క; కెంపు = ఎఱ్ఱని; మోవులున్ = పెదవులను; బింబఫలంబులు = దొండపండ్లు; అని = అని; కఱచి = ముక్కులతో పొడిచి; తత్ = వారి; కర = చేతుల; ఆస్ఫాలనంబులన్ = చప్పట్ల వలన; ఉలికిపడి = అదరిపడి; ఎగసి = ఎగిరి; చను = పోవునట్టి; శుక = చిలుకల; నికరంబుల = సమూహముల; కలకలంబులును = కలకల ధ్వనులు; కలహంస =

రాజహంసల; కోక = చక్రవాకములు; సారస = బెగ్గురుపక్షులు; కోలాహల = కలకల ధ్వనులచే; మండితంబులు = అలంకరింపబడినవి; ఐ = అయ్యి; నిండిన = నిండుగా ఉన్న; నిర్మల = స్వచ్ఛమైన; జలంబులు = నీరు; కల = కలిగిన; జలాశయంబులును = చెరువులు; జలాశయముల = చెరువులలోని; జలములు = నీళ్ళు; అనుదినము = ప్రతిరోజు; ఇగురన్ = ఎండిపోతుండగా; గృహములన్ = ఇండ్లలో; బ్రతుకు = జీవించగల; దినములు = రోజులు; చనుట = గడచిపోవుచుండుట; ఎఱుంగని = తెలిసికొనని; మనుజుల = మానవుల; గమనికన్ = వలె; తిరుగు = మెలగెడి; జలచరములు = చేపలు మున్నగు జీవులు; జలచర = చేపలు మున్నగు జీవుల; హృదయముల = మనసులలో; బెగడు = బెదురు; కదురన్ = సెలకొనునట్లు; డొంకి = అడుగంటి; ఇంకిన = ఎండిపోయిన; నదులును = ఏరులు; నదుల = ఏరుల; అందున్ = లో; కర్పూర = కర్పూరపు; మండపంబుల = మండపముల; తెఱంగున = విధముగ; మణి = రత్నాల; కుట్టిమంబుల = అరుగుల; మాట్కిని = వలె; సౌధ = భవనముల; సోపాన = మెట్ల; మార్గంబుల = దారుల; జాడను = వలె; విలోకితంబులు = కనబడునవి; అగు = ఐన; నూతన = కొత్త; సైకతంబులును = ఇసుకదిబ్బలు; సైకత = ఇసుకదిబ్బలపై; ప్రదేశంబులను = స్థలము లందు; ఉదయ = పొద్దుటి; వేళలన్ = పూట; నిత్యకర్మ = ప్రతిరోజు చేయు కర్మలు {నిత్యకర్మలు - సంధ్యావంద నాది విహిత కర్మలు}; అనుష్ఠాన = నడుపుట యందు; నిరతులు = మిక్కిలి నిష్ఠ గలవారు; అగు = ఐన; మునులును = ఋషులు; మునికన్యకా = ఋషికన్యలయొక్క; కర = చేతి యందలి; కలశ = కుండలలోని; సలిలా = నీటిచేత; అభిషిక్త = తడుపబడిన; మూలంబులు = మొదళ్ళు కలవి; అగు = ఐన; తపోవన = మునివాటికలలోని; బాల = లేత; రసాల = మామిడి; సాలంబులును = చెట్లు; సాల = మద్ది; విటపి = చెట్లు; వాసంతికా = పూలగురివింద; కుంజ = పొదల; పుంజంబులన్ = సమూహములయొక్క; తఱచున = దట్టమై ఉండుటచేత; ఇముడుకొని = చేరుకొని; దినకర = సూర్యుని; కిరణముల్ = కిరణములు; కున్ = కు; కరువలి = గాలి; కిన్ = కి; ఛొరన్ =

ప్రవేశించుటకు; పెరవు = వీలు; పడని = కాని; వనములును = అడవులు; వనములన్ = అడవులందు; తరుల = చెట్ల; కొమ్మలన్ = కొమ్మలందు; ఆకలములున్ = ఆకులు అలములు; ఏకలమ్ములు = చుట్టబెట్టినవి; ఐ = చేసి; మెసంగి = మేసి; మసరుకవిసి = బలమెక్కి; క్రొవ్వి = మదించి; కొమ్ము = దంతముల; కొనల = చివర్ల; సూటి = వాడిదనముతో; ఏటి = కాలువల; దరులున్ = గట్లను; త్రవ్వి = తవ్వి; చిమ్మి = చెదరగొట్టి; కుమ్మి = కమ్ములతో పొడిచి; కోరాడెడు = మట్టి ఎగజల్లెడు; వనగజంబులును = అడవి ఏనుగులు; గజ = ఏనుగులయొక్క; కుంభ = కుంభస్థలమువంటి; కనక = బంగారు; కుంభ = కుండలవంటి; రుచిర = ప్రకాశము కలిగిన; కుచ = స్తనముల; భార = బరువుచేత; భీరు = భయపడుచున్నట్టి; మధ్య = నడుములుతోటి; సమంచితలు = చక్కగా ఉన్నవారు; అగు = ఐన; చెంచితలును = చెంచుస్త్రీలు; చెంచితల = చెంచుస్త్రీల; క్రూరమ్ములు = భయంకరమైనవి; అగు = ఐన; వాలమ్ముల = బాణముల; సారముల = సత్తువలవలన; చెడి = నశించి; బెడిదంబుగన్ = మిక్కిలిగా; పాదంబులున్ = కాళ్ళు; తొట్రుపడన్ = తడబడగా; పెను = పెద్దపెద్ద; గాతమ్ములన్ = పల్లములలో, గోతులలో; పడు = పడిపోయెడి; వరాహ = అడవిపందులు; పుండరీకంబులును = పెద్దపులులు; పుండరీక = తెల్లతామరల; కుంద = కొండమల్లెల; కుముద = తెల్లకలువపూల; కురంటక = పచ్చగోరింట; ఆది = మున్నగు; కుసుమ = పూలయొక్క; మకరందంబు = తేనెలను; క్రోలి = తాగి; తేలి = తనిసి; సోలి = ఛొక్కి; వాలి = అతిశయించి; మహా = గొప్ప; అహంకృతులన్ = అహంకారములతో; ఝుంకృతులున్ = ఝూంకారములను; చేయు = చేసెడి; తేటి = తుమ్మెదల; కదుపులును = సమూహములు; కదుపులన్ = గుంపులలో; కలయకు = కూడకుండా; ఎదకలిగి = ఎదకట్టి; మదమునన్ = కామమదముచేత; అదను = తగిన సమయము; పదను = పరిపాకములను; ఎఱింగి = తెలిసికొని; మదన = మన్మథుని; మార్గణ = బాణములచే; ప్రేరితంబులు = ప్రేరేపింపబడినవి; ఐ = అయ్యి; పెంటి = ఆడజంతువుల; తుటుముల = సమూహముల; పెంటన్ = వెంబడి; చని = పోయి; ఒండొంటిన్ = ఒక్కొక్కదానిని;

గెంటించుచన్ = దాటుతు; తగులన్ = ఆనిగా సెక్కి; గర్భంబులున్ = చూలులను; సెక్కొలుపు = నిలబడజేయు; మృగ = మృగములును; వృషభరాజంబులు = ఆంబోతులు; కలిగి = కలిగినదై; రాజరాజ = కుబేరుని; గృహంబున్ = ఇంటి; పగిదిన్ = వలె; విలసిత = ప్రకాశించునట్టి; కుంద = మొల్లలతో, కుందనిధి; పద్మ = కమలములతో, పద్మనిధి; సౌభాగ్యంబు = కోరదగినది, సంపద కలది; ఐ = అయ్యి; భాగ్యహీను = దురదృష్టవంతుని; కర్మంబు = పని; రేఖన్ = వలె; అశ్రుత = వినబడని; నీలకంఠ = సెమళ్ళ, శివుడు అసెడి; శబ్దంబు = కేకలు గలది, పేరు గలది; ఐ = అయ్యి; శబ్దశాస్త్రవేది = వ్యాకరణవేత్తయొక్క; హృదయంబు = మనసు; బాగునన్ = వలె; విశద = నిర్మలమైన, స్పష్టమైన; ప్రకాశ = వెలుగులచే, వ్యక్తీకరణలతో; అభిరామంబు = మనోజ్ఞమైనది; ఐ = అయ్యి; రామ = శ్రీరాముని; సంగ్రామంబు = యుద్ధము; కైవడిన్ = వలె; బాణ = నల్లగోరింట పేగిసలచే, విల్లులచే; అలంకృతంబు = అలంకరింపబడినది; ఐ = అయ్యి; కృతాంత = యముని; హృదయంబు = మనసు; కరణిన్ = వలె; అపంకంబు = బురద లేనిది, పాపము లేనిది; ఐ = అయ్యి; పంకజాసను = బ్రహ్మదేవుని; గేహంబు = నివాసము; సొంపునన్ = వలె; రాజహంస = రాయంచలచే, గొప్ప ఆత్మజ్ఞానులచే; విరాజమానంబు = విరాజిల్లునది; ఐ = అయ్యి; మానధనుని = ఆత్మాభిమానము గలవాని; చరిత్రంబు = నడవడికః; సొబగునన్ = వలె; అకల్మష = స్వచ్ఛమైన, కపటములేని; జీవనంబు = నీరు గలది, జీవితము కలది; ఐ = అయ్యి; వననిధి = సముద్రము {వననిధి – వనము (నీటికి) నిధి (గనివంటిది), కడలి}; పొలుపునన్ = సొంపుతో; సమ్మిళిత = సమృద్ధిగా కలిగిన; భూభృత్ = కొండ, రాజుల; వాహినీ = వాగులతో, సేనావాహినితో; సంకులంబు = కలకలము గలది; ఐ = అయ్యి; కుల = మంచివంశపు; వధూ = ఇల్లాళ్ళలో; రత్నంబు = శ్రేష్ఠురాలి; చెలువునన్ = వలె; అదృష్ట = కనబడని; పయోధరంబు = మేఘము కలది, పాలిండ్లు కలామె; ఐ = అయ్యి; ధరణి = భూమి; కిన్ = కి; తొడవు = అలంకారము; ఐ = అయ్యి; శరత్కాలంబు = శరదృతువు; వచ్చెన్ = వచ్చినది; అందున్ = అప్పుడు.

భావము:- ఇంకా శరత్కాల సమయంలో, బ్రతుకు తెరువులు వదలి నిర్మల జ్ఞాన ప్రభావంతో ముక్తికేగు పురుష పుంగవుల మాదిరి మేఘాలు గాలివాలుకి ఆకాశంలో వికావికలై వెళ్ళిపోయాయి; విజ్ఞానం అనే దీపంతో వెలుగొందే యోగి చిత్తం లాగ ఆకాశ మండలం మబ్బులు వీడి అగస్త్య నక్షత్రంతో కూడి స్వచ్ఛంగా అయి ప్రకాశించింది; అలాంటి ఆకాశ వీధిలో చుక్కల గుంపులు అకాశం చాంది నికి గూర్చిన ముత్యాల విధంగా విలసిల్లసాగాయి; ఆ నక్షత్రకాంతుల విజృంభణం అరికడుతూ చంద్రకిరణాలు బ్రహ్మాండమనే పేటికలో కర్పూరఖండాలై రంజిల్లాయి; ఆ చంద్రకిరణాలు సోకి పంటకు వచ్చిన వరి మొదలైన పైరులు బాగా పండి భూమికి నిండుతనం చేకూర్చసాగాయి; అవి రైతుల చేతి కరుకైన వాడి కొడవళ్ళ పదనును తలచి తల్లడం చెంది వెలవెలబారాయి; నిండైన వెన్నుల భారంతో వ్రాలి గాలికి తూగుతూ మర్మర ధ్వనులు సల్పుచున్న ఆ వరిపంట పుడమితల్లికి ప్రణమిల్లి వడవడ వణుకుతూ రక్షింపమని మొరపెట్టుకుంటున్నట్లు అనిపిస్తోంది; చిలుకల బారులు వరివెన్నుల గుంపులను త్రుంచి ముక్కులతో కబళించి తమ పిల్లలతో వెంటి గుంపుతో చేరి కడుపార మెక్కి సొక్కుతూ సోలుతూ పయనించసాగాయి; అలా పోతూ పోతూ ఎత్తైన మంచె మీద ఎక్కి అటూ ఇటూ తిరుగుతూ పైర్లకు కాపలా ఉన్న పడతుల ఎఱ్ఱని పెదవులు దొండపండ్లని భ్రమించి కరిచాయి; అలా కరిచి ఆ చెలుల చేతి విసురుకు ఉలికిపడి కిలకిల ధ్వనులు గావిస్తూ రివ్వున ఎగిరిపోయాయి; తేటనీటితో నిండిన సరస్సులు కలహంసలు చక్రవాకాలు బెగ్గురుపక్షుల కలకల నినాదంతో చెలువారాయి; ఇండ్ల లోపల ఇంకెన్నాళ్ళు జీవించడమో తెలియని మనుజుల మాదిరి తటాకాలలోని జలం దినదినానికీ ఇంకిపోవడం గమనింపక జలచరాలు అందులోనే చరించసాగాయి; ఆ జలచరాల చిత్తాలలో భీతి జనిం పగా నదులు నానాటికి తగ్గి ఇంకసాగాయి; ఆ నదులలో క్రొత్తగా మేటలేసిన ఇసుక తిన్నెలు కర్పూరమండపాలలాగ మణులుతాపిన స్థలాలమాదిరిగామేడమెట్ల పోలికగా చూడ సొబగై ఉన్నాయి; ఆ సైకత ప్రదేశాలలో తెల్లవారగట్ల సమయంలో మునులు నిత్యకర్మాచరణలో నిమగ్నులయ్యారు; అక్కడి తపోవనాల లోని గున్నమామిడిచెట్ల

పాదులలో మునికన్యలు చేతిబిందెలతో నీళ్ళు పోయసాగారు; ఆ వనాలు మద్దిచెట్లు మొల్లతీవెలు అల్లిబిల్లిగా అల్లుకోవడం వలన సూర్యకిరణాలకూ పవనాలకూ బొత్తిగా ఛొరవీలుకానివి అయ్యాయి; అడవి ఏనుగులు అడవి చెట్లకొమ్మల లోని ఆకులు అలములు యధేచ్ఛగా మేసి క్రొవ్వెక్కి దంతాగ్రాలతో ఏటిగట్లు క్రుమ్మి క్రుచ్చి పోరాడాయి; అక్కడ చెంచితలు ఏనుగు కుంభాలు బంగారు కలశాల వంటి చక్కని చనుగుబ్బల బరువుకు వణుకుతున్న సన్నని నడుములు కలవారై ఉన్నారు; ఆ బోయతల వాడి బాణాల ఘాతాలకి చేవ గోల్పోయి అడవిపందులు పులులు దుఃఖం తో కాళ్ళు తొట్రుపడగా పెళ్ళి పెద్ద గుంటలలో పడిపోసాగాయి; తుమ్మెద కదుపులు కమలములు కలువలు గోరింటలు మొదలైన పూలలోని తీయతేనెలు గ్రోలి మత్తెక్కి సొక్కి సోలుతూ ఝంఝమ్మని రొదచేయసాగాయి; మృగశ్రేష్ఠాలు వృషభరాజాలు మందలతో చేరక మదమెక్కి దూరంగా సంచరిస్తూ కామప్రేరితాలై ఒకదాని నొకటి త్రోసుకుంటూ పెంటిగుంపు వెంటబడి వాటిని దాటసాగాయి; ఆ శరత్కాలం కుందము పద్మము అనే నిధులతో నివ్వటిల్లే కుబేరుని మందిరం లాగ మొల్లలతో తామరలతో ఒప్పారింది; శివశబ్దం విన నోచని అభాగ్యుని చెవి లాగ నెమళ్ళ రవళి వినబడనిది అయిపోసాగింది; విశ్వప్రకాశమనే నిఘంటు వుతో చెలువారే వ్యాకరణ శాస్త్రవేత్త హృదయంలాగ విశ్వమును విలసింప జేయుట చేత మనోహరం అయింది; ధనుస్సుతో చెలువారిన రాముని యుద్ధం లాగ నల్లగోరింట వేగిసచెట్లతో విలసిల్లింది; పాపరహితమైన యమధర్మరాజు మనస్సు లాగ బురదలేనిది అయింది; రాజహంసలతో రాజిల్లే చతుర్ముఖుని సౌధం లాగ రాయంచలతో విలసిల్లింది; పాపరహితమైన జీవనంతో చెలువారే మానధనుడి నడవడి లాగ నిర్మలమైన నీరు కలది అయి నివ్వటిల్లింది; పర్వతాలతోను నదులతోనూ కూడిన కడలిలాగ కలిసికొన్న రాజసేవలు కలది ఐనది; చనుకట్టు కనబడనీయని ఇల్లాలి లాగ కనరాని మబ్బులు కలది అయింది; అలా శరదృతువు అవనీ మండలానికే అలంకారమయింది.

విశేషము – మరొక ముక్తగ్రస్తాలంకారం.......

10.1-767-క.

వాజుల నీరాజనములు

రాజుల జయగమనములును రాజిత లక్ష్మీ

పూజలు దేవోత్సవములు

రాజిల్లెను జగతి యందు రాజకులేంద్రా!

టీక:- వాజుల = గుఱ్ఱములకిచ్చెడి {వాజుల నీరాజనములు - యుద్ధములకు పోబోవునప్పుడు గుఱ్ఱములు ఏనుగులు రథములు మున్నగు వానికి నీరాజనము (హారతి) ఇచ్చి హారతి మంటలు సవ్యముగా చలించిన జయము కలుగును అని భావించెడి వాడుక కలదు దానిని వాజుల నీరాజనము అందురు}; నీరాజనములు = హారతులను శాంతికర్మలు; రాజుల = రాజులయొక్క; జయగమనములును = దిగ్విజయ యాత్రలు; రాజిత = ప్రకాశించెడి; లక్ష్మీ = లక్ష్మీదేవికి చేసెడి; పూజలున్ = పూజలు; దేవ = నానాదేవతలయొక్క; ఉత్సవములు = పండగలు; రాజిల్లెన్ = విలసిల్లెను; జగతిన్ = లోకము; అందున్ = లో; రాజకులేంద్రా = మహారాజా.

భావము:- ఓ పరీక్షిత్తు రాజపుంగవా! శరత్కాలంలో అశ్వాలకు హారతు లెత్తారు. రాజుల విజయప్రస్థానాలు, లక్ష్మీపూజలు, దేవోత్సవాలు జరుగసాగాయి.

10.1-768-క.

చేగ గల చెఱకువింటను

బాగుగ నీలోత్పలంబు బాణంబుగ సం

యోగంబు చేసి మదనుఁడు

వేగంబున విరహిజనుల వేటాడె నొగిన్.

టీక:- చేగ = చేవ, పటువైన; చెఱుకు = చెరుకుగడ; వింటను = విల్లు నందు; బాగుగున్ = చక్కగా; నీలోత్పలంబున = నల్ల కలువపూవును; బాణంబుగా =

అమ్ముగా; సంయోగంబు = సంధించుట; చేసి = చేసి; మదనుడు = మన్మథుడు; వేగంబునన్ = వడిగా; విరహిజనులన్ = విరహము (ప్రియుల ఎడబాటు) గల వారిని; వేటాడెన్ = వేటాడెను; ఒగిన్ = పూనికతో.

భావము:- మన్మథుడు తన చేవగల చెరకువింట నల్లకలువను శరంగా సంధించి బహు వేగంగా విరహము గలవారలను వేటాడసాగాడు.

10.1-769-వ.

ఇట్లు భాసురంబైన శరద్వాసరంబుల గోవిందుండు గోబృంద సమేతుండై బృందావనంబునం బసులఁ బొసంగ మేపుచు.

టీక:- ఇట్లు = ఈ విధముగ; భాసురంబు = ప్రకాశవంతమైనది; ఐన = అయినట్టి; శరత్ = శరదృతువు నందలి; వాసరంబులన్ = దినములలో; గోవిందుడు = కృష్ణుడు {గోవిందుడు - గోవులకు ఒడయుడు, కృష్ణుడు}; గోప = గోపకుల; బృంద = సమూహముతో; సమేతుండు = కూడినవాడు; ఐ = అయ్యి; బృందావనంబుననన్ = బృందావనములో; పసులన్ = పశువులను; పొసగన్ = చక్కగా; మేపుచు = పాలించుచు.

భావము:- ఈవిధంగా పసందైన కనువిందైన ఆ శరత్కాలపు రోజులలో శ్రీ కృష్ణుడు హాయిగా ఆలమందలతో కూడి బృందావనంలో పశువులను మేపాడు.

వేణు విలాసంబు

10.1-770-సీ. *

కర్ణావతంసిత కర్ణికారప్రభ-
గండభాగద్యుతిఁ గడలుకొలుప
భువనమోహనమైన భ్రూవిలాసంబుతో-
వామభాగానతవదన మొప్ప
నపసవ్యకర మృదులాంగుళీ చాతురి-
షడ్జధ్వనికి మర్మసరణిఁ జూప
డాకాలిమీఁద నడ్డము చాఁచి నిల్పిన-
పదనఖద్యుతి భూమిఁ బ్రబ్బికొనఁగ

10.1-770.1-తే.

మౌళిపింఛముఁ గంఠదామమును మెఱయ
విలసితగ్రామముగ నొక్క వేణువందు
బ్రహ్మగాంధర్వగీతంబు పరఁగఁ జేసెఁ
జతురనటమూర్తి గోపాలచక్రవర్తి.

టీక:- కర్ణా = చెవియందు; అవతంసిత = సిగపువ్వుగాతురిమిన; కర్ణికార = కొండగోగిపువ్వు; ప్రభ = కాంతి; గండభాగ = చెక్కిలిపలకల; ద్యుతిన్ = కాంతిని; కడలుగొలుప = ఓడించగా; భువన = లోకములను; మోహనము = మోహింప జేయునది; ఐన = అయినట్టి; భ్రూ = కనుబొమల; విలాసంబు = చక్కటికదలికల; తోన్ = తోటి; వామ = ఎడమ; భాగ = పక్క; ఆనత = వంచబడిన; వదనము = మోము; ఒప్పన్ = అందగించుచుండగ; అపసవ్య = కుడి; కర = చేతియొక్క; మృదుల

= మృదువైన; అంగులీ = వేళ్ళయొక్క; చాతురి = నేర్పు; షడ్జమ = షడ్జమస్వరము యొక్క; ధ్వని = ధ్వని; కిన్ = కి; మర్మ = రహస్య; సరణిన్ = మార్గమును; చూపన్ = చూపుచుండగా; డాకాలి = ఎడమకాలి; మీదన్ = మీద; అడ్డమున్ = అడ్డముగా; చాచి = చాపి; నిల్పిన = ఉంచినట్టి; పద = కాలి; నఖ = గోర్ల; ద్యుతిన్ = కాంతి; భూమిన్ = నేలపైన; ప్రబ్బికొనగా = వ్యాపించగా.

మౌళి = సిగయందలి; పింఛమున్ = నెమలి పింఛము; కంఠ = మెడలోని; దామమున్ = వనమాల; మెఱయన్ = ప్రకాశించుచుండగా; విలసిత = ప్రకాశవంత మైన; గ్రామమునన్ = సంగీతవిన్యాసము తో, షడ్జము మొదలైన స్వరముల సముదాయముతో కూడిన; ఒక్క = ఒకానొక; వేణువు = పిల్లనగ్రోవి యందు; బ్రహ్మ = గొప్ప, వేదసంబంధమైన; గాంధర్వగీతంబు = అతిచక్కటిగానమును; పరగన్ = ప్రకాశింప; చేసెన్ = చేసెను; చతురనటమూర్తి = శ్రీకృష్ణుడు {చతురనటమూర్తి – చతుర (మిక్కిలి నేర్పు గల) నటుని వంటి మూర్తి (స్వరూపము కలవాడు), కృష్ణుడు}; గోపాలచక్రవర్తి = శ్రీకృష్ణుడు {గోపాలచక్రవర్తి – గోపకులకు మహారాజు, కృష్ణుడు}.

భావము:- మిక్కిలి చమత్కారమైన నటనాలతో మనసు లలరించే గోపాల చక్రవర్తి యైన శ్రీకృష్ణమూర్తి చెవిసందులో తురిమిన కొండగోగుపూల అందం, చెక్కిళ్ళ శోభను ఇనుమడిస్తుండగా; విశ్వాన్నంతటిని మోహింపజేసే బొమముడి సోయగా, లొప్పుతుండగా; ఎడమ పక్కకి వంచిన తల, చక్కదనాలు చిందిస్తుండగా; కోమలమైన కుడిచేతి వ్రేళ్ళ నైపుణ్యాలు షడ్జస్వరానికి, నర్మగర్భ అందాలు అద్దుతుండగా; ఎడమ కాలిమీద అడ్డంగా సాచి ఉంచిన కుడి కాలిగోర్లు, మేదిని మెరుపులు మెదుపు తుండగా; సిగలోని నెమలి పింఛము, మెడలోని వైజయంతీమాలల మిలమిలలు, మించుతుండగా; మురళిని మోవిపై ఆనించి గ్రామ మూర్ఛను లనే స్వరభేదాలు స్వచ్ఛంగా పెలయిస్తూ; బ్రహ్మగాంధర్వ గీత మనే సామవేదగానం (ఆ శారదాదినాలలో గోవుల మేపుతూ) ఆలపించాడు.

10.1-771-వ.

ఇట్లు హరి వేణునాదంబు పూరింపఁగ మారవికారహేతు వగు తద్గీతం బాలించి సిగ్గులు చాలించి మక్కువలు చెక్కులొత్త గోపిక లోపికలు లేక తమతమ పొత్తుకత్తెలుం దారును దత్తఱంబునం బదుగురు నేగురుం దుటుములు గట్టి జిలిబిలి ముచ్చటలకుం జొచ్చి తమలోన.

టీక:- ఇట్లు = ఈ విధముగ; హరి = కృష్ణుడు; వేణు = మురళీ; నాదంబున్ = రవమును; పూరింపగన్ = ఊదుతుండగా; మార = మన్మథ; వికార = వికారము లకు; హేతువు = కారణము; అగు = ఐన; తత్ = ఆయొక్క; గీతంబున్ = గానమును; ఆలించి = విని; సిగ్గులు = లజ్జలను; చాలించి = వదలి వేసి; మక్కువలు = అనురాగ ములు; చెక్కులొత్తన్ = అతిశయించగా; గోపికలు = గోపికాస్త్రీలు; ఓపికలు = తాలుములు; లేక = లేకపోవుటచేత; తమతమ = వారివారి; పొత్తుకత్తెలున్ = స్నేహితులు; తారును = తాము; తత్తఱంబునన్ = తబ్బిబ్బుతో; పదుగురున్ = పదేసిమంది; ఏగురున్ = ఐదేసి మంది; తుటుములు = గుంపులుగ; కట్టి = ఏర్పడి; జిలిబిలి = శృంగార ప్రయుక్తమైన; ముచ్చటలు = కబుర్లు చెప్పుకొనుట; కున్ = కు; చొచ్చి = ఆరంభించి; తమలోనన్ = వారిలోవారు.

భావము:- ఇలా కృష్ణుడు మురళి ఊదుతుంటే కామోద్దీపకమైన ఆ పిల్లనగ్రోవి పాట విని గొల్లచేడియలు సిగ్గులు వదిలిపెట్టారు. వలపులు చిగురించగా ఆ గోపికలు ఓపిక వహించ లేక తమ తమ చెలికత్తలతో సంభ్రమంగా గుంపులుగా కూడి తమలోతాము సరసపు ముద్దుముచ్చటలకు ఉపక్రమించి...

గోపికల వేణునాథుని వర్ణన

10.1-772-మ. *

"శ్రవణోదంచితకర్ణికారమునతో స్వర్ణాభ చేలంబుతో
నవతంసాయిత కేకిపింఛమునతో నంభోజ దామంబుతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబుఁ బూరించుచు
న్నువిదా! మాధవుఁ డాలవెంట వనమం దొప్పారెడిం జూచితే?

టీక:- శ్రవణ = చెవి యందు; ఉదంచిత = మిక్కిలి చక్కగా ఉంచబడిన; కర్ణికారమున్ = కొండగోగిపువ్వు; తోన్ = తోటి; స్వర్ణ = బంగారము; ఆభ = ప్రభ గల; చేలంబు = వస్త్రము; తోన్ = తోటి; అవతంసాయిత = సిగబంతిగా కూర్చబడిన; కేకి = నెమలి; పింఛమున్ = పింఛము, కుంచము; తోన్ = తోటి; అంభోజ = పద్మముల; దామంబు = దండ; తోన్ = తోటి; స్వవశుండు = స్వతంత్రుడు; ఐ = అయ్యి; మధుర = తియ్యనైన; అధర = పెదవులస్పర్శ అనెడి; అమృతము = అమృతము; చేన్ = చేత; వంశంబున్ = మురళిని; పూరించుచున్ = ఊదుతు; ఉవిదా = వనితా; మాధవుడు = కృష్ణుడు {మాధవుడు - మాధవి ప్రియుడు, కృష్ణుడు}; ఆల = ఆవుల; వెంటన్ = వెంబడిని; వనము = అడవి; అందున్ = లో; ఒప్పారెడిన్ = చక్కగాఉన్నాడు; చూచితే = చూచితివా.

భావము:- "సఖీ! మన కృష్ణుడు చూసావా? చెవిలో కొండగోగి పువ్వు అలంకరించుకొన్నాడు. పసిడి వన్నె పట్టు వస్త్రం కట్టుకున్నాడు. శిరోజాలందు నెమలిపింఛం ధరించాడు. మెడలో పద్మాల దండ వేసుకున్నాడు. పరవశత్వంతో వేణువు నందు తియ్యని అధరామృతం పూరించుతు, అడవిలో ఆలమందలను మేపుతు ఎంత చక్కగా ఉన్నాడో చూడవే చూడు!

10.1-773-శా. *

రావే సుందరి! యేమె బోటి! వినవే; రాజీవనేత్రుండు బృం
దావీథిం దగ వేణు వూఁదుచు లసత్సవ్యానతాస్యంబుతో
భ్రూవిన్యాసము లంగుళీ క్రమములుంబొల్పార షడ్జంబుగాఁ
గావించెన్ నటుభంగి బ్రహ్మమగు దద్గాంధర్వ సంగీతమున్.

టీక:- రావే = రమ్ము; సుందరి = చక్కనిచుక్క; ఏమె = ఒసేయ్; బోటి = వనితా; వినవే = వినుము; రాజీవనేత్రుండు = పద్మాక్షుడు, కృష్ణుడు; బృందా = బృందావనము; వీధిన్ = దారు లమ్మట; తగన్ = చక్కగా; వేణువున్ = మురళిని; ఊదుచున్ = పూరించుచు; లసత్ = ప్రకాశిస్తున్న; సవ్య = ఎడమపక్కకు; ఆనత = వంచబడిన; ఆస్యంబు = మోము; తోన్ = తోటి; భ్రూ = కనుబొమల; విన్యాసములన్ = కదలించుటలతో; అంగుళీ = వేళ్ళయొక్క; క్రమములున్ = వాడుటలోని లయలు; పొల్పారన్ = శోభించగాఉం; షడ్జంబున్ = షడ్జమస్వరము {షడ్జమము (స) - షట్ + జమ, షట్ (నాసిక, కంఠము, ఉరస్సు, తాలువు, జిహ్వ, దంతములు (6) ఆరు స్థానములందు) జమ (జనించు ధ్వని)కి షడ్జమము అని పేరు}; కాన్ = కలుగునట్లు; కావించెన్ = చేసెను, పలికించెను; నటు = నటుని; భంగిన్ = వలె; బ్రహ్మము = గొప్పది, వేదమయమైనది; అగు = ఐన; తత్ = ఆయొక్క; గాంధర్వ = గంధర్వులు చేయు నట్టి; సంగీతమున్ = గానమును.

భావము:- చక్కదనాల చిన్నదాన! ఇలారావే. ఏమే వింటున్నావా. బృందావన వీధిలో పద్మాక్షుడు మన శ్రీకృష్ణుడు వేణువు ఊదుతూ ఎడమవైపుకు వంచిన ముఖంతో కనుబొమలాడిస్తూ వేణువుపై వేళ్ళవిన్యాసాలు వెలయిస్తూ నటునివలె షడ్జమస్వరంలో బహ్మగాంధర్వగీతాన్ని ఆలపిస్తున్నాడు.

విశేషము- అని బృందావనంలో కృష్ణుడు మన్మథోద్దీపితంగా వాయిస్తున్న మురళీగాన లోలులైన గోపికలు ఒకరిని ఒకరు హెచ్చరించుకుంటున్నారు. అసలే బృందావనం బాగా పెద్దది, అతిశ్రేష్ఠమైనది, బహుమనోహరమైనది. శ్రీకృష్ణభగవా

నుల ఆకర్షణ చాలా ఎక్కువ. ఆలపిస్తున్నది పరబ్రహ్మం తానైన గాంధర్వగీతం. అది మనస్సును మథించి ఉద్దీపితం చేసేది. మరి గోపికలు (గో (జ్ఞానం) ఓపిక ఎక్కువున్నవాళ్ళుట. మరి వేగిరపాటు సహజమే కదా.

10.1-774-క.

తలఁకెను గొబ్బునఁ జిత్తము
నళినాక్షుని మధుర వేణునాదము నా వీ
నులు సోఁకినంత మాత్రన
చెలియా! యిఁక నేటిపెఱపు చింతింపఁ గదే.

టీక:- తలకెను = చలించిపోయినది; గొబ్బునన్ = తటాలున; చిత్తము = నా మనసు; నళినాక్షుని = పద్మాక్షుని, కృష్ణుని; మధుర = ఇంపైన; వేణు = మురళీ; నాదము = రవము; నా = నాయొక్క; వీనులన్ = చెవు లందు; సోకిన = తగిలిన; అంతమాత్రన్ = అంతమాత్రముచేతనే; చెలియా = స్నేహితురాల; ఇక = మరి; ఏటి = దేనికి; పెఱపు = బెదురు; చింతింపగదే = ఆలోచించుము.

భావము:- ఓ నా చెలి! ఆ అరవిందాక్షుడి మధుర మైన మురళీ రవం చెవుల సోకే సరికి నా మనసు చలించింది; ఇంకా భయం దేనికి. ఏదైనా ఉపాయం ఆలోచించవే!

10.1-775-క.

నాతోడ పెఱవ వలదే?
నాతోడసె గొనుచుఁ బోయి నళినదళాక్షున్
నీతోడుతఁ బలికించెద
నీతోడి జనంబు మెచ్చ నీతోడు సుమీ."

టీక:- నా = నా; తోడన్ = తోటి, తోబుట్టువా; వెఱవన్ = బెదరు; వలదే = పడవద్దు; నా = నాకు; తోడనె = తోకూడా; కొనుచున్ = తీసుకొని; పోయి = వెళ్ళి; నళినదళాక్షున్ = కృష్ణుని {నళిన దళాక్షుడు - నళిన (తామర) దళ (రేకులవంటి) అక్షుడు (కన్నులు కలవాడు), కృష్ణుడు}; నీ = నీ; తోడుతన్ = తోటి; పలికించెదన్ = మాట్లాడించెదను; నీ = నీ; తోటి = తోపాటి, సహచరులైన; జనంబు = వారు; మెచ్చన్ = మెచ్చుకొనునట్లుగా; నీ = నీమీద; తోడు = ఒట్టు; సుమీ = సుమా.

భావము:- నాతో రావడానికి భయపడకే. నీ తోటివారు మెచ్చేలా నిన్ను నా వెంట తీసుకెళ్ళి గోవిందుడు నీతో మాట్లాడేటట్లు చేస్తాను నీ మీద ఒట్టు.”

10.1-776-వ.

అని పెక్కు భంగుల నోరోర్తు నుద్దేశించి పలుకుచు గోపసుందరులు బృందావనంబునకు గోవిందుని కెదురు చని పరమానందంబున నతనిం దమ మనంబులఁ బ్రతిపదంబును నాలింగనంబు చేసిన వార లగుచు, రామకృష్ణుల నుద్దేశించి.

టీక:- అని = అని; పెక్కు = అనేక; భంగులన్ = విధములుగా; ఒరోర్తును = ఒండొరులను; ఉద్దేశించి = గురించి; పలుకుచు = చెప్పకొనుచు; గోప = గోపికా; సుందరులు = స్త్రీలు; బృందావనంబున్ = బృందావనమున; కున్ = కు; గోవిందుని = కృష్ణుని; కిన్ = కి; ఎదురు = ఎదురుగా; చని = పోయి; పరమ = అత్యధికమైన; ఆనందంబునన్ = సంతోషముతో; అతనిన్ = అతనిని; తమ = వారియొక్క; మనంబులన్ = మనసు లందు; ప్రతిపదంబునున్ = అడుగడుగునకు; ఆలింగనంబు = కౌగలించుకొనుట; చేసిన = చేసినట్టి; వారలు = వారు; అగుచున్ = అగుచు; రామ = బలరామ; కృష్ణులన్ = కృష్ణులను; ఉద్దేశించి = గురించి.

భావము:- అంటూ, ఇలా రకరకాలుగా ఒకరితోఒకరు చెప్పకుంటూ గొల్ల పడుచులు బృందావనంలో అరవిందదళ నేత్రుణ్ణి మనస్సులో మాటిమటికీ కౌగలించుకున్నారు. బలరామ కృష్ణులను ఉద్దేశించి తమలోతాము ఇలా చెప్పకో సాగారు.

10.1-777-మ.

"నవగోష్ఠానక రంగమందుఁ బరమానందంబుతోఁ జూత ప
ల్లవ నీలోత్పల పింఛ పద్మదళ మాలా వస్త్ర సంపన్నులై
కవయై వేణువు లూఁదుచున్ బహునటాకారంబులం గేళితాం
డవముల్ జేసెద రీ కుమారకులు; వేడ్కం గామినుల్ గంటిరే.

టీక:- నవ = కొత్త; గోష్ఠానక = పశువులదొడ్డి అనెడి; రంగము = రంగ స్థలము; అందున్ = అందు; పరమ = మిక్కిలి; ఆనందంబునన్ = సంతోషముతో; చూత = మామిడి; పల్లవ = లేతచిగుళ్ళ; నీలోత్పల = నల్ల కలువపూవుల; పింఛ = నెమలిపింఛము; పద్మదళ = తామరపూలరేకుల; మాలా = దండలు; వస్త్ర = మంచి బట్టలు; సంపన్నులు = సమృద్ధిగా గలవారు; ఐ = అయ్యి; కవ = జోడి, జతగా; ఐ = అయ్యి; వేణువులు = పిల్లనగ్రోవులను; ఊదుచున్ = పూరించుచు; బహు = మిక్కిలిగా; నట = నటులయొక్క; ఆకారంబులన్ = స్వరూపముతో; కేళీ = వినోదపు; తాండవముల్= ఉద్ధతమైన నృత్యములను {లాస్యము – మృదుమధురమైన నాట్యము}; చేసెదరు = చేయుచున్నారు; ఈ = ఈ ప్రసిద్ధమైన; కుమారకులు = బాలురు; వేడ్కన్ = సంతోషముతో; కామినుల్ = పడతులు {కామిని – కామము కలామె, కామించదగినామె, స్త్రీ}; కంటిరే = చూసితిరా.

భావము:- "ఓ గొల్లభామల్లారా! ఈ వేడుకలు చూడండి. ఈ బలరామకృష్ణులు ఎంతో సంతోషంతో మామిడి చివుళ్ళు, నల్ల కలువలు, నెమలి ఫించాలు, తామర పూదండలు, పట్టు పుట్టాలు ధరించారు. జతగూడి ఈ సుకుమారులు మురళి మ్రోగిస్తూ నిత్యం ఎన్నెన్నో నటవేషాలతో అత్యంత మనోహరంగా తాండవ మాడుతున్నారు. చూడండి.

10.1-778-క.

ఓ చెలువలార! వినుఁడీ

వాచా శతకంబులేల? వర్ణింపంగా

లోచనముల కలిమికి ఫల

మీ చెలువురఁ జూడఁగలుగు టింతియ సుండీ. "

టీక:- ఓ = ఓహో; చెలువలు = స్నేహితులులారా; వినుడీ = వినండి; వాచా = నోటిమాటల; శతకంబు = వందలు; ఏలన్ = ఎందుకు; వర్ణింపంగా = స్తుతించుచుటకు; లోచనముల = చూపుల, కన్నులు; కలిమి = సంపదల, ఉన్నందు; కిన్ = కు; ఫలము = ప్రయోజనము; ఈ = ఈ ప్రసిద్ధమైన; చెలు వురన్ = సుందరులను; చూడగలుగుట = చూడగలుగుట; ఇంతియ = ఇంతే; సుండీ = సుమా అండి.

భావము:- సుందరీమణులారా! వినండి. వందలమాటలతోవర్ణించడమెందుకు? కన్నులు ఉన్నందుకు ఫలం ఈ సొబగు కాంద్రను చూడగలగడమే సుమా.''

10.1-779-వ.

అని పలికి; రందుఁ గొందఱు గోవిందు నుద్దేశించి.

టీక:- అని = అని; పలికిరి = చెప్పుకొనిరి; అందున్ = వారిలో; కొందఱు = కొంతమంది; గోవిందున్ = కృష్ణుని; ఉద్దేశించి = గురించి.

భావము:- ఇలా అనుకుంటుండగా, వారిలో కొంతమంది గొల్లభామలు కృష్ణుడు గురించి ఇలా అన్నారు.

10.1-780-మ.

"ఒనరన్ ప్రేతల కించుకేనియును లేకుండంగ గోపాలకృ

ష్ణుని కెమ్మోవిసుధారసంబు గొనుచుం జోద్యంబుగామ్రోఁయుచుం

దన పర్వంబులు నేత్రపర్వములుగా దర్శించెఁ, బూర్వంబునన్

వనితా! యెట్టి తపంబు జేసెనొకొ యీ వంశంబు వంశంబులోన్.

టీక:- ఒనరన్ = చక్కగా; వ్రేతల = గోపికల; కున్ = కు; ఇంచుక = కొద్దిగా; ఏనియును = ఐయినను; లేకుండగన్ = మిగలకుండునట్లుగా; గోపాల = గోవులను పాలించెడి; కృష్ణుని = కృష్ణుని యొక్క; కెంపు = ఎఱ్ఱని; మోవి = పెద వసెడి; సుధా = అమృతపు; రసంబున్ = ఊటను; కొనుచున్ = తీసికొనుచు; చోద్యంబుగా = వింతగా; మ్రోయుచున్ = పలుకుచు; తన = తనయొక్క; పర్వంబులు = కణుపులు; నేత్ర = కన్నులకు; పర్వములు = పండుగులు; కాన్ = అగునట్లుగా; దర్పించెన్ = గర్వించెను; పూర్వంబునన్ = పూర్వజన్మమునందు; వనితా = పడతీ; ఎట్టి = ఎలాంటి; తపంబున్ = తపస్సును; చేసెనొకొ = చెసినదోకదా; ఈ = ఈయొక్క; వంశంబు = వేణువు; వంశంబు = జాతి; లోన్ = అందు.

భావము:- “సుందరీ! ఈ వేణువు ఉంది చూసావూ, మునుపు ఏం తపస్సులు చేసిందో కాని. ఇలా పెదురు వంగడంలో జన్మించింది. ఇప్పుడు ఈ పిల్లనగ్రోవి అయి. కృష్ణుడి మోవిని అందుకుంది. గొల్లభామలకు ఇసుమంతైనా మిగల్చకుండా గోపాలకృష్ణుని అరుణ అధరసుధలను ఆస్వాదిస్తూ వింతమ్రోత లీనుతున్నది. తన స్వరా లొలికే పెదురు కణుపులతో అందగిస్తూ కనులపర్వం గావిస్తూ పెదురుల కులంలో నేనే గొప్పదాన్ని అని గర్వంతో మిడిసి పడుతున్నది.

10.1-781-మ.

ముదితా! యే తటినీ పయఃకణములన్ మున్ వేణు వింతయ్యె నా
నది సత్పుత్రుని(గన్నతల్లి పగిదిన్ నందంబుతో నేడు స
మ్మద హంసధ్వని పాటగా వికచపద్మశ్రేణి రోమాంచమై
యొదవం దుంగతరంగ హస్తనటనోద్యోగంబు గావింపదే!

టీక:- ముదితా = ముద్దుగుమ్మా; ఏ = ఏయొక్క; తటినీ = నదియొక్క; పయస్ = నీటి; కణములన్ = బిందువులచే; మున్ = ఇంతకుముందు; వేణువు = పెదురు కఱ్ఱ; ఇంత = ఇంతగొప్పది; అయ్యెన్ = అయినదో; ఆ = ఆయొక్క; నది = ఏరు; సత్ = మంచి; పుత్రునిన్ = కొడుకును; కన్న = కనినట్టి; తల్లి = తల్లి; పగిదిన్ = వలె;

నందంబు = సంతోషము; తోన్ = తోటి; నేడు = ఇవాళ; సమ్మద = సంతోషము కలిగించెడి; హంస = హంసలయొక్క; ధ్వని = రుతము; పాట = గానము; కాన్ = కాగా; వికచ = వికసించిన; పద్మ = కమలముల; శ్రేణి = పంక్తి; రోమాంచము = గగుర్పాటు; ఐ = అయ్యి; ఒదవన్ = కలుగగాగా; తుంగ = పొడపైన; తరంగ = అలలు అనెడి; హస్త = చేతులతో; నటన = నాట్యాభినయనముల; ఉద్యోగంబున్ = ప్రయత్నములను; కావింపదే = చేయదా, చేయును.

భావము:- విరిబోణీ! ఏ నదీజల బిందువులతో ఈ వేణువు ఇంతగా వర్ధిల్లిందో ఆ నదీమతల్లి, మంచి కొడుకును కన్న మాతృదేవత లాగ, మహా నందంతో; మత్తిల్లిన రాయంచల రవళి అనే గానంతో; వికసించిన పద్మాలు అనే రోమాంచములతో; చెలరేగిన అలలనే హస్తాలతో ఈనాడు నాట్యం చేయకుండా ఉంటుందా.

10.1-782-క.

నళినోదరుభక్తునిఁ గని

కులజులు ప్రమదాశ్రుజలము గురియు తెఱఁగు మ్రాఁ

కులు పూదేనియ లొలికెడు

నలినాక్షుని చేతి వంశనాళము మ్రోతన్.

టీక:- నళినోదరు = విష్ణుమూర్తి; భక్తుని = భక్తుడుని; కని = చూసి; కులజులు = స్వకులస్థులు; ప్రమద = సంతోషపు; అశ్రుజలమున్ = కన్నీటిని; కురియన్ = కార్చు; తెఱగున్ = విధముగా; మ్రాకులు = చెట్లు; పూదేనియలు = మకరందములను; ఒలికెడున్ = కార్చుచున్నవి; నలినాక్షుని = పద్మాక్షుని, కృష్ణుని; చేతి = చేతిలోని; వంశనాళము = వేణువు; మ్రోతన్ = నాదమువలన.

భావము:- పద్మనాభుడైన విష్ణుమూర్తియొక్క భక్తుడిని చూసిన అతని కులం వారు ఆనంద బాష్పాలు కార్చినట్లు, కమలాక్షుడు శ్రీకృష్ణుని కమ్మని పిల్లనగ్రోవి పాటలు విని చెట్లు పూదేనియలు జాలువారుస్తున్నాయి.

10.1-783-శా.

నా మోసంబున కెద్ది మేర? విను నే నా పూర్వజన్మంబులన్

లేమా! నోములు నోఁచుచో నకట! కాళిందీతటిన్ వేణుపై

భూమిం బుట్టెద నంచుఁ గోరఁ దగదే? బోధిల్లి యెట్లైన నీ

బామం దిప్పుడు మాధవాధరసుధాపానంబు గల్గుంగదే?

టీక:- నా = నేను చెందిన; మోసంబున్ = మోసమునకు; ఎద్ది = ఏది; మేర = పరిమితి; విను = వినుము; నేన్ = నేను; నా = నాయొక్క; పూర్వ = మొదటి; జన్మంబులన్ = పుట్టుకలలో; లేమా = చిన్నదానా{లేమ - లేత వయస్కురాలు}; నోములు = స్త్రీలు చేయు వ్రతములు; నోచుచోన్ = చేయునప్పుడు; అకట = అయ్యో; కాళిందీ = యమునానది; తటిన్ = తీరమున; వేణువు = వెదురును; ఐ = అయ్యి; భూమిన్ = భూలోకమున; పుట్టెదన్ = జన్మించెదను; అని = అని; అంచున్ = అనుచు; కోరన్ = కోరినచో; తగదే = సరిపోయెడిదికదా; బోధిల్లి = తెలివితెచ్చుకొని; ఎట్లైనను = ఎలాగైనను; ఈ = ఈయొక్క; బాము = జన్మ; అందున్ = లో; ఇప్పుడు = ఇప్పుడు; మాధవ = కృష్ణుని; అధర = పెదవి సోకు టసెడి; సుధా = అమృతము; పానంబు = తాగుట; కల్గున్ = లభించును; కదే = కదా.

భావము:- అయ్యయ్యో! నేనెంత వంచితురాలను అయ్యానో కదా. ఓ చిన్నదానా! విను. నేను పూర్వ జన్మలో నోములు నోచేటప్పుడు యమునానది తీరంలో వెదురు మొక్కగా పుట్టాలని తెలివిగా కోరుకోలేకపోయాను కదా. ఆ జన్మలో అలా కోరుకుని ఉంటే ఇప్పుడీ జన్మలో మాధవుడైనమన కృష్ణుడి అధరామృతం ఆస్వాదించి ఉందును కదా.

10.1-784-క.

కాళింది కూలంబున

నాళీ! యీ నందతనయు నధరామృతముం

గ్రోలెడి వేణువు నగు నో

మేలాగున నోమవచ్చు నెఱిఁగింపఁగదే?

టీక:- కాళంది = యమునానది; కూలంబునన్ = గట్టు నందు; ఆళీ = స్నేహితురాల; ఈ = ఈయొక్క; నందతనయున్ = కృష్ణుని {నంద తనయుడు - నందుని కొడుకు, కృష్ణుడు}; అధర = పెదవి సోకు టనెడి; అమృతమున్ = అమృతమును; క్రోలెడి = తాగెడి; వేణువున్ = వెదురుకఱ్ఱని, వేణువుని; అగు = అయ్యెడి; నోమున్ = వ్రతమును; ఏ = ఏ; లాగునన్ = విధముగా; నోమ = ఆచరించ; వచ్చున్ = వచ్చునో; ఎఱిగింపగదే = తెలుపుము.

భావము:- ఓ చెలియా! యమునాతీరంలో నందుని పుత్రుడు కృష్ణుడియొక్క మోవిసుధను పీల్చే పిల్లనగ్రోవిగా అయ్యే నోము ఏవిధంగా నోచుకోవలెనో చెప్పవే.

10.1-785-క.

వనితా! కృష్ణుఁడు నల్లని

ఘన మనియున్ వేణురవము గర్జన మనియున్

మనమునఁ దలంచి రొప్పుచు

ననవరతము నెమలితుటుము లాడెడిఁ గంటే?

టీక:- వనితా = స్త్రీ; కృష్ణుడు = కృష్ణుడు; నల్లని = నల్లటి; ఘనము = మేఘము; అనియున్ = అని; వేణు = మురళీ; రవము = నాదము; గర్జనము = ఉరుము; అనియున్ = అని; మనమునన్ = మనసు నందు; తలచి = భావించి; రొప్పుచున్ =

కేకలువేయుచు; అనవరతము = ఆగకుండగ; నెమలి = నెమళ్ళ; తుటుములు = సమూహములు; ఆడెడిన్ = నాట్యము చేయుచున్నవి; కంటే = చూసితివా.

భావము:- పడతీ! నళినాక్షుడు కృష్ణుడు నల్లని మేఘమనీ; మురళీ నినాదం ఉరుమనీ; మదిలో భావించి ఎడతెరపి లేకుండా కేకారవాలు గావిస్తూ, నెమళ్ళు పురివిచ్చి నాట్యాలు చేస్తున్నాయి చూసావా.

10.1-786-క.

గిరిచరమిథునము లోలిం

బరికింపఁగఁ గృష్ణపాదపద్మాంకితమై

సురరాజు నగరికంటెనుఁ

దరుణీ! బృందావనంబు తద్దయునొప్పెన్.

టీక:-గిరిచర = గిరిజనులు; మిథునములు = దంపతులు; ఓలిన్ = వరుసగా, అదేపనిగా; పరికిం పన్ = చూచుచుండగా; కృష్ణ = కృష్ణుని; పాద = పాదములు అనెడి; పద్మ = పద్మములుపెట్టిన; అంకిత ము = గుర్తులు కలది; ఐ = అయ్యి; సురరాజునగరి = అమరావతి {సురరాజునగరి - సురరాజు (ఇంద్రు ని) నగరి (పట్టణము), అమరావతి}; కంటెను = కంటె; తరుణీ = యువతీ {తరుణి - తరుణ వయస్కు రాలు, స్త్రీ}; బృందావనంబు = బృందావనము; తద్దయున్ = అధికముగా; ఒప్పెన్ = చక్కగా ఉన్నది.

భావము:- ఓ అంగనా! కృష్ణుడి పద్మాల వంటి అడుగుల ముద్రల చిన్నెలతో కూడిన ఈ బృందావనం అమరావతి కంటే మిక్కిలి అందంగా భాసిస్తున్నది. కొండజాతి జంటలు ఈ సౌభాగ్యాన్ని అదేపనిగా చూస్తున్నారు.

10.1-787-మ.

అమరేంద్రాంగన లాకసంబున విమానారూఢులై పోవుచుం
గమలాక్షున్ శుభమూర్తిఁ గాంచి మురళీగానంబు లందందఁ గ
ర్ణములన్ నిల్పుచు మేఖలల్ వదలఁగా నాథాంకమధ్యంబులం
బ్రమదా! వ్రాలిరి చూచితే వివశలై పంచాశుగభ్రాంతలై?

టీక:- అమర = దేవతా; ఇంద్ర = శ్రేష్ఠుల; అంగనలు = భార్యలు; ఆకసంబున్ = ఆకాశము నందు; విమాన = విమానము లందు; ఆరూఢులు = ఎక్కినవారై; పోవుచున్ = వెళుతూ; కమలాక్షున్ = పద్మాక్షుని, కృష్ణుని; శుభమూర్తిన్ = కృష్ణుని {శుభమూర్తి - శుభములు స్వరూపమైన వాడు, కృష్ణుడు}; కాంచి = చూసి; మురళీ = వేణు; గానంబులన్ = నాదములతో; అందందన్ = మరిమరి; కర్ణములన్ = చెవు లందు; నిల్పుచున్ = ఉంచుకొనుచు; మేఖలల్ = మొలతాళ్ళు; వదలగా = వీడగా; నాథ = భర్తల; అంకమధ్యంబులన్ = ఒడిలో; ప్రమదా = సుందరీ {ప్రమద - మిక్కిలి, సంతోషము కలామె, స్త్రీ}; వ్రాలిరి = వాలి పోయిరి; చూచితే = చూసితివా; వివశలు = పరవశులు; ఐయ్యి = అయిపోయి; పంచాశుగ = మన్మథవేదనలచే {పంచాశుగుడు - 1అరవిందము 2అశోకము 3చూతము 4నవమల్లిక 5నీలోత్పలము అనెడి ఐదు బాణములు కలవాడు, మన్మథుడు}; భ్రాంతలు = భ్రమగొన్నవారు {మన్మథుని పంచబాణములు - 1మోహనము 2ఉన్మాదము 3సంతపనము 4శోషణము 5నిశ్చేష్టీకరణము}; ఐ = అయ్యి.

భావము:- ఓ కాంతా! అదిగో దేవతాస్త్రీలు విమానాలెక్కి ఆకాశవీధిలో వెళుతూ, మంగళమూర్తి అయిన కృష్ణుడిని తిలకించి, ఆయన వేణుగానం వీనులపడగానే పులకించారు. వారి కలాపం అనే మొలతాళ్ళు వదులైపోసాగాయి. వారు వశంతప్పి మదనపీడితులై పతుల ఒడులలో ఒరిగిపోతున్నారు చూసావా.

10.1-788-ఉ.

కానల నుండుచున్ సరసగాన వివేకవిహీనజాతలై
వీనుల నేఁడు కృష్ణముఖ వేణురవామృతధార సోఁకినన్
మేనులు మేఁతలున్ మఱచి మెత్తని చూడ్కి మృగీమృగావళుల్
మానిని! చూడవమ్మ; బహుమానము చేసెఁ గృతార్థచిత్తలై.

టీక:- కానలన్ = అడవులలో; ఉండుచున్ = ఉంటు; సరస = నవరసభరితమైన {నవరసములు - 1శృంగారము 2హాస్యము 3కరుణము 4వీర్యము 5రౌద్రము 6భయానకము 7భీభత్సము 8అద్భుతము 9శాంతము. వీని సంఖ్య ఇతర సందర్భములలో హెచ్చుతగ్గులు కావచ్చు}; గాన = సంగీతపు; వివేక = తెలివి, జ్ఞానము; విహీన = లేనట్టి; జాతలు = పుట్టుకలు కలవి; ఐ = అయ్యి; వీనులన్ = చెవు లందు; నేడు = ఇవాళ; కృష్ణ = కృష్ణుని; ముఖ = మూలముగా; వేణు = మురళీ; రవ = నాదము అనెడి; అమృత = అమృతపు; ధారన్ = జల్లులు; సోకినన్ = తగులుటచేత; మేనులున్ = ఒళ్ళు; మేతలున్ = మేయుటలు; మఱచి = మరిచి పోయి; మెత్తని = మృదువైన; చూడ్కిన్ = చూపులతో; మృగీ = ఆడజంతు వులు; మృగా = మగజంతువుల; ఆవళుల్ = సమూహములు; మానిని = స్త్రీ {మానిని – మంచి మానము కలామె, స్త్రీ}; చూడవు = చూడుము; అమ్మ = తల్లి; బహుమానము = గౌరవించుట; చేసెన్ = చేసినవి; కృతార్థ = ధన్యమైన; చిత్తులు = మనసులు కలవి; ఐ = అయ్యి.

భావము:- ఓ యమ్మా! మానవతీ! చూసావా. అడవిలో నివసించే ఈ పెంటి, పోతు జంతువులు అన్నీ సంగీత మాధుర్యం గ్రోలే జ్ఞానం బొత్తిగా లేనట్టివి అయినా; నేడు చిన్నికృష్ణుడు చిందిస్తున్న మురళీ గానాల సుధారసం చెవులలో పడగానే, ఒడలు మరచి; మేతలు విడిచి; సుతిమెత్తని చూపులతో; పరవశించిన మనసులతో; నందగోపుణ్ణి అభినందిస్తున్నాయి.

10.1-789-ఉ.

తల్లుల చన్నుఁబాలు మును ద్రావు తఱిం దమకర్ణవీధులన్
వల్లభమైన మాధవుని వంశరవామృతధార చొచ్చినం
ద్రుళ్ళక పాలురాఁ దివక దూఁటక మానక కృష్ణుమీఁద దృ
గ్వల్లులు చేర్చి నిల్చె నదె; వత్సము లంగనలార! కంటిరే?

టీక:- తల్లులు = తల్లులయొక్క; చన్నుబాలు = స్తన్యము; మును = ఇంతకు ముందు; త్రావు = తాగెడి; తఱిన్ = అప్పుడు; తమ = వాటి; కర్ణ = చెవుల; వీధులన్ = మార్గములద్వారా; వల్లభము = ప్రీతికరము; ఐన = అయిన; మాధవుని = కృష్ణుని; వంశ = వేణు; రవ = గానము అనెడి; అమృత = అమృతపు; ధార = పరంపరలు; చొచ్చినన్ = దూరగా; త్రుళ్ళకన్ = గెంతులేయకుండ; పాలు = స్తన్యము; రాన్ = వచ్చునట్లు; తివక = పీల్చుకొనకుండ, తాగక; దూటక = మూతితో పొడిచి చేపకుండ; మానక = వదలకుండ; కృష్ణ = కృష్ణుని; మీదన్ = మీద; దృక్ = చూపు లనెడి; వల్లులున్ = తీగలను; చేర్చి = ఉంచి; నిల్చెన్ = నిలుచున్నవి (కదలక); అదె = అదిగో; వత్సములు = దూడలు; అంగనలార = అందగత్తెలు {అంగన - మంచి అంగములు కలామె, స్త్రీ}; కంటిరె = చూచితిరా.

భావము:- ఓ వనితలారా! చూసారా. లేగలు తల్లి ఆవుల పాలు కుడిచే వేళ ప్రియమైన మాధవుడు కృష్ణుడి వేణుగాన సుధాదార చెవులలో పడడంతో అవి తుళ్ళిపడటం మానేసాయి. పాలు పీల్చకుండా; పొదుగు కుమ్మకుండా; ఊరక చన్నులను నోటిలో ఉంచుకుని; చిన్నికృష్ణుడి మీదనే కన్నులుంచి; అలాగే చూస్తూ నిలబడిపోయాయి.

10.1-790-మ.

మమతన్ మోములు మీఁది కెత్తుకొని రోమంథంబు చాలించి హృ
త్కమలాగ్రంబులఁ గృష్ణు నిల్పి మురళీగానామృతశ్రేణి క
ర్ణములం గ్రోలుచు మేఁతమాని గళితానందాశ్రులై చిత్రితో
పమలై గోవులు చూచుచున్న వవిగో పద్మాక్షి! వీక్షించితే?

టీక:- మమతన్ = మోహముతో; మోములు = మోరలు; మీదికిన్ = పైకి; ఎత్తుకొని = ఎత్తి; రోమంథంబు = నెమరుపేయుటలను; చాలించి = ఆపివేసి; హృత్ = హృదయములు అనెడి; కమల = పద్మముల; అగ్రంబులన్ = మీద; కృష్ణున్ = కృష్ణుని; నిల్పి = ఉంచుకొని; మురళీ = పిల్లనగ్రోవియొక్క; గాన = నాదము యనెడి; అమృత = అమృతపు; శ్రేణి = పరంపరలు; కర్ణములన్ = చెవులతో; క్రోలుచున్ = తాగుతు; మేతన్ = మేతమేయుట; మాని = విడిచిపెట్టి; గళిత = కారుచున్న; ఆనంద = సంతోషపు; అశ్రులు = కన్నీరు కలవి; ఐ = అయ్యి; చిత్రిత = చిత్తరవులోని బొమ్మలతో; ఉపమలు = పోల్చదగినవి; ఐ = అయ్యి; గోవులు = ఆవులు; చూచుచున్నవి = చూస్తున్నవి; అవిగో = అదిగో; పద్మాక్షి = సుందరి {పద్మాక్షి - పద్మముల వంటి కన్నులు కలామె, స్త్రీ}; వీక్షించితే = చూసితివా.

భావము:- ఓ కలువ కన్నుల సుందరి! అవిగో చూడు. ఆవులు మమకారంతో మోరలు పైకెత్తుకున్నాయి; నెమరుపేయడం ఆపేసాయి; హృదయకోశంలో కృష్ణుడిని నిలుపుకున్నాయి; వేణునాదామృత ధారలను చెవులతో త్రాగుతూ మేతలు మేయడం మానేసాయి; ఆనందబాష్పాలు విడుస్తున్నాయి; బొమ్మల లాగ కదలక మెదలక నిలబడి శ్రీ కృష్ణుడి పైపే చూస్తున్నాయి. పరికించావా?

10.1-791-మ.

జగతీజంబులశాఖ లెక్కి మురళీశబ్దామృతస్యందమున్
మిగులన్ వీనులఁ ద్రావి ప్రేఁగుపడి సెమ్మిం గృష్ణ రూపంబు చి
త్తగమై యుండఁగ నడ్డపెట్టు క్రియ నేత్రంబుల్ దగన్ మూసి యీ
ఖగముల్ ఛొక్కెడిఁ జూచితే? మునిజనాకారంబులం గామినీ!

టీక:- జగతీజంబులన్ = చెట్లయొక్క {జగతీజములు - భూమి యందు పుట్టునవి, వృక్షములు}; శాఖలన్ = కొమ్మలను; ఎక్కి = ఎక్కి; మురళీ = వేణు; శబ్ద = నాదము యనెడి; అమృత = అమృతపు; స్యందమున్ = స్రావమును; మిగులన్ = అధికముగా; వీనులన్ = చెవులతో; త్రావి = తాగి; ప్రేగుపడి = మత్తుగొని, బరువెక్కి; సెమ్మిన్ = సెమ్మదిగా; కృష్ణ = కృష్ణుని; రూపంబున్ = రూపమును; చిత్తగము = మనస్సు నందు పొందినది; ఐ = అయ్యి; ఉండగన్ = ఉండిపోవునట్లుగా; అడ్డపెట్టి = అడ్డుపెట్టెడి; క్రియన్ = విధముగ; నేత్రంబులు = కళ్ళు; తగన్ = చక్కగా; మూసి = మూసి; ఈ = ఈయొక్క; ఖగముల్ = పక్షులు; ఛొక్కెడిన్ = సోలిపోతున్నవి; చూచితే = చూసితివా; ముని = ఋషులైన; జన = వారి; ఆకారంబులన్ = వలె; కామినీ = సుందరి {కామిని - ప్రియ సంగము నందు మిక్కిలి ఆశ కలామె, స్త్రీ}.

భావము:- ఓ పడతీ! పక్షులు చెట్లకొమ్మలపై చేరి వేణుగాన మనే సుధారస ధారలను మిక్కిలిగా చెవులారా త్రాగి, మత్తుగొన్నాయి. చిత్తంలో సెలకొల్పుకున్న చిన్నారి కృష్ణుడి రూపం వెలికి వెళ్ళనీకుండా ఆపుకోడం కోసమా అన్నట్లు, అవి కళ్ళు మూసుకుని ఉన్నాయి. వాటిని గమనించావా, ఎలా కళ్ళుమూసుకుని మునిజనం లాగ సొక్కుతున్నాయో?

10.1-792-మ.

క్రమమొప్పన్ నదులెల్ల వంశరవ మాకర్ణించి సంజాత మో
హములన్ మన్మథసాయక క్షత విశాలావర్తలై హంస వా
క్యములం జీరి తరంగహస్తముల నాకర్షించి పద్మోప హా
రములం గృష్ణపదార్చనంబు సలిపెన్ రామా! విలోకించితే?

టీక:- క్రమమొప్పన్ = సక్రమముగా; నదులు = నదులు; ఎల్లన్ = అన్ని; వంశ = వేణువుయొక్క; రవమున్ = నాదమును; ఆకర్ణించి = విని; సంజాత = పుట్టిన; మోహములన్ = మోహములచేత; మన్మథ = మన్మథుని; సాయక = బాణములుచేత కలిగిన; క్షత = గాయము లనదగిన; విశాల = పెద్దపెద్ద; ఆవర్తలు = సుడిగుండములు కలవి; ఐ = అయ్యి; హంస = హంసల కూత లనెడి; వాక్యములన్ = పలుకులతో; చీరి = పిలిచి; తరంగ = అల లనెడి; హస్తములన్ = చేతులతో; ఆకర్షించి = దగ్గరకు పిలిచి; పద్మ = పద్మములు అనెడి; ఉపహారములన్ = కానుకలచేత; కృష్ణ = కృష్ణుని; పద = పాదముల; అర్చనంబు = పూజలు; సలిపెన్ = చేసెను; రామా = రమణీ {రామ - రమించు నట్టి యామె, స్త్రీ}; విలోకించితే = చూసితివా.

భావము:- ఓ మనోహరమైన సుందరీ! నదులన్నీ చక్కగా వేణునాదం వింటున్నాయి; ఆ సుడిగుండాలు అవి మోహంలో పడగా కలిగిన మదనునిబాణాల గాయల వలె ఉన్నాయి కదా. ఆ నదులు హంసల పలుకులనే తమ మాటలతో కృష్ణుణ్ణి అహ్వానిస్తున్నాయి. అలలనే చేతులతో చెంతకు పిలుస్తున్నాయి. కలువలనే కానుకలతో ఆ కమలాక్షుడి పాద పద్మాలను పూజిస్తున్నాయి. వీక్షించావా?

10.1-793-ఆ.

వనిత! నేడు కృష్ణు వంశనినాదంబు
విని పయోధరంబు విరులు గురిసి
తన శరీర మెల్ల ధవళాతపత్రంబుఁ
జేసి మింట నీడఁ జేసెఁ గంటె?

టీక:- వనితా = యువతీ {వనిత - మిక్కిలి అనురాగస్తురాలు, స్త్రీ}; నేడు = ఇవాళ; కృష్ణు = కృష్ణునియొక్క; వంశ = వేణువుయొక్క; నినాదంబు = మోతను; విని = విని; పయోధరంబు = మబ్బులు; విరులు = పూలు; కురిసి = వర్షించి; తన = దాని యొక్క; శరీరము = దేహము; ఎల్లన్ = అంతటిని; ధవళ = తెల్లని; అతపత్రం బున్ = గొడుగుగా; చేసి = చేసి; మింటన్ = ఆకాశము నందు; నీడన్ = ఛాయలను; చేసెన్ = చేసెను; కంటే = చూసితివా.

భావము:- సెలతా! ఇదిగో ఇక్కడ చూడు కృష్ణుడి మురళీ స్వరాలు విని, నీలమేఘం పూల వానకురిసింది. ఆపైని తన విపుల దేహం అంతటినీ గొడుగులా చేసి అకాశంలో నిలబడి నీడ కల్పిస్తోంది. విలోకించావా?

10.1-794-క.

మంచి ఫలంబులు హరిచే
నించి కరాలంబనముల సెగడుచు నిదె క్రీ
డించెద, రంగన! చూడుము
చెంచెతలం బింఛ పత్ర చేలాంచితలన్.

టీక:- మంచి = చక్కటి; ఫలంబులున్ = పండ్లను; హరి = కృష్ణుని; చేన్ = చేతి యందు; నించి = నిండించి; కర = చేతులను; ఆలంబనములన్ = ఊతమిచ్చుట లుతో; సెగడుచున్ = అతిశయించుచు; ఇదె = ఇదిగో; క్రీడించెదరు = వినోదించు

చున్నారు; అంగన = ఇంతి; చూడుము = చూడుము; చెంచెతలన్ = చెంచుస్త్రీలు; పింఛ = నెమలి పింఛములను; పత్ర = ఆకులను; చేల = వస్త్రములచే; అంచితలన్ = ధరించినవారిని.

భావము:- అందాల బొమ్మా! చూడు. ఆ బోయపడతులను. నెమలి ఈకల గుత్తులు ఆకులూ కోకలుగా ధరించి, ఎంతో మురుపు గొల్పుతున్నారు. వారు మధురమైన మంచి మంచి మాగిన పండ్లు గోవిందుడికి ఇచ్చే నెపంతో, అతని చేతిలో చేయ్యేసి ఆనందంతో ఆడుతున్నారు.

10.1-795-క.

ఉల్లసిత కుచభరంబున
నల్లాడెడి నడుముతోడ నలరుల దండన్
భిల్లి యొకతె హరి కిచ్చెను
హల్లోహలకలిత యగుచు నంగన! కంటే?

టీక:- ఉల్లసిత = ఉప్పొంగిన, నిక్కిన; కుచ = స్తనముల; భరంబునన్ = బరువులచేత; అల్లాడెడి = ఊగిపోతున్న; నడుము = నడుము; తోడన్ = తోటి; అలరుల = పూల; దండన్ = మాలను; భిల్లి = ఎరుకయువతి; ఒకతె = ఒకామె; హరి = కృష్ణుని; కిన్ = కి; ఇచ్చెను = ఇచ్చెను; హల్లోహల = సంభ్ర మము, తొట్రుపాటు, ఆదరము; కలిత = కలామె; అగుచున్ = అగుచు; అంగన = సుందరి; కంటె = చూసితివా.

భావము:- ఓ మానినీ! చూసావా? ఒక బోయత ఉప్పొంగే కుచముల బరువుతో జవ్వాడే నడుముతో భావావేశంతో పూల మాలికను కృష్ణుడికి సమర్పించింది. కన్నావుటే.

10.1-796-క.

గిరు లెల్ల జలము లయ్యెం
దరు లెల్లనుఁ బల్లవించె ధరణి గగన భూ
చరు లెల్లనుఁ జొక్కిరి హరి
మురళీరవామృతము సోఁక ముద్దియ! కంటే?

టీక:- గిరులు = కొండలు; ఎల్లన్ = అన్ని; జలములు = నీళ్ళు కలవి; అయ్యెను = అయినవి; తరులు = చెట్లు; ఎల్లన్ = అన్ని; పల్లవించెన్ = చిగురించినవి; ధరణిన్ = భూలోకము నందు; గగన = ఆకాశము నందు; భూ = నేలమీద; చరులు = మెలగెడివారు; ఎల్లను = అందరును; ఛొక్కిరి = సొలిపోయిరి; హరి = కృష్ణుని; మురళి = వేణు; రవ = నాదము యసెడి; అమృతము = అమృతము; సోక = తగలగా; ముద్దియ = ముగ్ధ; కంటె = చూసితివా.

భావము:- ఓ ముద్దరాలా! కృష్ణుడి మురళీగానామృతం సోకగానే కొండలన్నీ కరిగి నీరైపోతున్నాయి. భూమ్మీదున్న చెట్లన్నీ చిగురిస్తున్నాయి. ఖేచరులు భూచరులు అందరూ సొక్కి సోలిపోతున్నారు. విలోకించావా?

10.1-797-మ.

బలకృష్ణాంఘ్రిసరోజ సంగమముచే భాసిల్లుచున్ ధన్యమై
ఫలపుష్పంబులఁ గానికల్ గురిసి సంభావించి మిన్నందుచున్
జలఘాసంబుల గోవులం దనిపి చంచద్భూజరోమాంచమై
వెలసెం జూడఁ గదమ్మ! యీ గిరిపురోవీధిన్ సరోజాననా!"

టీక:- బల = బలరాముడు; కృష్ణ = కృష్ణుల; అంఘ్రి = పాదము లసెడి; సరోజ = పద్మములతో; సంగమము = కలియ గలుగుట, సోకుట; చేన్ = వలన; భాసిల్లుచున్ = ప్రకాశించుచు; ధన్యము = కృతార్థమైనది; ఐ = అయ్యి; ఫల = పండ్లు;

పుష్పంబులన్ = పువ్వులు అనెడి; కానికల్ = కానుకలను; కురిసి = సమృద్ధిగా ఇచ్చి; సంభావించి = గౌరవించి; మిన్నందుచున్ = మిన్నుముట్టుచు; జల = నీళ్ళచేతను; ఘాసంబులన్ = గడ్డిచేతను; గోవులన్ = ఆవులను; తనిపి = తృప్తిపొందించి; చంచత్ = కదులుతున్న; భూజ = చెట్లు అనెడి; రోమాంచము = గగుర్పాటులు కలది; ఐ = అయ్యి; వెలసెన్ = ప్రకాశించెను; చూడగద = చూడుము; అమ్మ = తల్లి; ఈ = ఈయొక్క; గిరి = కొండ; పురోవీధిన్ = మన ఎదుటి భాగమున; సరోజాననన = సుందరి {సరోజానన - సరోజ (పద్మముల వంటి) ఆనన (మోముకలామె), స్త్రీ}.

భావము:- ఓ పద్మముఖీ! మన ఎదురుగా ఉన్న ఈ కొండను చూడవమ్మా! ఈ పర్వతం బలరామకృష్ణుల పాదపద్మాల సంస్పర్శతో ధన్యత పొంది ప్రకాశిస్తున్నది. పండ్లు పూలు అనే కానుకలను సమర్పించి వారిని సత్కరిస్తున్నది. ఆనందంతో ఆకాశం అందుకుంటోంది. నీటితో కసవుతో ధేనువుల తనివితీరుస్తున్నది. అందమైన తరువులనే గగుర్పాటుతో కనువిందు చేస్తున్నది.''

10.1-798-వ.

అని యిట్లు బృందావన విహారియైన గోవిందుని సందర్శించి పంచ బాణభల్ల భగ్నహృదయ లయి వల్లవకాంత లేకాంతంబులఁ జింతిం చుచుఁ దత్పరతంత్ర లై యుండి; రంత.

టీక:- అని = అని; ఇట్లు = ఈ విధముగ; బృందావన = బృందావనము నందు; విహారి = విహరించుచున్నవాడు; ఐన = అయిన; గోవిందుని = కృష్ణుని; సందర్శించి = చూసి; పంచబాణ = మన్మథుని {పంచబాణుడు - 1అరవిందము 2అశోకము 3చూతము 4నవమల్లిక 5నీలోత్పలము అనెడి ఐదు బాణములు కలవాడు, మన్మథుడు}; భల్ల = బాణములచే; భగ్న = తెబ్బతిన్న, లోనైన; హృదయలు = హృదయములు కలవారు; అయి = అయ్యి; వల్లవ = గోపికా; కాంతలు = స్త్రీలు {కాంత - కాంక్షిప దగి నామె, స్త్రీ}; ఏకాంతంబునన్ = రహస్య ప్రదేశము లందు;

చింతించుచున్ = స్మరించుకొనుచు; తత్ = అతని యందు; పరతంత్రలు = ఆసక్తి కలవారు; ఐ = అయ్యి; ఉండిరి = ఉన్నారు; అంత = ఆ సమయము నందు.

భావము:- ఇలా అనుకుంటూ గోపికలు బృందావనంలో విహరిస్తున్న మాధవుడిని చూసి మదనుడి భాణ పరంపరలచే పీడింపబడే మనసులతో ఏకాంతంలో చింతిస్తూ తదేక ధ్యానపరాయణులై ఉండిపోయారు.

హేమంతఋతు వర్ణనము

10.1-799-క. *

శామంతికా స్రగంచిత

సీమంతవతీ కుచోష్ణజితశీతభయ

శ్రీమంతంబై గొబ్బున

హేమంతము దోఁచె; మదనుఁ డేఁచె విరహులన్.

టీక:- శామంతికా = చేమంతిపూల; స్రక్ = దండచేత; అంచిత = అలంకరింపబడిన; సీమంతవతీ = పాపటలు కలిగిన స్త్రీల; కుచ = పాలిండ్లు; ఉష్ణ = వేడిచేత; జిత = జయింపబడిన; శీత = చలివలని; భయ = భయము అనెడి; శ్రీమంతంబు = సంపదలు కలిగినవారు; ఐ = అయ్యి; గొబ్బున = తటాలున; హేమంతము = చలికాలము; తోచెన్ = కనబడెను; మదనుడు = మన్మథుడు; ఏచెన్ = బాధించెను, పీడించెను; విరహులన్ = విరహము కలవారిని.

భావము:- ఇంతలో శ్రీమంతమైన హేమంతం ప్రవేశించేసింది. చేమంతి పూలు ధరించిన పూబంతుల చనుబంతల వేడిమిచే చలి భయాన్ని జంటలు జయించారు. కాని, వియోగులను మన్మథుడు వేధించాడు.

10.1-800-కం.

ఉత్తరపుగాలి విసరె వి

యత్తలమునఁ దుహినకిరణుఁ డహితుం డయ్యెం

బొత్తు జరిగె మిథునములకు

సెత్తమ్ములు దఱిగె హిమము సెలకొనియె నృపా!

టీక:- ఉత్తరపు = ఉత్తరదిక్కునుండి వచ్చెడి; గాలి = గాలి; విసరెన్ = వీచెను; వియత్తలమునన్ = ఆకాశము నందు; తుహినకిరణుండు = చంద్రుడు {తుహిన కిరణుడు - తుహిన (మంచువలె చల్లని) కిరణములు కలవాడు, చంద్రుడు}; అహితుడు = అయిష్టుడు; అయ్యెన్ = అయ్యెను; పొత్తు = కలియుట; జరిగెన్ = జరిగినది; మిథునముల = దంపతుల; కున్ = కు; సెఱి = వికసించిన; తమ్ములు = కమలములు; తఱిగెన్ = తగ్గెను; హిమము = మంచు; సెలకొనియె = వ్యాపించెను; నృపా = రాజా.

భావము:- రాజా పరీక్షిత్తూ! హేమంతం రాకతో ఉత్తరపు గాలులు వీచాయి. ఆకాశంలో ఉండి చలివెలుగు ఇచ్చే చంద్రుడు సహింపరాని వాడయ్యాడు. దంపతులకు పొత్తు కుదిరింది. అంతటా మంచు అలుముకుంది. తామరలకు శోభ తరిగిపోయింది.

10.1-801-కం.

అహములు సన్నము లయ్యెను

దహనము హితమయ్యె దీర్ఘదశ లయ్యె నిశల్;

బహు శీతోపేతంబై

యుహుహూ యని వడఁకె లోక ముర్వీనాథా!

టీక:- అహములున్ = పగటిసమయములు; సన్నములు = తగ్గినవి; అయ్యెను = అయ్యెను; దహనము = అగ్ని; హితము = ఇష్టము కలది; అయ్యెన్ = అయినది; దీర్ఘ = ఎక్కువ; దశలు = కాలముండునవి; అయ్యెన్ = అయినవి; నిశల్ = రాత్రులు; బహు = మిక్కిలి; శీత = చలితో; ఉపేతంబు = కూడినవి; ఐ = అయ్యి; ఉహుహూ = ఉహుహూ అను ధ్వనితో; వడకెన్ = వణకిపోయెను; లోకము = జగత్తు; ఉర్వీనాథా = రాజా {ఉర్వీనాథుడు - ఉర్వి (భూమికి, రాజ్యమునకు) నాథుడు, రాజు}.

భావము:- ఓ పరీక్షన్మహారాజా! పగలు కాలాలు తగ్గిపోయాయి. మంటల వెచ్చదనం ఇష్టమైంది. రాత్రి సమయాలు పెరిగాయి. చలి ఎక్కువై లోకం “ఉహుహూ” అంటూ వణికింది హేమంతంలో.

10.1-802-క. *

అన్నుల చన్నుల దండ వి

పన్నులు గా కెల్లవారు బ్రతికిరిగా కీ

చన్నుల మీఁటిన వలి నా

పన్నులు గా కుండఁ దరమె బ్రహ్మాదులకున్.

టీక:- అన్నుల = స్త్రీలయొక్క {అన్ను - పరవశింప చేయునామె, స్త్రీ}; చన్నుల = పాలిండ్లు; దండన్ = ప్రాపుచేత, అండచేత; విపన్నులు = ఆపదపొందినవారు; కాక = కాకుండగ; ఎల్ల = అందరు; వారున్ = జనులు; బ్రతికిరి = కాపాడబడిరి; కాక = తప్పించి; ఈ = ఈయొక్క; చన్నులన్ = పాలిండ్లను; మీఁటినన్ = లెక్కచేయకపోతే; వలిన్ = చలిచేత; ఆపన్నులు = ఆపదలు పొందినవారు; కాకుండన్ = కాకుండుట; తరమె= శక్యమా, కాదు; బ్రహ్మ = బ్రహ్మదేవుడు; ఆదుల = మొదలగువారల; కున్.

భావము:- ఈ హేమంత ఋతువులో పడతుల పయోధరాల చెంత ప్రజలందరు ఆపదకు లోనుగాకుండ జీవింప గలుగుతున్నారు. వాటి అండే లేకపోతే బ్రహ్మాది దేవతల కైనా చలిబాధ తట్టుకోడం సాధ్యం కాదు కదా.

10.1-803-ఆ.

పొడుపుఁగొండమీఁద పొడిచిన మొదలుగాఁ
బరువుపెట్టి యినుఁడు పశ్చిమాద్రి
మఱుఁగుఁ జొచ్చెఁ గాక మసలినఁ జలిచేతఁ
జిక్కెఁజిక్కె ననఁగఁ జిక్కకున్నె.

టీక:- పొడుపు = పొద్దుపొడుపు; కొండ = కొండ; మీద = పైన; పొడిచిన = ఉదయించినది; మొదలుగాన్ = మొదలు పెట్టి; పరువుపెట్టి = పరుగెట్టి; ఇనుడు = సూర్యుడు; పశ్చిమ = పడమరపైపున్న; అద్రి = కొండ; మఱుగున్ = చాటునకు; ఛొచ్చెన్ = దాగెను; కాక = కాని; మసలినన్ = ఆలస్యము చేసినచో; చలి = చలి; చేతన్ = వలన; చిక్కెజిక్కెన్ = బలే చిక్కిపోయాడు; అనగన్ = అని పరిహాసము చేయగా; చిక్కక = చిక్కకుండ; ఉన్నె = ఉండునా, ఉండడు;

భావము:- సూర్యుడు ఉదయాద్రి మీద ఉదయించింది మొదలు ఎక్కడా ఆగకుండా పరుగులుతీసి అస్తమాద్రి మాటున చేరుకున్నాడు. అలాకాకుండా దారిలో ఆలస్యం చేసి ఉంటే, "చిక్కాడు చిక్కా"డని పరిహాసం చేసేలా చలి చేతిలో చిక్కి ఉండే వాడు కదా ఈ హేమంతంలో.

10.1-804-క.

చెంగల్వ విరుల గంధము
మంగళముగఁ గ్రోలుచున్న మధుపము లొప్పె
న్నంగజ వహ్నులపై ను
ప్పొంగి విజృంభించు పొగల పోలిక నధిపా!

టీక:- చెంగల్వ = ఎఱ్ఱకలువ {చెంగల్వ - చెన్ను (ఎఱ్ఱదనము కలిగిన) కల్వ (కలువపువ్వు)}; విరుల = పూలయొక్క; గంధము = సువాసన; మంగళముగన్ =

మిక్కిల మేలుగా; క్రోలుచున్న = తాగుచున్న; మధుపములు = తుమ్మెదలు; ఒప్పెన్ = చక్కగానున్నవి; అంగజ = మన్మథ; వహ్నులు = అగ్నుల; పైన్ = మీద; ఉప్పొంగి = మిక్కిలిగ సంతోషించి; విజృభించి = చెలరేగునట్టి; పొగల = ధూమముల; పోలికన్ = వలె; అధిపా = రాజా.

భావము:- ఓ పరీక్షన్మహారాజా! హేమంతంలో ఎఱ్ఱకలువ పూవుల పరిమళం శుభప్రదంగా ఆస్వాదిస్తున్న తుమ్మెదలు మన్మథాగ్నుల మీదనుండి ఉవ్వెత్తుగా పైకెగసే పొగల వలె పొడకట్టాయి.

10.1-805-ఆ. *

శంభుకంట నొకటి జలరాశి నొక్కటి
మఱియు నొకటి మనుజ మందిరముల
నొదిగెఁగాక మెలఁసియున్న మూడగ్నులు
చలికి నులికి భక్తి సలుపకున్నె?

టీక:- శంభు = శివుని; కంటన్ = కంటియందు; ఒకటి = ఒకటి; జలరాశిన్ = సముద్రమునందు; ఒక్కటి = ఒకటి; మఱియున్ = ఇంకను; ఒకటి = ఒకటి; మనుజ = మానవుల; మందిరములన్ = నివాసములందు; ఒదిగెన్ = దాగెను; కాకన్ = లేకపోయినచో; మెలఁసి = బహిరంగముగామెలగుచు; ఉన్నన్ = ఉండినచో; మూడగ్నులు = త్రేతాగ్నులు మూడు {త్రేతాగ్నులు - 1గార్హపత్యము 2ఆహవనీయము 3దక్షిణాగ్నులు అనెడి మూడు అగ్నులు}; చలి = చలి; కిన్ = కి; ఉలికి = అదిరిబెదిరి; భక్తి = సేవ; సలుపక = చేయకుండగా; ఉన్నె = ఉండునా.

భావము:- చలిదెబ్బకు తట్టకోలేక త్రేతాగ్నులు మూడు అగ్నులలోను ఆహవనీయం అనే అగ్ని ఒకటి శివుని మూడోవ నేత్రంలో అణగి ఉంది. దక్షిణాగ్ని అనే మరొకటి సాగర గర్భంలో ఛొచ్చింది. గార్హపత్యం అనే అగ్ని ఇంకొకటి

గృహస్థుల ఇండ్లలో ఒదిగి ఉంది. అలాకాక బట్టబయల ఉంటే హేమంతఋతు చలికి త్రేతాగ్నులు కొంకర్లు తిరిగి పోయేవి.

10.1-806-శా. *

ఈ హేమంతము రాకఁ జూచి రమణీహేలాపరీరంభ స
త్సాహాయ్యంబునఁగాని దీని గెలువన్ శక్యంబుగా దంచుఁ దా
రూహాపోహవిధిం ద్రిమూర్తులు సతీయుక్తాంగు లైనారు గా
కోహో! వారలదేమి సంతత వధూయోగంబు రాఁ గందురే?

టీక:- ఈ = ఈయొక్క; హేమంతము = చలికాలము; రాకన్ = వచ్చుటను; చూచి = చూసి; రమణీ = భార్యలయొక్క {రమణి - క్రీడింపదగినామె, స్త్రీ}; హేలా = విలాసపూరితమైన; పరీరంభ = ఆలింగనముల; సత్ = మంచి; సహాయ్యంబునన్ = తోడ్పాటువలన; కాని = తప్పించి; దీనిన్ = దీనిని; గెలువన్ = జయింప; శక్యంబుగాదు = వీలుకాదు; అంచున్ = అనుచు; తార్ = వారు; ఉహాపోహల =అనుకూల్య ప్రతికూల్యము లూహించుకున్న; విధిన్ = విధముగా; త్రిమూర్తులు = బ్రహ్మవిష్ణుమహేశ్వరులు; సతీ = భార్యలతో (సరస్వతి, లక్ష్మి, పార్వతులతో); యుక్త = కూడిన; అంగులు = దేహములు కలవారు; ఐనారు = అయితిరి; కాకన్ = అలాకాని పక్షమున; ఓహో = ఔరా; వారలు = వారు; అది = అలా; ఏమి = ఎందుకు; సంతత = ఎడతెగని; వధూ = భార్యతో; యోగంబున్ = కూడియుండుటను; రాన్ = కలుగుటను; కందురే = పొందుదురా.

భావము:- హేమంత ఋతువు రావటం చూసి కామినుల విలాసవంతమైన బిగికౌగిళ్ళ తోడ్పాటుతో కాని దీని చలిని జయించటం వీలుపడ దని ఊహించుకొన్నట్లు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు సరస్వతీ, లక్ష్మీ, పార్వతులను ముగ్గురిని తమ తమ దేహాల యందే ధరించారు. ఔనౌను, ఇదే కారణం లేకపోతే ఆ త్రిమూర్తులు స్త్రీమూర్తుల సదా సాంగత్యం కలిగి ఉండరు కదా.

10.1-807-క.

ఈ హేమంతము రాకకు

శ్రీహరి యొక్కింత వడఁకి చింతింపంగా

నోహో! వెఱవకు మని తా

మా హరికిని శ్రీకుచంబు లభయం బిచ్చెన్.

టీక:- ఈ = ఆయొక్క; హేమంతము = హేమంత ఋతువు; రాక = వచ్చుట; కున్ =కు; శ్రీహరి = విష్ణుమూర్తి; ఒక్కింత = బహుకొద్దిగా; వడకి = వణకిపోయి; చింతింపంగా = బాధపడుచుండగా; ఓహో = ఓయీ; వెఱవకు = బెదిరిపోకు; అని = అని; తాము = అవి; ఆ = ఆ ప్రసిద్ధుడైన; హరి = విష్ణుమూర్తి; కిని = కి; శ్రీ = లక్ష్మీదేవియొక్క; కుచంబులు = స్తనములు; అభయంబున్ = ధైర్యము చెప్పుట; ఇచ్చెను = చేసెను.

భావము:- హేమంతం రావడంతో శ్రీమహావిష్ణువు కొద్దిగా వణకి బాధపడ్డాడట. అంత భయపడకంటూ శ్రీమహాలక్ష్మివక్షోజాలు ఆయనకు అభయమిచ్చాయిట.

పూర్ణి

*10.1-1790-క. **

కువలయరక్షాతత్పర!

కువలయదళ నీలవర్ణ కోమలదేహా!

కువలయనాథ శిరోమణి!

కువలయజన వినుత విమలగుణ సంఘాతా!

టీక:- కువలయరక్షాతత్పర = శ్రీరామా {కువలయ రక్షా తత్పరుడు - కు (భూమి) వలయ (మండలమును) రక్షా (కాపాడుట యందు) తత్పరుడు

(ఆసక్తి కలవాడు), శ్రీరాముడు}; కువలయదళనీలవర్ణకోమలదేహా = శ్రీరామా {కువలయ దళ నీలవర్ణ కోమల దేహుడు – కువలయ (నల్లకలువ) యొక్క దళ (రేకులవంటి) వర్ణ (రంగు కలిగిన) కోమల (మృదువైన) దేహుడు (శరీరము కలవాడు), శ్రీరాముడు}; కువలయనాథశిరోమణి = శ్రీరామా {కువలయనాథ శిరోమణి – కు (భూమి) వలయ(మండలమును) నాథ (ఏలువారిలో) శిరోమణి (తలమీది మణివలె శ్రేష్ఠమైన వాడు), శ్రీరాముడు}; కువలయజనవినుత = శ్రీరామా {కువలయజన వినుత – కువలయ (భూమండలము యొక్క) జన (సర్వ ప్రజలచేత) వినుత (స్తుతింపబడువాడు), శ్రీరాముడ}; విమలగుణసంఘాతా = శ్రీరామా {విమల గుణ సంఘాతుడు – విమల (స్వచ్ఛమైన) గుణ (సుగుణముల) సంఘాత (సమూహములు కలవాడు), శ్రీరాముడు}.

<u>భావము:-</u> భూమండలాన్ని రక్షించటంలో ఆసక్తి కలవాడా! కలువ రేకుల వంటి నల్లని కాంతితో విరాజిల్లే మృదువైన దేహం కలవాడా! భూమండలంలోని భూపతు లందరికి శిరోభూషణ మైన వాడా! పుడమి మీదనుండే జనులందరిచే పొగడబడే సుగుణాల సమూహం కలవాడా! శ్రీ రామచంద్ర ప్రభో! నీకు వందనం.

ఈ శ్రీరాముని ప్రార్థనలోని చమత్కర మాధుర్యం తొణికిసలాడుతోంది. కువలయ అని నాలుగు పాదాలు ఆరంభిస్తు లోకం, కలువలు, రాజులు, మానవులు అని నాలుగు రకాల అర్థబేధంతో యమకం పండించిన తీరు అద్భుతం. రెండు గాని అంతకంటె ఎక్కువ అక్షరాలు ఉన్న పదాలు, అర్థభేదం కలిగి, మరల మరల వస్తూ ఉంటే యమకాలంకారం.

10.1-1792-గ.

ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రి పుత్ర సహజ

పాండిత్య పోతనామాత్య ప్రణీతం బయిన శ్రీమహాభాగతంబను

మహా పురాణంబు నందలి ప్రలంబాసుర హింసనంబును;

దవానల పానం బును; వర్షర్తువర్ణనంబును; శరత్కాల

లక్షణంబును; వేణువిలాసంబును; శ్రీవేణునాథుని

గోపికలు వర్ణించుటయు. హేమంతసమయ

సమాగమంబును గల ఘట్టము

సుసంపూర్ణంబు.

~X~

ఓం

ఓం ఓం ఓం

ఓం శాంతిఃశాంతిఃశాంతిః

లోకాః సమస్తా సుఖినో భవంతు

సర్వం శ్రీకృష్ణార్పణం

నల్లనయ్య వేణునాదమంటే జీవరాశికి ఊపిరి. మన పోతన అన్నగారికి వెన్నదొంగ వేణువర్ణనంటే ఎంతే ఇష్టం. ఈ మన మాయామాణవకుని ప్రభావవైభవాలు ప్రకృతి ప్రజలమీద ఎలాఉంటుందో అలతిపొలతిపదాలలో రుచిచూపిస్తుంది ఈ ఘట్టం. ప్రలంబు మాయచేసి ఏదో చేద్దామని వస్తే అన్నగారిచే మట్టిగరిపించాడు. అడవి అంటుకుందని తనవారు గోలపెడుతుంటే కాపాడాడు. ఋతువులు పరవశించి సేవించుకున్నాయి. గోపికలు జ్ఞానవంతులు కదా మరింత పరవశించారట. ఆ మదుమధురమైన పద్యాలు ఆస్వాదించండి.



- నీ పాదంగులు నమ్మినవారికి
- కర్ణావతంసిత కర్ణికారంబు
- రావే సుందరి యేమే బోటి
- విశ్వమోహనమైన వేణు
- శ్రవణోదంచిత కర్ణికారముతో
- వాజుల నీరాజనములు
- శామంతిగా స్రగంచిత
- అన్నుల చన్నుల దండ

ఈ అద్భుతఘట్టాన్ని చక్కగా భాగవసాధనగా చేసుకుంటూ ఆస్వాదిద్దాం.

– భాగవచ గణనాధ్యాయి. 2026